
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 30
సోమవారం 22-4-2024



'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'



రేట్ల కోతతో రాణించేవి ఏవి?
బంగారానికి అనుకూలం.. ఈక్విటీలకు గణనీయ నష్టాలు
-15లో



బెంగళూరు రనౌట్
ఆఖరి బంతికి ఓడిన ఆర్‌సీబీ.. కోల్‌కతా ఖాతాలో ఐదో విజయం
-14లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎన్నికల్లో నెగ్గలేక రాజ్యసభకు..
లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గలేనివారు రాజస్తాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారని సోనియాపై మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు.
- వివరాలు 6లో



నా భర్తను చంపాలని చూస్తున్నారు
కేజ్రీవాల్‌ను కడతేర్చాలని కేంద్రంలోని బీజేపీ సర్కార్ బలంగా కోరుకుంటోందని ఆయన భార్య సునీత ఆరోపించారు.
- వివరాలు 6లో



ఆగని ఇజ్రాయెల్ దాడులు
దక్షిణ గాజా నగరమైన రఫాలో శరణార్థి శిబిరాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 22 మంది చనిపోయారు.
- వివరాలు 6లో



ముయిజ్జు పార్టీకి మెజారిటీ
మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు సారథ్యంలోని పీఎన్‌సీ భారీ మెజారిటీ సాధించింది.
- వివరాలు 6లో


ధరలు పెంచే 'ఎత్తులు'!

హైదరాబాద్‌లో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్‌పై ఆంక్షలు
- బిల్డర్ల నుంచి ప్రత్యేక పన్ను వసూలుకూ యోచన
- చదరపు అడుగుకు రూ.50–75 చొప్పున వసూలు

బెంగళూరు తరహాలో విధి విధానాలపై కసరత్తు

ఎన్నికల తర్వాత అమలుకు సర్కారు నిర్ణయం

ఇవి అమల్లోకి వస్తే మరింత పెరగనున్న భూములు, ఫ్లాట్ల ధరలు



సాక్షి, హైదరాబాద్: నగరంలో భవనాల ఎత్తుపై పరిమితులు విధించనున్నారు. బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లోనూ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)పై ఆంక్షలు పెట్టాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు భవన నిర్మాణ నిబంధనల్లో ఎఫ్ఎస్ఐ సడలింపుల విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించింది. దీంతో బెంగళూరులోని ఎఫ్ఎస్ఐ నిబంధనలు, మార్గదర్శకాలను రాష్ట్ర అధికారులు అధ్యయనం చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎఫ్ఎస్ఐను అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బెంగళూరులో రోడ్డు వెడల్పును బట్టి ఎఫ్ఎస్ఐ కనిష్టంగా 1.75 నుంచి గరిష్టంగా 3.5 వరకు అనుమతి ఉంది.

ఎఫ్ఎస్ఐ అంటే ఏంటి?

భవన నిర్మాణానికి ఎంత ఏరియా వరకు అనుమతులు ఇవ్వాలో నిర్ణయించేదే ఎఫ్ఎస్ఐ (ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్). ఓపెన్ ప్లాట్‌లో నిర్మాణానికి అనుమతించే మొత్తం బిల్టప్ ఏరియా, ప్లాట్ వైశాల్య నిష్పత్తిని ఇది సూచిస్తుంది. రోడ్డు వెడల్పును బట్టి ఎఫ్ఎస్ఐకి అనుమతి ఇస్తారు. ఉదాహరణకు.. వంద అడుగుల రోడ్డు వెడల్పు ఉన్న ప్రాంతంలో ఎకరం స్థలంలో నిర్మాణం చేపట్టాలంటే బెంగళూరులో అయితే 3 ఎఫ్ఎస్ఐ వరకు అనుమతి ఇస్తారు. ఎకరాకు 43,400 చదరపు అడుగులు x 3 = 1.30 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా వరకు నిర్మాణం చేపట్టవచ్చు. అంటే రెండు బేస్‌మెంట్లు + గ్రౌండ్ + 8 అంతస్తుల నిర్మాణం వస్తుంది. అదే హైదరాబాద్‌లో అయితే ఎఫ్ఎస్ఐపై ఇప్పటివరకు ఆంక్షలు లేవు. ఎంత ఎత్తైనా నిర్మాణం చేయొచ్చు. ప్రస్తుతం వంద ఫీట్ల రోడ్డున్న చోట ఎకరం స్థలంలో నివాస భవనాలకైతే 1.80 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా వరకు నిర్మాణానికి అనుమతి ఇస్తున్నారు. ఈ బిల్టప్ ఏరియాలో గ్రౌండ్ + 20 అంతస్తుల వరకు నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఒకవేళ బెంగళూరు తరహాలో ఇక్కడ కూడా గరిష్టంగా 3 ఎఫ్ఎస్ఐకి అనుమతిస్తే అప్పుడు ఎకరం స్థలంలో అనుమతి వచ్చేది 1.30 లక్షల చదరపు అడుగులే ఉంటుందని డెవలపర్లు చెబుతున్నారు అంటే సుమారు 50వేల చదరపు అడుగుల మేర బిల్టప్ ఏరియా తగ్గుతుందని, 8–10 అంతస్తులు తగ్గిపోతాయని అంటున్నారు.

జీవో 86కు ముందు, ఆ తర్వాత..

నగరాభివృద్ధికి ఆకాశహర్మ్యాలు కూడా ఓ సూచిక. ఆర్థికంగా, సాంకేతికంగా మనం ఎంత శక్తివంతులమో ఇవి చాటుతాయి. జీవనశైలి, కస్టమర్ల అభిరుచిలో మార్పులు వంటి పలు కారణాలతో హైఎండ్, హైరైజ్ భవనాలకు డిమాండ్ ఏర్పడింది. విదేశాల్లో మాదిరిగా హైదరాబాద్‌లోనూ భవనాలకు అపరిమిత ఎత్తుకు అనుమతిస్తూ 2006లో అప్పటి ప్రభుత్వం జీవో 86ను తెచ్చింది. 2006కు ముందు నగరంలో ఐదంతస్తుల భవనాలు, అవి కూడా ఎంసీహెచ్ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) పరిధిలోనే మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నన్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు



కరీంనగర్‌లో తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని, అందుకే ఇప్పటికీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించలేదని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఆరోపించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యతని విమర్శించారు.
- వివరాలు 10లో

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు విద్యార్థుల మృతి



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ విద్యార్థులు మృతి చెందారు. ఇద్దరూ ఉన్నత చదువులకు అమెరికా వెళ్లినవారే. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.
- వివరాలు 3లో



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

వ్యవస్థలన్నీ విధ్వంసం

ప్రధాని మోదీపై సీఎం రేవంత్ ధ్వజం

- బీజేపీకి ఓట్లడిగే అర్హతే లేదు
- రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఇండియా కూటమిని గెలిపించాలి
- రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలను బొంద పెట్టాలి
- ప్రభుత్వం పడిపోతదని ఎవరైనా అంటే కొడతాం
- తనతోపాటు సీఎంగా అర్హత ఉన్న వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డే అని వ్యాఖ్య

సాక్షి యాదాద్రి: 'ప్రధాని మోదీ దెబ్బకు దేశంలో ప్రజాస్వామ్య, పార్లమెంటరీ వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐలన్నింటినీ చెరబట్టి విధ్వంసం సృష్టిస్తున్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడాలంటే దేశంలో ఇండియా కూటమి గెలవాలి. రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా కాంగ్రెస్ ఎన్నడూ కమ్యూనిస్టులను కించపర్చలేదన్నారు. ఇండియా కూటమిగా మనమందరం కలిసి బీజేపీ, బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.


బిడ్డ కోసం కేసీఆర్ గూడుపుఠాణి: 'పార్లమెంట్ సాక్షిగా రాష్ట్ర అవతరణను తప్పుపట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన పార్టీకి చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అర్వింద్, బూర నర్సయ్యగౌడ్‌లకు మిగతా 2వ పేజీలో ▶



విశాఖలోని అక్కయ్యపాలెంలో ఏపీ సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న భారీ జనసందోహంలో ఓ భాగం

జజ్జనకరి.. జనారే.. జగన్ వెనుక జనాలే
5లో

70 ఏళ్ల అవినీతి, అక్రమాలను సరిదిద్దుతున్నాం



ఆదివారం పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

- 2047నాటికి వికసిత భారత్ మోదీ గ్యారంటీతో ముందుకెళుతున్నాం
- మూడు దశాబ్దాల తర్వాత దేశానికి ఓ సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించా
- తెలుగులో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏడు దశాబ్దాలుగా పేరుకుపోయిన అవినీతి, అక్రమాలు, అన్యాయం, బంధుప్రీతిని సరిదిద్దే పనిని మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిబద్ధతతో చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ మోదీ గ్యారంటీతో ముందుకెళుతున్నామని వివరించారు. పదేళ్ల మోదీ పాలనలో ఉగ్రదాడులు పూర్తిగా తగ్గిపోయాయని, దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు నక్సలైట్ల భరతం పడుతున్నామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలుగులో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అవినీతిపరులు జైలుకు పోతున్నారని, మోదీ ప్రభుత్వం అవినీతిపై ఉక్కుపాదం మోపిందన్నారు. ఇదే ప్రజలకు మోదీ ఇస్తున్న గ్యారంటీ అని చెప్పారు. భారత్ ప్రపంచ ఐదోఅతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉండేందుకు ఇల్లు ఇదంతా ఇది మిగతా 2వ పేజీలో ▶



సాక్షి ఎలక్షన్ 2024

జాతీయం..

మలబార్ వార్
కేరళలో టఫ్ ఫైట్

తెలుగువారి లీవి
మైనారిటీ సర్కారుతోనే పీవీ ఇంద్రజాలం
వివరాలు 11లో

తెలంగాణ

నల్లనేలలో నెగ్గేదెవరు?
పెద్దపల్లిపై మూడు పార్టీల గురి 10లో

ఆంధ్రప్రదేశ్

మీ ఆరోగ్యానికి మాదీ భరోసా
రూ.5 లక్షల్లోపు వార్షికాదాయ వర్గాల వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపు
12లో

రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

రాష్ట్రంపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులపాటు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా కోస్తా తీరం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది.
- వివరాలు 2లో

కరువు నేలపై జలధార!

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కొడిచిరలో దాహార్తి తీరుస్తున్న కోనేరు 3లో

ఎంత కరువొచ్చినా ఎండిపోలేదని చెప్తున్న గ్రామస్తులు





ఇంకొన్ని మార్పులు చేసుకొచ్చాను.. ఒకసారి చూడండి సార్!

అర్ధరాత్రయినా అభయం



టీ సేఫ్.. బీ సేఫ్

క్యాబ్, ఆటో ప్రయాణంపై పోలీసు పర్యవేక్షణ

తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం వినూత్న సేవలు

యాప్, వెబ్‌సైట్, డయల్ 100 ద్వారా నిఘా

- సురక్షితంగా గమ్యం చేరే వరకు అప్రమత్తంగా పోలీసులు..
- టీ–సేఫ్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ
- 30 రోజుల్లో 6,161 ట్రిప్పుల పర్యవేక్షణ
- సాధారణ ఫోన్లతోనూ సేవలు వినియోగించుకోవచ్చు
- ఏదైనా ఇబ్బంది ఏర్పడితే పోలీసులు వెంటనే వాహనం వద్దకు చేరుకునేలా ఏర్పాటు

2లో

మీ భద్రతకు మా భరోసా



మీది ఒంటరి ప్రయాణం కాదని, తెలంగాణ పోలీసులు మీకు తోడుగా ఉన్నారన్న భరోసా కల్పించేందుకు టీ సేఫ్. ఈ టీ–సేఫ్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఎంతో మంది ఈ సేవలు వాడుకుంటున్నారు. మా సహాయం కోరిన ప్రతి ప్రయాణాన్ని పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటివరకు టీ సేఫ్ వినియోగించుకున్న ప్రయాణాలన్నీ సురక్షితంగా కొనసాగాయి.

–శిఖా గోయల్, మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ

కావ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బోడుప్పల్‌లో ఉండే ఆమె రోజూ గచ్చిబౌలిలోని ఆఫీసుకు వెళుతుంది. ఒకరోజు ఆఫీసులో మీటింగ్ పూర్తై బయటకు వచ్చేసరికి అర్ధరాత్రి ఒంటి గంట దాటింది. క్యాబ్ బుక్ చేసుకున్నా సమయం కాని సమయం కావడంతో ఒంటరిగా వెళ్లేందుకు భయపడింది. ఎందుకైనా మంచిదని తన మొబైల్ ఫోన్‌లో ఉన్న టీ–సేఫ్ యాప్ ఓపెన్ చేసి తన ట్రావెల్ వివరాలు నమోదు చేసింది. దీంతో ఆమె ఇల్లు చేరే వరకు పోలీసులు టీ సేఫ్ యాప్‌లో గమనిస్తూనే ఉన్నారు. పోలీసులు చూస్తున్నారన్న భరోసాతో కావ్య ధైర్యంగా ఇల్లు చేరుకుంది.

ఆదిలాబాద్‌కు చెందిన అంజలి హైదరాబాద్‌లో ఓ కాలేజీలో పీజీ చేస్తోంది. ఓ రోజు ఇంటి నుంచి బస్సులో బయలుదేరి జేబీఎస్‌కు చేరుకునే సరికి తెల్లవారుజామున 4:30 గంటలు అయ్యింది. అప్పటికే రోడ్లు సందడిగా ఉండటంతో కేపీహెచ్‌బీలోని తన హాస్టల్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కానీ వెంటనే వాళ్ల నాన్న చేసిన హెచ్చరిక గుర్తొచ్చింది. డయల్ 100కు ఫోన్ చేసి అందులోని ఐవీఆర్ ఆప్షన్‌లో 8 నంబర్ నొక్కింది. వెంటనే టీ–సేఫ్ యాప్ సిబ్బంది ఆమె ప్రయాణంపై నిఘా పెట్టారు. ప్రతి 15 నిమిషాలకోసారి అలర్ట్‌లు పంపుతూ ఐవీఆర్ కాల్స్ చేస్తూనే ఉన్నారు. ఆమె హాస్టల్ చేరుకున్నట్లు నిర్ధారించిన తర్వాత ఆ అలర్ట్‌లు, కాల్స్ ఆగిపోయాయి.

పంటనష్టం 15,000 ఎకరాల్లో

- ప్రాథమిక అంచనా రూపొందిస్తున్న అధికారులు
- ఇప్పటివరకు 3,120 ఎకరాల్లో నష్టం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్లతో దాదాపు 15 వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీంతో వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. నష్టపోయిన పంటలు, రైతుల వివరాలను అధికారులు గుర్తిస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం సమీక్షించారు. ఇప్పటికే పేర్కొన్న 2,200 ఎకరాలకు అదనంగా శనివారం కురిసిన అకాల వర్షాలకు మరో 920 ఎకరాల్లో మొత్తం 3,120 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు ఆయన తెలిపారు. ఇంకా అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని, ఇప్పటివరకు రంగారెడ్డి, జనగాం, నిర్మల్ జిల్లాల్లో పంట నష్టం నమోదైందన్నారు.

పరిహారం పంపిణీ చేసేందుకు సిద్ధం

మార్చి నెలలో కురిసిన వడగళ్ల వానలతో పంటనష్టపోయిన వారికి పరిహారం విడుదల చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదానికి విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. గత నెల వడగళ్లు, అకాల వర్షాలకు 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ నిర్ధారించిన సంగతి తెలిసిందే. 15,246 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు నష్టపోయాయి. వారందరికీ నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 15.81 కోట్లు పరిహారం అందజేయాలని నిర్ణయించింది. అప్పుడు మొత్తం పది జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ పేర్కొంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 10,328 ఎకరాల్లో నష్టం జరిగింది. ఎన్నికల మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి సన్మానం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న జస్టిస్ సూరేపల్లి నందా తదితరులు

సాక్షి, హైదరాబాద్: అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డిని 2009–10 హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఘనంగా సన్మానించింది. గతంలో హెచ్‌సీఏఏ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించిన సుదర్శన్ రెడ్డి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జాయింట్ సెక్రటరీ, న్యాయవాది డీఎల్ పాండు, ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.


నేడు కవిత బెయిల్ పిటిషన్లపై విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్లను సోమవారం ప్రత్యేక కోర్టు విచారించనుంది. మధ్యాహ్నం 2 గంటలకు ఈడీ, సీబీఐ కేసుల్లో రెగ్యులర్ బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను న్యాయమూర్తి కావేరి బవేజా విచారించనున్నారు. తన కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఈడీ కేసులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయమూర్తి నిరాకరించిన విషయం తెలిసిందే. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఎన్నికల ప్రచారంతోపాటు వైద్య పరీక్షల నిమిత్తం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని సీబీఐ కేసులో కవిత మరో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈడీ, సీబీఐ కేసుల్లో జ్యుడీషియల్ కస్టడీ ముగియనుండటంతో అధికారులు మంగళవారం కవితను న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపరచనున్నారు.

ధర్మ పరిరక్షణలో ఆధ్యాత్మికవేత్తల కృషి అవసరం

రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



లక్ష్మణ్‌కు గ్రంథాన్ని అందజేస్తున్న వనం జ్వాలానరసింహారావు

సాక్షి, హైదరాబాద్: సనాతన ధర్మ పరిరక్షణలో ఆధ్యాత్మిక రచయితలు, ధార్మికవేత్తల కృషి సమాజానికి ఎంతో అవసరమని బీజేపీ బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. తమ రచనలు, ప్రసంగాలు, సదస్సుల ద్వారా సమాజానికి వారు ధార్మిక దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఆదివారం తన నివాసంలో ప్రముఖ రచయిత విశ్లేషకులు వనం జ్వాలానరసింహారావు రచన సజీవ వాహిని సనాతన ధర్మం గ్రంథాన్ని లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ...ఇలాంటి గ్రంథాలు నేటి సమాజానికి ధార్మిక దిక్సూచిగా ఉపయోగపడతాయన్నారు. జ్వాలా నరసింహారావు ఇలాంటి గ్రంథాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దర్శనం సంపాదకుడు, గ్రంథ ప్రచురణకర్త మరుమాముల వెంకటరమణ శర్మ, అభిషేక్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాదాలు, పాయసాలతో పిల్లలు పుట్టరు'

సాక్షి, హైదరాబాద్: సంతానం కోసం ప్రసాదాలు, పాయసాలు ఇస్తామంటూ జనాల్లో మూఢ నమ్మకాలను పెంచి పోషించే ప్రయత్నం జరుగుతోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి విమర్శించారు. స్త్రీలకు సంతానం కలగడానికి 'గరుడ ప్రసాదం'పంపిణీ చేస్తామంటూ చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన పూజారి ప్రకటించడంతో గత మంగళవారం ఆలయం వైపు వెళ్లే మార్గాలన్నీ కిక్కిరిసిపోయి కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయ్యిందన్నారు. గరుడ ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలగడం ఖాయమని చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన పూజారి రంగరాజన్ చేసిన తెలివి తక్కువ ప్రకటనను ఖండిస్తున్నామన్నారు.

పంటనష్టం 15,000 ఎకరాల్లో

▶ మొదటి పేజీ తరువాయి

సంఘాన్ని మరోసారి సంప్రదించి నిధుల విడుదలకు అనుమతులు పొందేలా విజ్ఞప్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాటితోపాటే ఇప్పుడు జరిగిన నష్టాన్ని మదింపు చేసి నివేదిక సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంట నష్టానికి సంబంధించిన నివేదికలు అందిన వెంటనే పరిహార నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వానాకాలం ముందు సరఫరా చేసే పచ్చి రొట్ట విత్తనాల సేకరణకు టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు.

టీ సేఫ్.. బీ సేఫ్

క్యాబ్, ఆటో ప్రయాణంపై పోలీసు పర్యవేక్షణ

తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం వినూత్న సేవలు

యాప్, వెబ్‌సైట్, డయల్ 100 ద్వారా నిఘా



సాక్షి, హైదరాబాద్: మహిళలు, బాలికలు, ఇతర పౌరులు ఎవరైనా సరే ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు వారు సురక్షితంగా గమ్యం చేరేవరకు పర్యవేక్షించేలా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలోని మహిళా భద్రత విభాగం టీ–సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మార్చి 12 నుంచి ఇది ప్రారంభం కాగా కావ్య, అంజలితో పాటు ఇప్పటివరకు 6 వేల మందికి పైగా 'టీ–సేఫ్'సేవలు వినియోగించుకోవడం విశేషం. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడానికి బదులు, జరగకుండా నివారిస్తూ ప్రజలకు ముఖ్యంగా మహిళలకు అండగా నిలవడమే లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో రాష్ట్ర పోలీసులు ఈ తరహా ప్రయాణంపై పర్యవేక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేవలం స్మార్ట్ ఫోన్లే కాకుండా సాధారణ ఫోన్ల నుంచి సైతం ఈ సేవలు పొందేందుకు అవకాశం ఉండటం విశేషం. కాగా సాధారణ ఫోన్ల ద్వారానే ఎక్కువమంది టీ–సేఫ్ సేవలు పొందుతున్నారని అధికారులు తెలిపారు.

పెరుగుతున్న అవగాహన

టీ–సేఫ్ సేవలకు ప్రచారం కల్పిస్తూ మహిళా భద్రత విభాగం రూపొందించిన వీడియో (www.youtube.com/watch?v=vw54PrqfFhU) రాష్ట్రవ్యాప్తంగా వైరల్‌గా మారింది. వాట్సాప్ సహా ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రజలు దీనిని వీక్షిస్తున్నారు. సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంచుకుంటున్నారు. మార్చి 12 నుంచి ఈనెల 19 వరకు మొత్తం 6,161 ప్రయాణాల్లో పౌరులు ఈ సేవలు వినియోగించుకున్నారు. ప్రయాణం పూర్తయ్యే వరకు నిర్దీత సమయంలో లోపల పోలీసుల నుంచి అలర్ట్ ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్ వస్తుండడంతో పౌరులు ముఖ్యంగా మహిళలు ఎలాంటి అభద్రతా భావం, ఆందోళన లేకుండా ప్రయాణిస్తున్నారని, ఈ మేరకు టీ–సేఫ్ వినియోగం క్రమంగా పెరుగుతోందని, యాప్ డౌన్‌లోడ్‌లు పెరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. తమ ప్రయాణాన్ని నిజంగానే పోలీసులు గమనిస్తున్నారా..? లేదా..? అని పరీక్షించేందుకు కూడా కొందరు టీ–సేఫ్ సేవలను వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు.

మూడు రకాలుగా టీ-సేఫ్ సేవలు

టీ–సేఫ్ యాప్

స్మార్ట్‌ఫోన్లు ఉన్నవారు గూగుల్ ప్లే స్టోర్ (https://play.google.com/store/apps/details?id=com.tswomensafety.tsafe) నుంచి టీ–సేఫ్–తెలంగాణ పోలీస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి. అంతే సదరు మహిళ/బాలిక/పౌరుడు సురక్షితంగా గమ్యం చేరే వరకు పోలీసులు లైవ్ ట్రాకింగ్ ద్వారా వారి ప్రయాణాన్ని పర్యవేక్షిస్తారు.. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే రంగంలోకి దిగుతారు.

డయల్ 100

ఇందుకు స్మార్ట్ ఫోన్ అవసరం లేదు. సాధారణ ఫోన్ ఉన్నవారు ప్రయాణం ప్రారంభించే ముందు డయల్ 100కు కాల్ చేయాలి. అందులో వచ్చే ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) ఆప్షన్‌లో 8 నంబర్‌ను నొక్కాలి. వ్యక్తిగత వివరాలు, ఎక్కడి నుంచి ఎక్కడి ప్రయాణిస్తున్నాం..ప్రయాణించే వాహనం నంబర్ లాంటి వివరాలు ఇస్తే సరిపోతుంది. వెంటనే ఒక కోడ్ నంబర్‌ను పెట్టుకోవాల్సిందిగా సూచిస్తారు. ఆ తర్వాత గమ్యం చేరేవరకు పోలీసుల నుంచి ప్రతి 15 నిమిషాలకు మీకు అలర్ట్ మెసేజ్, మధ్యలో ఐవీఆర్ పద్ధతిలో ఫోన్‌కాల్స్ వస్తుంటాయి. అప్పుడు ముందే పెట్టుకున్న కోడ్ ద్వారా ఆన్సర్ చేయాల్సి ఉంటుంది. ఆ ఫోన్‌లో ఇతరులు ఆన్సర్ చేసేందుకు అవకాశం లేకుండా ముందే సిద్ధం చేసి పెట్టుకున్న కోడ్ ఉపకరిస్తుంది. ఒక వేళ సరైన స్పందన లేకపోతే వెంటనే వాహనం వివరాలు, రూట్, లైవ్ ట్రాకింగ్ లింక్ ఆ పరిధిలోని పోలీస్ ప్యాట్రో వాహనాలకు వెళతాయి. నిమిషాల వ్యవధిలోనే వారు సదరు ప్రయాణ వాహనం వద్దకు చేరుకుంటారు.

టీ–సేఫ్ వెబ్‌సైట్

ఒకవేళ ఆ సమయానికి స్మార్ట్‌ఫోన్‌లో యాప్ లేదనుకోండి.. https://tsafe.tspolice.gov.in/wap/వెబ్‌సైట్ ఉపయోగించవచ్చు. ఇందులోకి లాగిన్ అయిన తర్వాత ఎక్కడికి వెళ్లాలి?, పేరు, మహిళలా..పురుషులా?, మొబైల్ నంబర్, ఏ వాహనంలో ప్రయాణిస్తున్నారు, వాహనం నంబర్ నమోదు చేయాలి. ఆ తర్వాత స్టార్ట్ మై ట్రిప్ ఆప్షన్ ఓకే చేయాల్సి ఉంటుంది. అంతే ప్రయాణికుడు / ప్రయాణికురాలు గమ్యం చేరే వరకు పోలీసులు పర్యవేక్షిస్తుంటారు.

ఈనెల 19 వరకు టీ సేఫ్ వినియోగం ఇలా..	నమోదైన ట్రిప్పులు	బేసిక్ ఫోన్ల ద్వారా	వెబ్‌సైట్ ద్వారా	ఆండ్రాయిడ్ యాప్ ద్వారా	ప్రయాణం పర్యవేక్షిస్తూ పోలీసులు పంపిన ఎస్ఎంఎస్‌లు	వెరిఫికేషన్ కాల్స్
	6,161	5,238	77	846	18,149	7,486

డ్రైవర్లకు మాత్రమేనా?

ఆర్టీసీ బాండ్ల బకాయిల చెల్లింపులో గందరగోళం

- డ్రైవర్లకు ఇచ్చి.. మిగతా ఉద్యోగులకు పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: పాత బకాయిల చెల్లింపు ఆర్టీసీలో గందరగోళానికి దారితీస్తోంది. కొంతమందికి మాత్రమే చెల్లించి మిగతా ఉద్యోగులకు చెల్లించకపోవటమే దీనికి కారణం. అయితే బకాయిల చెల్లింపునకు సంబంధించి ఏ ఊసూ లేక ఉద్యోగులు ఉసూరుమంటున్నారు. దాదాపు 15 వేలమంది డ్రైవర్లకు ఆ బకాయిలు అందగా, 28 వేల సంఖ్యలో ఉన్న మిగతా ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

స్వయంగా సీఎం ప్రకటించినా..

రాష్ట్ర విభజనకు ముందు 2013లో ఆర్టీసీలో వేతన సవరణ చేయాల్సి ఉంది. కానీ, తెలంగాణ ఉద్యమం జరుగుతుండటంతో ఉమ్మడి ప్రభుత్వం చేయలేకపోయింది. రాష్ట్ర విభజన తర్వాత 2015లో తెలంగాణ ప్రభుత్వం వేతన సవరణ చేసింది. రెండేళ్ల కాలానికి సంబంధించిన బకాయిల్లో సగ భాగాన్ని విడతల వారీగా చెల్లించి మిగతా సగాన్ని ఐదేళ్ల కాలపరిమితితో చెల్లించేలా బాండ్లు విడుదల చేసింది. 8.75 శాతం వడ్డీతో 2020 అక్టోబరు ఒకటిన వాటిని చెల్లించాల్సి ఉంది. కానీ, నిధుల లేమితో నాటి ప్రభుత్వం చెల్లించలేకపోయింది. 2 నెలల క్రితం నెక్లెస్ రోడ్డు సమీపంలో కొత్త బస్సులు ప్రారంభించేందుకు వచ్చిన సీఎం రేవంత్ వాటిని చెల్లించనున్నట్టు ప్రకటించారు. ఇందుకు రూ.280 కోట్లను విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. నెలన్నర తర్వాత ఆర్టీసీ డ్రైవర్లకు ఆ బకాయిలు అందాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల ఆధారంగా వాటిని చెల్లిస్తున్నట్టు ఆ సమయంలో ఆర్టీసీ ప్రకటించింది. అయితే తదుపరి నిధులు విడుదల కాగానే మిగతావారికి చెల్లిస్తారని ఉద్యోగులు భావించారు. కానీ వాటి ఊసే లేకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

ఏళ్ల జాప్యంతో వడ్డీ మాటేమిటి?: ఈ బకాయిల చెల్లింపులో గందరగోళం నెలకొనటంతోపాటు వాటిపై చెల్లించాల్సిన వడ్డీ విషయంలోనూ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2015 అక్టోబరులో బాండ్ల చెల్లింపు అంశాన్ని తెరపైకి తెచ్చి ఐదేళ్ల కాలపరిమితి విధించినందున 2020 అక్టోబరు1న చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు ఆలస్యంగా చెల్లిస్తున్న ప్రభుత్వం 2020 అక్టోబరు వరకే వడ్డీని లెక్కిస్తున్నట్టు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

'శ్వేతపత్రం విడుదల చేయాలి: తక్షణమే మిగతా ఉద్యోగులందరికీ బకాయిలు చెల్లించాలని, ఎనిమిదిన్నరేళ్ల కాలానికి నిర్ధారిత 8.75% వడ్డీ లెక్కగట్టి చెల్లించాలని కోరారు. వీటన్నింటిపై ఆర్టీసీ ఓ శ్వేతపత్రం విడుదల చేయాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వ్యవస్థలన్నీ విధ్వంసం

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లు అడిగే అర్హత లేదు. తన బిడ్డకు బెయిల్ ఇప్పించడానికి బీజేపీతో కేసీఆర్ గూడు పుఠాణి నడుపుతున్నారు. బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు వచ్చినా ఢిల్లీకి వెళ్లి మోదీకి తాకట్టు పెడతారు. ఏ అవకాశం వచ్చినా, ఏ బిల్లు పెట్టినా గత పదేళ్లలో బీఆర్‌ఎస్ వాళ్లు బీజేపీకే మద్దతు పలికారు..' అని రేవంత్ విమర్శించారు.

కాంగ్రెస్‌ను ఎందుకు ఓడిస్తారు?

'కాంగ్రెస్‌ను ఓడించాలని కేసీఆర్ అంటున్నాడు. ఎందుకు ఓడించాలి? ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు ఓడించాలా? రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించినందుకు ఓడించాలా? 40 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నందుకు ఓడించాలా? కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఈ మేరకు వివరాలు ఇస్తాం. దమ్ముంటే భువనగిరి సెంటర్‌లో చర్చకు రావాలి. కేసీఆర్ తెలంగాణను చెరబట్టి రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చాడు. పోటీ పరీక్షలు నిర్వహించకుండా నిరుద్యోగుల ఉసురు తీసుకున్న వ్యక్తి కేసీఆర్. పదేళ్లలో ఒక్కరికి కూడా కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లో పేదల సంక్షేమానికి ఇన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకెళుతుంటే.. ప్రభుత్వం పడిపోతుందని కేసీఆర్ పదే పదే అంటున్నాడు. ఇదేమైనా ఫుల్ బాటిలా పడిపోవడానికి? ప్రభుత్వం పడిపోతదని ఎవరైనా మాట్లాడితే ఉరికించి కొడతాం..' అని సీఎం అన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ డబుల్ ఇంజన్‌లాంటోళ్లు

'నాతో పాటు ఎవరికైనా ముఖ్యమంత్రి పదవికి అర్హత ఉందంటే అది కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే. అధిష్టానం ఆదేశాల ప్రకారం నేను ప్రత్యేక పరిస్థితిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టా. ముఖ్యమంత్రి పదవిని నేను ఎప్పుడూ బాధ్యతతో చూశానే తప్ప అహంకారంతో చూడలేదు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి భువనగిరికి డబుల్ ఇంజన్‌లాంటి వాళ్లు. కష్ట నష్టాల్లో పేదలకు సేవలందించిన మీ బిడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. కోమటిరెడ్డి బ్రదర్స్‌ను భూమికి మూరెడు లేని సన్నాసి విమర్శిస్తున్నాడు. కోమటిరెడ్డి బ్రదర్స్.. దొరకు సారాలో సోడాపోసి రాజకీయాల్లోకి రాలేదు. రక్తాన్ని చెమటగా మార్చి భుజాలు కాయలు కాసేలా మూడు రంగుల జెండాను మోసి రాజకీయాల్లో పైకి వచ్చారు. భువనగిరి పోరాటాలకు గడ్డ. ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని 3 లక్షల మెజారిటీతో గెలిపించాలి. కిరణ్‌ను గెలిపిస్తే భువనగిరిని ట్రిపుల్ ఇంజన్‌లా అభివృద్ధి చేస్తాడు. రూ.50 వేల కోట్లతో మూసీని ప్రక్షాళన చేసి మురికి నుంచి విముక్తి కలిగించే బాధ్యత నాది. కాలువలు పూర్తి చేసే బాధ్యత నాది. యాదాద్రిని మళ్లీ యాదగిరిగుట్టగా మార్చుకుందాం. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సాక్షిగా మాట ఇస్తున్నా...పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసే బాధ్యత నాది. వచ్చే పంటకు రూ.500 బోనస్ అందించే బాధ్యత నాది..' అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



భువనగిరిలో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన పార్టీ శ్రేణులు

కాంగ్రెస్ జోలికొస్తే తొక్కుతాం: వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించుతామంటే బీఆర్‌ఎస్ భవనాలను నేలమట్టం చేస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ జోలికి వస్తే తొక్కుతామని అన్నారు. రేవంత్‌రెడ్డిని టచ్ చేస్తే మాడి మసైపోతారని చెప్పారు. తెలంగాణలో ఉండేది, ఉండబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరిలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, కేంద్రంలో కూడా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొందపెట్టిన విధంగానే.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని బండకేసి కొట్టాలని పిలుపునిచ్చారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేముల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు చోట్ల రేవంత్ ప్రచారం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం మూడు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల పరిధిలో జరిగే సభల్లో ఆయన ప్రసంగించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్, మధ్యాహ్నం ఒంటి గంటకు నిజామాబాద్, సాయంత్రం 4.15కు మేడ్చల్ (మల్కాజిగిరి నియోజకవర్గం) బహిరంగ సభల్లో రేవంత్ పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

రెండ్రోజులు అక్కడక్కడా వర్షాలు

రాష్ట్రంపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి



సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి కాలనీలో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా కోస్తా తీరం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది. మరోవైపు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. అయితే వచ్చే రెండ్రోజులు సాధారణం కంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఉక్కపోత పెరగొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతల పెరుగుదలకుతోడు రెండు రోజులపాటు వడగాడ్పులు కూడా వీయొచ్చని పేర్కొంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల గాలివాన

హాలియా, భానుపురి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అనుముల మండలంతోపాటు హాలియా, సూర్యాపేట పట్టణం, ఆత్మకూర్ (ఎస్) మండలంలో గాలిదుమారంతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులకు హాలియాలో ఎడమ కాల్వ సమీపంలోని శివాలయ ధ్వజస్తంభం విరిగిపోయింది. సూర్యాపేటలోని అంజనాపురి కాలనీ, విద్యానగర్‌తోపాటు పలు వార్డుల్లో చెట్లు విరిగిపడ్డాయి.

ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
తిరుపతి	45.0
రెంటచింతల	43.8
భద్రాచలం	42.2
ఖమ్మం	42.0
ఆదిలాబాద్	41.8
రామగుండం	41.6
మహబూబ్‌నగర్	41.5
నల్లగొండ	41.0
నిజామాబాద్	39.9
హనుమకొండ	39.0
హైదరాబాద్	38.8
మెదక్	38.6

24న 'ఇంటర్', 25న 'జేఈఈ'.. మే మొదటివారంలో టెన్త్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: పరీక్ష ఫలితాల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు ఇది శుభవార్తే. వచ్చే 15 రోజుల్లో ముఖ్యమైన పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. దీనికోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ నెల 24వ తేదీన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు వెల్లడించనున్నారు. రెండేళ్లకు కలిపి మొత్తం 9.80 లక్షల మంది పరీక్ష రాశారు. వాస్తవానికి ఈ నెల 22నే ఫలితాలు వెల్లడించాలని అధికారులు అనుకున్నారు. అయితే సాంకేతికపరమైన పరిశీలన ఆలస్యం కావడంతో 23న ప్రకటించాలని భావించారు. ఆ రోజు మంగళవారం కావడంతో ఓ అధికారి సెంటిమెంట్ కుదరదని చెప్పారు. దీంతో ఫలితాల వెల్లడి 24కు వాయిదా పడింది. ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18 వరకూ జరిగాయి. మార్చి 16 నుంచే మూల్యాంకనం చేపట్టారు. ఇది ఏప్రిల్ మొదటి వారంతో ముగిసింది. ఈసారి మాల్‌ప్రాక్టీస్ కేసులు ఎక్కువయ్యాయి. గ్రామీణ నేపథ్యమున్న విద్యార్థులు సిలబస్ సకాలంలో పూర్తవ్వలేదని చెబుతున్నారు. దీంతో ఫలితాలు కాస్త తగ్గుతాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇంటర్ ఫలితాల తర్వాత నెల రోజుల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్–2 ఫలితాలు ఈ నెల 25న వెల్లడించబోతున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. జనవరిలో మొదటివిడత మెయిన్, రెండో విడత మెయిన్ ఏప్రిల్ 4 నుంచి 12 వరకూ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 12 లక్షల మంది వరకూ ఈ పరీక్షకు హాజరయ్యారు. మొదటి విడత మెయిన్‌కు ర్యాంకులు ఇవ్వరు. ఇందులో అర్హులైన వారు కూడా మంచి ర్యాంకుకు రెండో విడత పరీక్ష రాశారు. దీంతో జాతీయస్థాయి ర్యాంకులను ప్రకటించనున్నారు. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత కల్పిస్తారు. ఇందులో వచ్చే ర్యాంకును బట్టి ఐఐటీలో సీట్లు కేటాయిస్తారు. జేఈఈ ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీలు, రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు ఇస్తారు.

సాంకేతికపరమైన సమస్యలు తలెత్తకుండా..

రాష్ట్రవ్యాప్తంగా 5.08 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. మార్చి 18 నుంచి మొదలైన ఈ పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకూ కొనసాగాయి. 36 లక్షల సమాధాన పత్రాలను 17 కేంద్రాల్లో మూల్యాంకనం చేపట్టారు. ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. దీని తర్వాత ఓఎంఆర్ షీట్లపై ఉన్న కోడ్‌ను డీకోడ్ చేస్తారు. ఆ తర్వాత అన్ని సబ్జెక్టుల మార్కులను క్రోడీకరిస్తారు. సాంకేతికపరమైన సమస్యలు రాకుండా పలుమార్లు పరిశీలిస్తారు. ఇదంతా ఈ నెలాఖరుకు పూర్తవుతుందని అధికారులు తెలిపారు. మే తొలివారంలో ఫలితాలు వెల్లడిస్తామని ఓ అధికారి వెల్లడించారు.

ధరలు పెంచే 'ఎత్తులు'

▶ మొదటి పేజీ తరువాయి

ఉండేవి. అప్పుడు 95% అభివృద్ధి ఎంసీహెచ్ పరిధిలో, 5% మిగిలిన మున్సిపాలిటీల్లో జరిగేది. ఆ తర్వాత అభివృద్ధి శివార్లకు విస్తరించింది. నిర్మాణ సంస్థలు అంతర్జాతీయ డిజైన్లు, ఎలివేషన్స్, సెవెన్ స్టార్ స్థాయిలో క్లబ్ హౌస్‌లు, ల్యాండ్ స్కేపింగ్‌లతో భవనాల రూపురేఖలే మారిపోయాయి.

ఎఫ్ఎస్ఐతో ధరల పెరుగుదల: ఆకాశ హర్మ్యాలతో జనసాంద్రత పెరగడంతోపాటు డ్రైనేజీ, రోడ్లు, నీరు వంటి అన్ని రకాల మౌలిక వసతులపై అదనపు భారం పడుతుంది. భూమి లభ్యత తక్కువగా ఉన్న ముంబై, బెంగళూరు వంటి నగరాల్లోనే ఎఫ్ఎస్ఐకు పరిమితులుండగా.. స్థలం లభ్యత ఉన్న హైదరాబాద్‌లో మాత్రం ఎలాంటి ఆంక్షల్లేవు. దీంతో స్థలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఎంత ఎత్తయినా నిర్మాణాలు చేపడుతున్నారు. ఎఫ్ఎస్ఐ అమల్లోకి వస్తే నిర్మాణ పరిమితుల దృష్ట్యా భూముల ధరలు పెరిగి, ఫ్లాట్ల ధరలూ పెరుగుతాయని నగరంలోని ఓ డెవలపర్ చెప్పారు. దీంతో సామాన్యుని సొంతింటి కల మరింత దూరమవుతుందని భావిస్తున్నారు.

బిల్డర్ల నుంచి స్పెషల్ ట్యాక్స్

బెంగళూరు తరహాలోనే ఎఫ్ఎస్ఐపై ఆంక్షలు విధించాక హైదరాబాద్‌లోనూ బిల్డర్ల నుంచి స్పెషల్ ట్యాక్స్ వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు పలు డెవలపర్ల సంఘాలతో సర్కారు పెద్దలు చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా హైరైజ్ భవన నిర్మాణ అనుమతులను నిలిపివేసినట్లు తెలిసింది. నివాస, వాణిజ్య భవనాలకు వేర్వేరుగా ఈ ట్యాక్స్ ఉండనుంది. చదరపు అడుగుకు రూ.50–75 చొప్పున వసూలు చేసే అవకాశముంది. చిన్న, మధ్య తరహా బిల్డర్లపై భారం పడకుండా తొలుత లక్ష చదరపు అడుగులకు మించి నిర్మించే ప్రాజెక్టులకు మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ట్యాక్స్ అమల్లోకి వస్తే ఆ మేరకు ఫ్లాట్ల ధరలు పెరిగే అవకాశం ఉంటుందని బిల్డర్లు చెబుతున్నారు.

70 ఏళ్ల అవినీతి, అక్రమాలను సరిదిద్దుతున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

మోదీ గ్యారంటీ అని, మూడోసారి మోదీ ప్రధాని అయితే చేపట్టే కార్యక్రమాలను ఆయన వివరించారు.

అది రాహుల్‌గాంధీ అన్యాయపత్రం: లక్ష్మణ్

కాంగ్రెస్ మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ అన్యాయపత్రంగా ప్రజలు అభిప్రాయపడుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రవేశపెట్టిన సంకల్పపత్రాన్ని ప్రజలంతా మోదీ గ్యారంటీ అంటున్నారన్నారు. యూపీఏ పాలనలో దేశం భ్రష్టుపట్టిందని, ప్రజలు మార్పు కోసం మోదీని ఎంచుకున్నారని చెప్పారు. యూపీఏ హయాంలో రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని, ఇండియా కూటమి పేరుతో ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్ మేనిఫెస్టో మాదిరిగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, ప్రకాష్‌రెడ్డి, కొల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన
- మృతుడు జనతన సర్కార్ అధ్యక్షుడు గుడ్డి కవాసీగా గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా బైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేష్‌కుతల్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందగా, ఘటనా ప్రాంతం నుంచి ఒక ట్వెల్వ్‌బోర్ తుపాకీ, ఒక టిఫిన్ బాంబు, పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన మావోయిస్టును జనతన సర్కార్ అధ్యక్షుడు గుడ్డి కవాసీగా గుర్తించారు. అతడిపై రూ.లక్ష రివార్డు ఉంది. మృతదేహాన్ని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించామని, ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశామని బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు.

మావోయిస్టు మిలీషియా డిప్యూటీ కమాండర్ లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో భద్రాచలం ఏఎస్పీ, ఇతర అధికారులు

చర్ల (భద్రాద్రి జిల్లా): మావోయిస్టు పార్టీ మిలీషియా డిప్యూటీ కమాండర్‌తో పాటు ఐదుగురు కమిటీ సభ్యులు ఆదివారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఎదుట లొంగిపోయారు. వివరాలు చర్ల మండల సరిహద్దు ఆదివాసీ గ్రామాల్లో ఇటీవల రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. దీనికి ఆకర్షితులైన ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారని విలేకరులకు తెలిపా రు. లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పుట్టపాడుకు చెందిన మిలీషి యా డిప్యూటీ కమాండర్ కర్టం పొజ్జా, డోకుపాడుకు చెందిన కమిటీ సభ్యులు ఉన్నారన్నా రు. మిగిలిన వారు కూడా లొంగి పోతే వారిపై ఉన్న కేసులు ఎత్తివేయడంతో పాటు ప్రభు త్వం తరఫున అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తల్లిని పరామర్శించిన రాధాకిషన్‌రావు

- ఫోన్‌ట్యాపింగ్ కేసు కీలక నిందితుడిని కరీంనగర్‌కు తీసుకొచ్చిన జైలు సిబ్బంది



కరీంనగర్ క్రైం: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్‌రావును ఆదివారం కరీంనగర్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తల్లిని చూసేందుకు రాధాకిషన్‌రావు వచ్చారు. అనారోగ్యంతో ఉన్న తన తల్లిని చూసేందుకు అనుమతివ్వాలని ఆయన కోర్టుకు విన్నవించగా అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు సిబ్బంది గట్టి భద్రత మధ్య ఆయనను కరీంనగర్‌కు తీసుకొచ్చారు. రాధాకిషన్‌రావు తల్లి పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె చికిత్సకు సంబంధించిన వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తిరిగి ఆయనను హైదరాబాద్ తరలించినట్లు తెలిసింది.

కరువు నేలపై జలధార!

- కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కొడిచిరలో దాహార్తి తీరుస్తున్న కోనేరు
- ఎంత కరువొచ్చినా ఎండిపోలేదని చెప్తున్న గ్రామస్తులు



నీటితో కళకళలాడుతున్న కోనేరు

సాక్షి, కామారెడ్డి/మద్నూర్: ఆ చుట్టుపక్కల ఎలాంటి నీటి వనరులు లేవు. భూగర్భజలాలు కూడా అంతంత మాత్రమే. వర్షాధారంగానే పంటలు సాగు చేస్తుంటారు. కానీ అక్కడున్న ఓ కోనేరు మాత్రం అన్ని కాలాల్లోనూ నీటితో నిండుగా ఉంటుంది. కరువు కాటకాలు వచ్చినప్పుడు కూడా ఎండిపోకపోవడం దీని ప్రత్యేకత. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కొడిచిర గ్రామ శివారులో ఆలయాల వద్ద ఈ కోనేరు ఉంది. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో అంతటా భూగర్భ జల మట్టాలు పడిపోయి నీటి సమస్య తలెత్తుతున్నా.. ఇక్కడ కోనేరు నీటి ఊటలతో భక్తుల దాహార్తి తీరుస్తోంది.

మూడు రాష్ట్రాల భక్తులతో..: కొడిచిర గ్రామం తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుకు సమీపంలో ఉంటుంది. గ్రామ శివారులోని గుట్టల మధ్య చెన్నమ్మకోరి, వీరభద్ర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, శివాలయం ఉన్నాయి. వీటికి సమీపంలో వందేళ్ల క్రితం తవ్వించిన కోనేరు ఉంది. సుమారు 30 అడుగుల లోతున్న ఈ కోనేరులో ఎప్పుడూ నీటి ఊట ఉంటుందని గ్రామస్తులు చెప్తున్నారు. ఈ ఆలయాలను దర్శించుకునేందుకు మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఏటా శ్రావణ మాసంలో నెల రోజుల పాటు ఇక్కడ అన్నదానం చేస్తారు. దానికి, భక్తులు తాగడానికి కోనేరులోని నీటినే వినియోగిస్తారు. గ్రామంలో తాగునీరు లభించని సమయాల్లో ఈ కోనేరు నుంచే నీటిని తీసుకెళ్తామని గ్రామస్తులు చెప్తున్నారు.

ఏనాడూ ఎండిపోలేదు



ఇక్కడి చెన్నమ్మకోరి ఆలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. కోనేరు ఎప్పుడూ ఎండిపోలేదు. నీరు కూడా రుచిగా ఉంటుంది.
– జుబ్రే రాంచందర్, గ్రామస్తుడు, కొడిచిర

ఊటలు తగ్గలేదు



గుట్టల మధ్య ఉన్న ఈ ఆలయాలకు తరచూ వెళ్తుంటాను. ఏటా శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. నెల రోజుల పాటు వేల మంది భక్తులు వస్తారు. వారికి అన్నదానం, తాగడానికి ఈ కోనేరు నీటినే వాడుతారు.
– పరమేశ్ పటేల్, గ్రామస్తుడు, కొడిచిర

పవిత్రమైనదిగా భావిస్తాం



చెన్నమ్మకోరి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరును ఎంతో పవిత్రంగా భావిస్తాం. పండుగల సమయంలో భజనలు, కీర్తనలు, సప్తాహాలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి.
– శ్రీరాం, గ్రామస్తుడు, కొడిచిర

సివిల్ ర్యాంకర్లను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్



ర్యాంకర్లను అభినందిస్తున్న జస్టిస్ ఈవీ వేణుగోపాల్

కరీంనగర్ క్రైం: యువత సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సూచించారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన నివాసంలో ఆదివారం సివిల్ ర్యాంకర్లకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందాల సాయి కిరణ్, కొలనుపాక సహనను అభినందించి ఘనంగా సన్మానించారు. ర్యాంకులు సాధించేందుకు దోహదపడిన అంశాలపై ఇష్టాగోష్టిగా వారితో చర్చించారు. రాజ్యాంగానికి లోబడి వృత్తిని కొనసాగిస్తూనే సమాజంలోని అన్నివర్గాలకు న్యాయం చేయాలని సూచించారు. గొప్ప వ్యక్తులు, సివిల్ ర్యాంకర్లను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి గల్లీ నుంచి సివిల్ ర్యాంకులు సాధించి ఎదగాలని ఆకాంక్షించారు. పుట్టిన గడ్డ గర్వపడేలా మరో పది మందికి ఆదర్శంగా నిలుస్తూ పేరు, ప్రతిష్టలు సంపాదించాలని తెలిపారు. ర్యాంకర్ల లక్ష్య సాధన అంశాలపై, వాళ్ల కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన వారైనప్పటికీ మొక్కవోని దీక్షతో వారు ర్యాంకులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి కె.వెంకటేశ్, 14వ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేశ్, న్యాయవాదులు ఉప్పల అంజనీప్రసాద్, ఏవీ రమణ, ఎ.కిరణ్ కుమార్, ర్యాంకర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌పై విజి'లెన్స్'?

- గత ఐదేళ్లలో జరిగిన అక్రమ వ్యవహారాలపై దృష్టి
- గత ప్రభుత్వంలోని 'ప్రధాన'అధికారి ఎక్సైజ్‌లో ఉండగా జరిగిన అవినీతిపై నజర్
- ఉన్నతాధికారుల విచారణలో అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి
- ఒక్కో ఉన్నతాధికారికి 3 నుంచి 7 వరకు ఇన్‌చార్జి బాధ్యతలు!
- ప్రతిఫలంగా ఆ అధికారికి భూమి కొనిచ్చారనే ఆరోపణలు
- త్వరలోనే ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ శాఖ బండారం రోజుకో తీరుగా బయటకొస్తోంది. ఈ శాఖపై ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పలు ఫిర్యాదులు అందగా, గత ఐదేళ్ల కాలంలో అబ్కారీ శాఖ పరిధిలో జరిగిన అక్రమ వ్యవహారాలపై తాజాగా విజిలెన్స్ దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో 'ప్రధాన'పదవిలో ఉండి ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓ కీలక అధికారి ఈ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో జరిగిన అవినీతి గుట్టును వెలికి తీయడంలో విజిలెన్స్ నిమగ్నమైందని, ఈ మేరకు ఆ శాఖలో పనిచేస్తోన్న ఉన్నతాధికారులపై విచారణ జరుపుతోందని సమాచారం. ఇప్పటికే అనేక వ్యవహారాలు వెలుగులోనికి వచ్చాయని, సదరు కీలక అధికారికి గిఫ్ట్‌గా కొందరు అధికారులు పెద్ద ఎత్తున భూమిని కొనుగోలు చేసి ఇచ్చిన తతంగం కూడా బయటకు వచ్చిందనే చర్చ ఎక్సైజ్ వర్గాల్లో జరుగుతోంది. ఈ మేరకు విజిలెన్స్ నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారని తెలుస్తోంది.

ఇన్‌చార్జులతో 'సార్'చార్జి వసూళ్లు!

గత ఐదేళ్లలో కొందరు అధికారులు గత ప్రభుత్వానికి, కీలక అధికారులకు సన్నిహితంగా మెలుగుతూ స్వామి కార్యంతో పాటు స్వకార్యాలను కూడా చక్కబెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై ఈ శాఖకు చెందిన కొందరు అధికారులే స్వయంగా ఏసీబీకి ఫిర్యాదులు చేశారనే చర్చ గత కొంత కాలంగా ఎక్సైజ్ వర్గాల్లో నడుస్తోంది. తాజాగా విజిలెన్స్ విచారణలోనూ పలు ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్కో ఉన్నతాధికారికి వెసులుబాటును బట్టి 3 నుంచి 7 పోస్టుల వరకు ఇన్‌చార్జి బాధ్యతలిచ్చి అవినీతి తతంగాలను నడిపించారని, ఇందుకు గాను పై అధికారికి నెలకు వచ్చే అక్రమార్జనను పంచేవారని తేలినట్టు సమాచారం. డిస్టిలరీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో పాటు ఏసీ, డీసీ, ఈఎస్, ఏఈఎస్‌లుగా పలు జిల్లాల్లో, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జి పోస్టులను నిర్వహించిన సదరు అధికారులు పెద్ద మొత్తంలో కూడబెట్టుకున్నారని, నెలకు వారి ఆదాయం పదుల లక్షల్లోనే ఉండేదని తెలిసింది. వీరిని ఏళ్ల తరబడి ఇన్‌చార్జి పోస్టుల్లో కొనసాగించినందుకు ప్రతిఫలంగా సదరు కీలక అధికారికి హైదరాబాద్ శివార్లలో 10 ఎకరాలకు పైగా భూమిని సమకూర్చినట్టు తెలుస్తోంది. కాగా ఆ కీలకాధికారి కీలకమైన ప్రభుత్వ శాఖల్లో చేసిన వ్యవహారాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ శాఖ వ్యవహారాలపైనా ఆరా తీస్తోంది. ఈ క్రమంలోనే గుట్టు చప్పుడు కాకుండా విచారణ జరిపిన విజిలెన్స్ వర్గాలు.. అబ్కారీ శాఖ గుట్టును ప్రభుత్వం ముందు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయని సమాచారం.

అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి సత్తా చాటుతున్నాం

- అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 8 కంటే ఎక్కువ సీట్లే వస్తాయి...
- బీజేపీ జాతీయ నాయకత్వం ధీమా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కంటే అత్యధిక సంఖ్యలో ఎంపీ సీట్లు గెలిచి సత్తా చాటనున్నట్టు బీజేపీ జాతీయ నాయకత్వం ధీమా వ్యక్తం చేసింది. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో, వివిధ ఏజెన్సీల ద్వారా నిర్వహించిన సర్వేల్లో ఇదే విషయం వెల్లడైందని రాష్ట్ర నాయకత్వానికి సమాచారం ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 8 సీట్ల కంటే కూడా ఒకటి, రెండు అధికంగా గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తుందని తెలిపింది. ఇప్పటివరకున్న పరిస్థితులను బట్టి చూస్తే 12 సీట్లలో ప్రధానపార్టీల కంటే ముందంజలో ఉన్నామని.. 8, 9 ఎంపీ సీట్లను కచ్చితంగా గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని నివేదికలు అందినట్టు తెలియజేసింది. జాతీయ నాయకత్వ సూచనలకు అనుగుణంగా సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళికలు, ఎన్నికల వ్యూహాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకు సాగాలని ఆదేశించింది. ఆదివారం రాత్రి బీజేపీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో జాతీయ పార్టీ దూత, ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ ఈ విషయాన్ని తెలియజేశారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన మొదటి విడత ఎన్నికల్లోనూ బీజేపీ అధికసీట్లలో గెలుపొందనున్నట్టు అంతర్గత సర్వేల్లో వెల్లడైందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో యువ, మహిళ, కిసాన్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ మోర్చాలు మరింత క్రియాశీలంగా పనిచేసి యువ, మహిళ, రైతు, ఓబీసీ ఇతర సామాజికవర్గాల మద్దతు కూడగట్టి ఈ వర్గాల ఓట్లు బీజేపీకి అత్యధికంగా పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు. డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్, బంగారు శ్రుతి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

25న బాన్సువాడ బహిరంగసభకు అమిత్‌షా



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన ఖరారైంది. ఈ నెల 25న ఉదయం 11 గంటలకు జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బాన్సువాడలో జరిగే బహిరంగసభలో ఆయన పాల్గొంటారు. ఈ సభలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ.పాటిల్ పాల్గొంటారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- సోమవారం మహబూబాబాద్, నల్లగొండ ఎంపీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కేంద్రమంత్రి కిరణ్ రిజిజు, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పార్టీనేతలు గరికపాటి మోహన్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు హాజరవుతారు.
- చేవెళ్ల, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల సమర్పణ కార్యక్రమానికి కేంద్రమంత్రి పియూష్ గోయల్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరవుతారు.

● అమెరికాలో రోడ్డు ప్రమాదం..

ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో వెళుతుండగా ఘటన
- జనగామ, కరీంనగర్ జిల్లాల్లో విషాదం



అమెరికాలో రోడ్డు ప్రమాద దృశ్యం



ముక్క నివేశ్



గౌతమ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్/హుజూరాబాద్‌రూరల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. భారత కాలమానం ప్రకారం ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మృతి చెందిన ఇద్దరూ ఉన్నత చదువులకు అమెరికా వెళ్లినవారే. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన పార్శి గౌతమ్‌కుమార్(19), కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ముక్క నివేశ్ (20) అమెరికాలోని అరిజోనా స్టేట్ వర్సిటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. శని, ఆదివారాలు సెలవులు రావడంతో వీరిద్దరూ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో వాటర్‌ఫాల్స్ చూసేందు కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారును ఫిని క్స్ పరిధిలోని మెట్రోటౌన్ సెంటర్ వద్ద ఓ ట్రక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గౌతమ్, నివేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ప్రస్తుతం వారు స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అరిజోనా పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలరోజులైతే గౌతమ్ ఇండియాకు వచ్చేవాడు..

గౌతమ్‌కుమార్ ఇండియాకు తిరిగి రావడానికి మే 22న టికెట్ బుక్ చేసుకున్నాడు. నెలరోజులైతే ఇంటికి వచ్చి తమతో సంతోషంగా గడిపేవాడని గౌతమ్ తల్లిదండ్రులు పార్శి కమల్‌కుమార్‌గుప్తా– పద్మ కన్నీరుమున్నీరు అయ్యారు. కమల్‌కుమార్‌గుప్తా ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాగా, శివునిపల్లిలో బంగారం వ్యాపారం చేస్తూ కాజీపేటలోని వడ్డేపల్లిలో నివాసముంటున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా, పెద్దకొడుకు గౌతమ్ మృతితో విషాదఛాయలు నెలకొన్నాయి.

నివేశ్ తల్లిదండ్రులిద్దరూ డాక్టర్లే: హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ముక్క కృష్ణమూర్తికి నివేశ్ మనుమడు. నివేశ్ తల్లిదండ్రులు నవీన్, స్వాతి కూడా వైద్యవృత్తిలోనే కొనసాగుతున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా, నివేశ్ పెద్దవాడు.

బాలుడిని హత్య చేసి.. | ఆపై సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య

- దొంగసొమ్ము పంపకాల్లో ఇద్దరి మధ్య వివాదం
- సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఘటన

జోగిపేట(అందోల్): దొంగసొమ్ము పంపకాల్లో చెలరేగిన వివాదం ఇద్దరి ప్రాణాలు తీసింది. ఓ బాలుడిని హత్య చేసి...ఆపై సెల్‌టవర్ ఎక్కి మరొకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ పట్టణంలో సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వడ్డె నాగరాజు (24) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి మేనమామ వద్ద ఉంటూ జులాయిగా తిరుగుతూ..వ్యసనాలకు బానిసయ్యాడు. పట్టణంలోని షౌకత్‌కు చెందిన పాత సామాన్ల కొనుగోలు షాపులో నాగరాజు, 'పీర్'స్క్రాప్ దుకాణంలో శేఖర్(13) పనిచేసేవారు. ఇద్దరూ కలిసి ఇటీవల పీర్ స్క్రాప్ దుకాణంలో కాపర్ వైరును దొంగిలించారు. దానిని విక్రయించగా రూ.20వేలు వచ్చాయి. ఆ డబ్బును పంచుకోవడంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తగా, శేఖర్‌ను హత్య చేయాలని నాగరాజు ప్లాన్ వేశాడు. శనివారం డబ్బుల విషయం మాట్లాడుకుందామని అందోల్ పెద్ద చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ శేఖర్ గొంతు నులిమి హత్య చేసి పక్కనే ఉన్న బావిలోకి నాగరాజు తోసేశాడు. రాత్రి వేళ పక్కనే ఉన్న సెల్‌ఫోన్ టవర్ ఎక్కి గట్టిగా అరుస్తూ శేఖర్‌ని చంపి బావిలో పడేశానంటూ నాగరాజు కేకలు వేశాడు. అరుపులు విన్న శేఖర్ సమీపబంధువు రాములుతోపాటు మరొకరు టవర్ ఎక్కి నాగరాజును కిందకు దింపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నాగరాజు రాములుపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఆదివారం ఉదయం ఈ విషయం పట్టణమంతా తెలియడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో టవర్ వద్దకు వచ్చారు.



శేఖర్ (ఫైల్)



నాగరాజు (ఫైల్)

కేబుల్ వైరుతో..

నాగరాజు పైనుంచి అరుస్తూ తన వద్దకు ఎవరూ రావొద్దంటూ హెచ్చరించాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత నాగరాజు వద్ద నుంచి ఎలాంటి కదలికలు..మాటలు వినిపించలేదు. దీంతో నాగరాజు బతికి ఉన్నాడా, లేదా అన్న అనుమానం పోలీసులకు వచ్చింది. పైకి వెళ్తే మళ్లీ గాయపరుస్తాడేమోనని పోలీసులు డ్రోన్ కెమెరాను పంపించి నాగరాజు కదలికలను ఫొటో తీయించారు. కేబుల్‌వైర్‌తో తన గొంతుకు బలంగా చుట్టుకొని ఆత్మహత్యకు పాల్పడి, నిర్జీవంగా పడి ఉండడాన్ని చూసి నాగరాజు చనిపోయినట్టు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని కిందకు దింపారు.



నాగరాజు మృతి చెందినట్టు డ్రోన్‌కెమెరా ద్వారా గుర్తించిన దృశ్యం

బావిలో శేఖర్ మృతదేహం లభ్యం

శేఖర్‌ను చంపి బావిలో పడేసినట్టు టవర్‌పై నుంచి నాగరాజు అరవడంపై పోలీసులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టారు. అందోల్ చెరువు పక్కనే ఉన్న బావిలో సింగూరు గజ ఈతగాళ్లతో వెతికించగా శేఖర్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని వెంటనే స్థానిక ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.



జీవితంలో ఒక్క రోజు పట్ల కూడా పశ్చాత్తాపం వద్దు. మంచి రోజులు సంతోషం కలిగిస్తాయి. చెడ్డ రోజులు అనుభవాలనిస్తాయి. మరీ చెడ్డరోజులు పాఠాలు నేర్పుతాయి. అత్యుత్తమ రోజులు జ్ఞాపకాలనిస్తాయి.

– రిచర్డ్ ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 22 ఏప్రిల్ 2024

భయంతో కూడిన ద్వేషం

పుస్తకాలే లేకుంటే, ప్రపంచం ఇంత పురోగతి సాధించగలిగి ఉండేది కాదు. ఇంత సాంకేతికత సాధించగలిగి ఉండేది కాదు. నాగరికతలో ఇంకా వెనుకబడి ఉండేది. పుస్తకాలు నాగరికత వేగాన్ని పెంచడంలో తిరుగులేని చోదకశక్తులు. మనుషుల్లోని అంతులేని అజ్ఞానాన్ని కొంతవరకైనా తొలగించగల ఘనత పుస్తకాలకే దక్కుతుంది. అలాగని ప్రతి పుస్తకమూ జ్ఞానసాగరాన్ని తనలో ఇముడ్చుకున్నదని చెప్పడానికి వీలులేదు గాని, జ్ఞానవికాసానికి దోహదపడే పుస్తకాలు కాలపరీక్షకు నిలిచి మనగలుగుతాయి. అజ్ఞానాన్ని అచ్చుపోసుకుని వెలువడిన పుస్తకాలు కాలగర్భంలో కలిసిపోతాయి. 'పుస్తకాలు లేని ఇల్లు ఆత్మ లేని దేహం లాంటిది' అన్నాడు రోమన్ తత్త్వవేత్త సిసిరో. జ్ఞాన సముపార్జనకు పుస్తకాలను మించిన సాధనాలు లేవు.

పుస్తకాల ప్రాశస్త్యం చెప్పుకోవాలంటే చాలానే ఉంటుంది. అయితే, ప్రపంచంలో పుస్తకాలను ప్రేమించిన వారు ఉన్నట్లే, పుస్తకాలను ద్వేషించేవారు కూడా ఉంటారు. జ్ఞానానికీ, మూర్ఖత్వానికీ చుక్కెదురు. జ్ఞానానికి ప్రతిరూపాలైన పుస్తకాలంటే మూర్ఖశిఖామణులకు బొత్తిగా సరిపడదు. పుస్తకాలు రాసేవాళ్లన్నా, వాటిని చదివేవాళ్లన్నా ద్వేషం. ఇలాంటి మూర్ఖశిఖామణులకు కర్మకాలి అధికారం తోడైతే కనిపించిన పుస్తకాన్నల్లా నామరూపాలు లేకుండా నాశనం చేస్తారు. పుస్తకాల పట్ల ఇలాంటివాళ్లు ప్రదర్శించేది ద్వేషమే అయినా, నిజానికి వారికి పుస్తకాలంటే తగని భయం. పుస్తకాల పట్ల ఉండే భయాన్ని 'బిబ్లియోఫోబియా' అంటారు. ఈ భయంలోనూ రకాలు ఉన్నాయి. కొందరికి ఎలాంటి పుస్తకమైనా సరిపడదు. ఇంకొందరికి కొన్నిరకాల ప్రత్యేకమైన పుస్తకాలంటే గిట్టదు. ఉదాహరణ చెప్పుకోవాలంటే చాలామందికి 'ఎర్ర'పుస్తకాలంటే పడదు. ఇలాంటివాళ్లను చూసే సుబ్బారావు పాణిగ్రాహి 'ఎరుపంటే కొందరికి భయం భయం/ పసిపిల్లలు వారికంటె నయం నయం' అని చురకలంటించాడు.


పుస్తకద్వేషం లేదా పుస్తకభీతి అనే మాయరోగం అచ్చుయంత్రం కనిపెట్టడానికి ముందు నుంచే ఉంది. క్రీస్తుపూర్వం ఏడో శతాబ్దిలో జెరమియా ప్రవక్త రాసిన పుస్తకంలో తనకు నచ్చని అంశాలు ఉండటంతో జూడా రాజు జెహోయకిమ్ దాన్ని తగులబెట్టించాడు. ఇది చరిత్రలో నమోదైన తొలి పుస్తక దహన ఉదంతం. చరిత్రకెక్కిన తొలి పుస్తకద్వేషి జూడా రాజు జెహోయకిమ్ మహాశయుడే! చైనాను క్రీస్తుపూర్వం మూడో శతాబ్దిలో ఏలిన చక్రవర్తి కిన్ షి హువాంగ్ పుస్తకాలను తగులబెట్టించడంతో సరిపెట్టుకోకుండా, నాలుగువందల అరవైమంది కన్ఫ్యూషియస్ అనుయాయులను సజీవ సమాధి చేయించాడు. పుస్తకాలను తగులబెట్టిన ఉదంతాలు చరిత్రలో అసంఖ్యాకంగా ఉన్నాయి. మత రాజ్యాల్లో పుస్తకదహనాల సంఖ్య కొంత ఎక్కువే అయినా, లౌకిక రాజ్యాల్లోనూ పుస్తక దహనాలు తక్కువేమీ కాదు. పద్దెనిమిదో శతాబ్దికి చెందిన తత్త్వవేత్త, రచయిత వోల్టేర్ పుస్తకాలను ప్రష్యాలోను, ఫ్రాన్స్‌లోను అక్కడి పాలకులు పలుమార్లు తగులబెట్టించారు. నాజీ నియంత హిట్లర్ నాయకత్వంలోని జర్మనీలో లెక్కకు మిక్కిలిగా పుస్తకదహనాలు జరిగాయి. మావో నాయకత్వంలోని కమ్యూనిస్టు చైనాలో కూడా పుస్తక దహనాలు జరిగాయి. పుస్తకదహనాలు మాత్రమే కాదు, పలుచోట్ల గ్రంథాలయాలకు గ్రంథాలయాలనే సర్వనాశనం చేసిన ఉదంతాలు ఉన్నాయి. భక్తియార్ ఖిల్జీ నలందా విశ్వవిద్యాలయాన్ని నాశనం చేసి, అందులోని వేలాది పుస్తకాలను తగులబెట్టించాడు. ఇలా పుస్తకాలను నాశనం చేసే మాయరోగాన్ని 'బిబ్లియోక్లాస్మ్' అంటారు. నియంతల్లోని 'బిబ్లియోఫోబియా' అనే పుస్తకభీతికి పర్యవసానమే 'బిబ్లియోక్లాస్మ్'. 'పుస్తకాలను తగులబెట్టే వాళ్లు చివరకు మనుషులను కూడా సజీవదహనం చేస్తారు' అన్నాడు జర్మన్ కవి హీన్రిక్ హీన్. పుస్తకద్వేషుల ఉన్మాదం ఆ స్థాయిలో ఉంటుంది మరి! పుస్తకద్వేషులు ఇప్పటికీ ఉండనే ఉన్నారు. తమకు నచ్చని పుస్తకాల మీద, వాటిని రాసిన రచయితల మీద విషం చిమ్ముతూనే ఉన్నారు, దాడులకు తెగబడుతూనే ఉన్నారు.

చరిత్ర పొడవునా, పుస్తకం ఎదుర్కొన్నంత ప్రతికూలత మరే ఆవిష్కరణా ఎదుర్కోలేదు. అయినా పుస్తకాలు ఇంకా మనగలుగుతూనే ఉన్నాయి. పుస్తకద్వేషులకు భయపడి రచయితలు కలాలను మూసేసుకున్న దాఖలాలు లేవు. ముద్రణశాలలు మూతబడిన ఉదంతాలు లేవు. పుస్తకప్రియులు పుస్తకాల పట్ల తమ ప్రేమను ప్రదర్శించడాన్ని మానుకున్న సందర్భాలూ లేవు. ప్రపంచంలో ప్రతిచోటా, ప్రతి భాషలోనూ కొత్త కొత్తగా రచయితలు పుట్టుకొస్తూనే ఉన్నారు. రచనలను సాగిస్తూనే ఉన్నారు. ముద్రణశాలలు ముద్రిస్తూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పాఠకులు పుట్టుకొస్తున్నారు. సరికొత్త పుస్తకాలనే కాకుండా, పునర్ముద్రణలు పొందిన పాత పుస్తకాలను కూడా సమాదరిస్తూనే ఉన్నారు. ద్వేషం మీద ప్రేమ విజయం సాధించగలదని చెప్పడానికి పుస్తకాల చరిత్రనే నిదర్శనంగా తీసుకోవచ్చు. చరిత్రలో పుస్తక ద్వేషులకు జనాలు తలవంచి ఉన్నట్లయితే, ఇప్పటికే పుస్తకాలు పూర్తిగా అంతరించిపోయి ఉండేవి. జనాల్లో పుస్తకాలపై ఉండే ప్రేమ మాత్రమే ఆ అనర్థాన్ని నివారించగలిగింది.

రష్యాకు, ఉక్రెయినియాకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయినియాలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్న రష్యన్ సైనికులు ఉక్రెయినియన్ పుస్తకాలను తగులబెట్టారు. యుద్ధాలు, మూక దాడుల్లో ఆస్తినష్టం, ప్రాణనష్టంతో పాటు పుస్తకాలకూ నష్టం జరుగుతూ ఉంటుంది. అయితే, ప్రపంచంలో శాంతి సామరస్యాలను కోరుకునే మనుషులు ఉన్నంత వరకు, మనుషుల్లో వివేకం, విచక్షణ, విషయ జిజ్ఞాస బతికి ఉన్నంత వరకు పుస్తకాల మనుగడకు ముప్పేమీ ఉండబోదు.

ఎలక్టోరల్ బాండ్లకు ప్రత్యామ్నాయం

విశ్లేషణ



ఎస్.వై. ఖురేషీ

2018 కంటే ముందు రాజకీయ పార్టీలకు అందే చందాల్లో 70 శాతానికిపైగా నగదు రూపంలో అంటే నల్లధనంగానే అందేది. ఇది ప్రజాస్వామ్యయుతమైన ఎన్నికలకు ఏమాత్రం మంచి చేసేది కాదు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమస్యను పరిష్కరించే ప్రయత్నమైతే జరిగింది కానీ, మరిన్ని సమస్యలను సృష్టించింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆచరణ సాధ్యమైన, సులువైన పరిష్కారం 'జాతీయ ఎన్నికల నిధి' (ఎన్ఈఎఫ్) ఏర్పాటు. దాతలందరూ ఈ నిధికి చందాలు ఇవ్వవచ్చు. ఎన్నికల్లో ఆ యా పార్టీల పనితీరును నిధుల పంపిణీకి ప్రామాణికంగా తీసుకోవచ్చు. పార్టీకి పడిన ప్రతి ఓటుకూ వంద రూపాయల చొప్పున కేటాయించినా ఆ యా పార్టీలు తమ రాజకీయ కార్యకలాపాలు నడిపేందుకు కావాల్సినన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి.

ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమైనవని దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించడంపై భారత ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఎన్నికల్లో నల్లధనం ఏరులా ప్రవహిస్తోందన్న ఆలోచన, చర్చ దేశంలో చాలాకాలంగా జరుగుతోంది. ఎన్నికల్లో నల్లధనం ప్రమేయం లేకుండా చూసేందుకు ఒక ప్రయత్నమైతే చేయాలని అనుకునేవాడిని. ఫలితంగా నాకు ఓ స్వచ్ఛమైన ఆలోచన వచ్చింది. ఇదే ఏకైక మార్గమని ఎప్పుడూ చెప్పుకోలేదు. ఆచరణలో మంచి జరిగిందా? చెడు జరిగిందా అన్నది చర్చించుకోవచ్చు. కానీ నిర్ణయాలు తీసుకోవడంలో మేము వెనక్కు తగ్గలేదని మాత్రం స్పష్టమవుతోంది. లోటుపాట్లు ఉంటే చర్చించుకున్న తరువాత మెరుగుపరిచేందుకూ అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటికైతే మనం దేశాన్ని మళ్లీ నల్లధనపు యుగంలోకి తీసుకెళ్లాం. ఈ పరిణామాన్ని ఎవరూ హర్షించరు'' అని నరేంద్ర మోదీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యలు ఎదుర్కొంటున్న 26 కంపెనీల్లో 16 ఎలక్టోరల్ బాండ్లు కొన్నాయనీ, వీటిల్లో 37 శాతం బీజేపీకి వెళితే, 63 శాతం ప్రతిపక్ష పార్టీలకు వెళ్లాయని కూడా ప్రధాని చెప్పారు. నిజంగానే ఇది ఆశ్చర్యం కలిగిస్తుంది. కార్య, కారణాల మధ్య సంబంధం అస్సలు కుదరడం లేదు. కొన్ని రోజుల క్రితం ఓ మీడియా కార్యక్రమంలో హోమ్ మంత్రి అమిత్ షా కూడా 2018 కంటే మునుపటి పరిస్థితులకు వెళ్లడం వాంఛనీయం కాదని అన్నారు. అటు ప్రధాని, ఇటు హోమ్ మంత్రి ఇద్దరూ సరైన వ్యాఖ్యలే చేశారు.

2018 కంటే ముందు పరిస్థితి ఏమాత్రం గొప్పగా లేదన్నది వాస్తవం. రాజకీయ పార్టీలకు అందే చందాల్లో 70 శాతానికిపైగా నగదు రూపంలో అంటే నల్లధనంగానే అందేది. ఇది ప్రజాస్వామ్యయుతమైన ఎన్నికలకు ఏమాత్రం మంచి చేసేది కాదు. డబ్బులు ఇచ్చిన వారెవరో తెలియదు. క్రిమినల్స్, మద్యం వ్యాపారులు, ల్యాండ్ మాఫియా ఎవరైనా ఇచ్చి ఉండవచ్చు. విదేశాల నుంచి వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ వ్యవస్థ మారాలని ఎన్నికల కమిషన్‌తో పాటు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ వంటి సంస్థలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమస్యను పరిష్కరించే ప్రయత్నమైతే జరిగింది కానీ, అది మరిన్ని సమస్యలను సృష్టించింది.

ఎలక్టోరల్ బాండ్ల ఉద్దేశం ఎన్నికల్లో నగదు పాత్ర తగ్గించడమే కాబట్టి... దాతల, స్వీకర్తల పేర్లు ప్రకటిస్తే సమస్య ఇట్టే తీరిపోయేదని నేను గతంలోనే ఒక కథనంలో ప్రస్తావించాను. ఈ సలహాను ప్రభుత్వం పాటించి ఉంటే ఈ రోజు సుప్రీంకోర్టు అంత తీవ్రమైన వ్యాఖ్యలు చేసి ఉండేది కాదు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై చాలా కాలం చర్చించుకోవచ్చు కానీ... ప్రస్తుతం ఆలోచించాల్సింది ఇకపై ఏం చేయాలన్నదే!



2018 కంటే ముందు పరిస్థితి కచ్చితంగా వద్దనే కోరుకుంటున్నాం. ఎన్నికల కమిషన్, పౌర సమాజం ఈ రెండు దశాబ్దాల కాలంలో చేసిన సంస్కరణ ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వం కొత్త పరిష్కారాన్ని వెతకాల్సి ఉంటుంది. నా వరకూ నేను ఆచరణ సాధ్యమైన, సులువైన పరిష్కారం ఒకదాన్ని సూచించాను. అదే 'జాతీయ ఎన్నికల నిధి' (ఎన్ఈఎఫ్) ఏర్పాటు. దాతలు ఈ నిధికి చందాలు ఇవ్వవచ్చు. అవసరమైతే పన్ను రాయితీలు ఉదారంగా ఇవ్వడం ద్వారా దాతలు ఈ నిధికి చందాలిచ్చేలా ప్రోత్సహించవచ్చు.

ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టినప్పుడు దాతలు గోప్యతను కోరుకుంటున్నారన్న వాదన వినిపించింది. ఎన్నికల నిధి వ్యవస్థలో ఈ సమస్య ఉండదు. ఎన్ఈఎఫ్ రెండు పద్ధతుల్లో చందాలు తీసుకోగలదు. ప్రభుత్వ ఖజానా నుంచి కేటాయింపులు; కార్పొరేట్, ఇతర వర్గాల నుంచి నిధులు. రాజకీయ పార్టీలకు నిధులందించేందుకు పన్నులు విధించడంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది కాబట్టి ప్రభుత్వం నిధులు కేటాయించడం అన్న ప్రతిపాదనను తొలగించవచ్చు. మిగిలింది కార్పొరేట్, ఇతర వర్గాల ద్వారా చందాలు స్వీకరించడం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

జాతీయ ఎన్నికల నిధి ద్వారా సేకరించే నిధులను క్రమపద్ధతి ద్వారా రాజకీయ పార్టీలకు పంపిణీ చేయవచ్చు. ఇటీవలి ఎన్నికల్లో ఆ యా పార్టీల పనితీరును నిధుల పంపిణీకి ఒక ప్రామాణికంగా తీసుకోవచ్చు. పార్టీకి పడిన ప్రతి ఓటుకూ వంద రూపాయల చొప్పున కేటాయించినా ఆ యా పార్టీలు తమ రాజకీయ కార్యకలాపాలు నడిపేందుకు కావాల్సినన్ని నిధులు అందుబాటులోకి వస్తాయని నేను గతంలోనే చెప్పాను. పోలైన ఓట్లలో ఎలాగూ అక్రమాలు చేయలేరు కాబట్టి ఈ పద్ధతిలో పార్టీలకు నిధులు రీయింబర్స్ చేస్తే ఇంకా కచ్చితంగా ఉంటుంది.

గత ఎన్నికల్లో మొత్తం 60 కోట్ల ఓట్లు పోలయ్యాయి. ఓటుకు వంద చొప్పున లెక్కవేస్తే ఆరు వేల కోట్ల రూపాయలవుతాయి. ఇవి సరిపోతాయా? కచ్చితంగా సరిపోతాయి. ఐదేళ్లలో రాజకీయ పార్టీలు సేకరించిన నిధులు కూడా దాదాపుగా ఇంతే ఉండటం గమనార్హం.

ఎన్ఈఎఫ్ అన్ని విధాలుగా నిజాయితీతో కూడుకున్నది. బలవంతపు వసూళ్లు, లంచాలు, క్విడ్ ప్రో కో వంటివి ఉండవు. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రైవేట్‌గా చందాలివ్వడాన్ని నిషేధించాలి. పార్టీ అకౌంట్లను 'కాగ్' ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుంది. ఒకవేళ ఫలానా పార్టీకి విరాళం ఇవ్వాలనుకునేవారు, 'ప్రతీకారానికి' భయపడనివారు ఎన్నికల సంఘానికి సమాచారం ఇచ్చి, చెక్ రూపంలో ఇవ్వొచ్చు.

కొత్త పార్టీలు వస్తే ఎలా? స్వతంత్రుల మాటేమిటి? ఎన్ఈఎఫ్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరిగినప్పుడు ఈ అంశాలపై కూడా చర్చించి ఒక నిర్ణయం తీసుకోవచ్చు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్(స్టాక్‌హోమ్) 180 దేశాల్లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం, 71 దేశాల్లో తాము పొందిన ఓట్లకు అనుగుణంగా పార్టీలకు ప్రభుత్వం ద్వారా నిధులు అందుతున్నాయి. ఇందులో 86 శాతం యూరప్ దేశాలు, ఆఫ్రికాలోని 71 శాతం దేశాలు, అమెరికాల్లోని 63 శాతం దేశాలు ఉన్నాయి. ఈ పద్ధతిని ఇండియాలో ప్రవేశపెట్టకపోవడానికి కారణం ఏమీ కనబడదు.

ప్రజాస్వామ్య మనుగడకు అతిపెద్ద సమస్యగా మారిన నల్లధన నిర్మూలనకు ఇదే సరైన సమయం. ఏ రకమైన సంస్కరణలను ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారు? వీటిల్లో ఒకటి ఎన్నికల్లో డబ్బుకు సంబంధించింది. దీంతోపాటు రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పెట్టగల ఖర్చుకు గరిష్ఠ పరిమితిని నిర్ణయించడమూ అవసరం. స్వతంత్ర సంస్థతో ఆడిటింగ్ చేయించడమూ తప్పనిసరి చేయాలి. రెండోది – 'జాతీయ ఎన్నికల నిధి'ని ఏర్పాటు చేయడం. పన్నుల్లేని చందాలను స్వీకరించే కేంద్రంగా ఇది పనిచేస్తుంది. మూడోది – రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకతను పెంచేందుకు వాటిని సమాచార హక్కు పరిధిలోకి తేవాలి. అక్రమాలు జరిగాయన్న కచ్చితమైన సమాచారం ఉంటే ఎన్నికలను రద్దు చేసే అధికారం కమిషన్‌కు కట్టబెట్టడం నాలుగోది. ఐదవది – కోర్టుల్లో తీవ్రస్థాయి నేరాల కేసులు పెండింగ్‌లో ఉన్న నేతలు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించడం. ఆరవది – పన్నుల మినహాయింపు మాత్రం పొందుతూ, నిర్దిష్ట కాలావధిపాటు ఎన్నికల్లో పాల్గొనని పార్టీల గుర్తింపును రద్దు చేసే అధికారం కమిషన్‌కు ఇవ్వాలి. పెయిడ్ న్యూస్‌ను ఎన్నికలకు సంబంధించిన నేరంగా గుర్తించి రెండేళ్ల శిక్ష విధించడం ఏడవ ప్రతిపాదన. ''మన పూర్తి శక్తితో అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి'' అన్నారు ప్రధాని. దీనికి పూర్తి నిబద్ధుల మవుదాం.

వ్యాసకర్త భారత మాజీ ఎన్నికల ప్రధాన అధికారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తెలుగులో పిలవలేరా?



బహుభాషల దేశంలో పెరిగిన తెలుగు మూలాలున్న ఒక మలేషియన్‌గా, వివాహ ఆహ్వాన పత్రికలు తమ స్థానిక భాషల్లో ఇవ్వనివారిని నేను ఒక్కరిని కూడా చూడలేదు. కానీ తెలంగాణ, ఆంధ్రల్లోని తెలుగువాళ్లు తమ ఆహ్వానాలను ఇంగ్లీషులో ఇస్తూ, తెలుగులో 'లిప్యంతరీకరణ' (ఒక భాషను ఇంకో భాష అక్షరాల్లో రాయడం) చేస్తున్నారు. తెలుగు ఎక్కడ?

– ప్రియశ్రీ నరగడం, తెలుగు మలేషియన్

రహస్య ఓటు



నేననుకోవడం 'మన బృందాల్లోని' చాలామంది రహస్యంగా ట్రంప్, మోదీకి ఓటేస్తారు; కానీ తమను దూరం పెడతారేమో అనే భయంతో బయటికి చెప్పరు. అలా జరగకూడదని మనం అనుకుంటే అలా ఎందుకు జరుగుతున్నదో ఆలోచించాలి.

– దీక్షా బసు, రచయిత్రి

పర్యవసానం



ఇరాన్ మీద సద్దాం హుస్సేన్ దాడి చేసినప్పుడు, అది విప్లవ ప్రభుత్వాన్ని కూల్చుతుందని అరబ్బులు, అమెరికన్లు భావించారు. దానికి బదులుగా ఆ దేశం మీద ముల్లాల పట్టు పెరిగేట్టు చేసింది. 1982లో లెబనాన్ మీద ఇజ్రాయిల్ దండెత్తినప్పుడు 40 ఏళ్ల శాంతిని వాగ్దానం చేసింది. కానీ హెజ్బొల్లాను సృష్టించడానికి ఇరాన్‌కు అవకాశం ఇచ్చింది.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

మెనూ ఏమిటి?



ప్రతి ఒక్కరూ ఏం తింటున్నారనే దాని మీద ఈ ప్రభుత్వానికి ఎంత ఆసక్తి ఉందంటే, అతి త్వరలోనే మనందరం మన ఆధార్ కార్డులను బిగ్ బాస్కెట్ అకౌంట్‌కు లింక్ చేయాల్సి ఉంటుంది!

– కాజోల్ శ్రీనివాసన్, కమెడియన్

నయా బానిసత్వం



ఇప్పటి బానిసలు ఇక ఏమాత్రమూ గొలుసుల్లో బంధితులై లేరు; వాళ్లు తమ అణిచివేతదారులను కాపాడటంలో తీరిక లేకుండా ఉన్నారు.

– అడేమోలా, పాన్-ఆఫ్రికనిస్ట్

ఇన్ బాక్స్

సాధారణ బోగీలు వెంటనే పెంచాలి!

ఇటీవల నేను మహబూబాబాద్ నుండి వరంగల్‌కు ఉదయం పూట కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లడానికి స్టేషన్‌కు వెళ్లాను. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుభాగాన ఇంజన్ తర్వాత ఒక జనరల్ బోగీ ఉంటుంది. దాని వెనుక ఏసీ బోగీలు ఉంటాయి. సాధారణ బోగీలో ఎక్కడానికి స్థాయికి మించి ఎక్కువ రష్ ఉండటంతో అతి కష్టం మీద ట్రైన్ ఎక్కడానికి ప్రయత్నం చేశాను. నాతోపాటు ఒక స్త్రీ చంకలో చిన్న పాపను ఎత్తుకొని ట్రైన్ ఎక్కడానికి ప్రయత్నం చేస్తూ కింద పడింది. కింద పడటంతో చంకలో ఉన్న పాప తలకు దెబ్బ తగిలింది. అయినా కూడా ఆ స్త్రీ కింద పడి లేచి మళ్ళీ ట్రైన్ ఎక్కడానికి ప్రయత్నం చేస్తూ ఉండగా... ఆ పాప వాంతి చేసుకుంది. వృత్తిరీత్యా డాక్టర్‌ని కావడంతో ఆ వాంతి చేస్తున్న క్రమాన్ని గమనించిన నేను వెంటనే ఆమెను బండి ఎక్కనీయకుండా ఆపాను. నేను కూడా వరంగల్‌కు వెళ్లే ప్రయాణాన్ని విరమించుకుని వెంటనే 108కు ఫోన్ చేసి ఆమెను జిల్లా కేంద్రంలో ఉన్న హాస్పిటల్‌కు తరలించాను. నేను అనుకున్నది నిజమే అయింది. ఆ పాపకు తలకు దెబ్బ తగలడంతో బ్రెయిన్‌కు గాయమై నాలుగు రోజులకు అభం శుభం తెలియని ఆ పాప చనిపోయింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లికి కౌన్సిలింగ్ చేసి నెమ్మదిగా ఇంటికి తరలించాం. 16 రోజుల తర్వాత నాకు ఒక ఫోన్ కాల్ వచ్చింది అదే స్త్రీ మూర్తి దగ్గర నుంచి! ఆమె గర్భవతి కావడంతో రైలు ఎక్కుతున్న క్రమంలో కింద పడినప్పుడు ఆ తల్లి కడుపుకూ దెబ్బ తగిలింది. దాంతో కడుపులో ఉన్న పిండం కూడా చనిపోయింది... ఇదీ ఆమె ఫోన్‌కాల్ సారాంశం! నాకు ఒక వారం రోజులు నిద్ర పట్టలేదు.



ఈ తప్పు ఎవరిది? ఎవరు చేసిన పాపం ఇది? ఒక వారం రోజుల పాటు నిద్ర పట్టకుండా ఇదే అంతర్మథనంతో గడిపాను. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రజల చేత కోటి ఉత్తరాలు రాయించడం ద్వారా ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చెయ్యాలనే డిమాండ్‌ను తెలియచెయ్యాలని నిర్ణయానికి వచ్చాను. 'రైలులో ఐదు బోగీల సాధన సమితి'ని ఏర్పాటు చేసి ఉత్తరాలు రాసే పనిని ప్రారంభించాం. వరంగల్ కేంద్రంగా– కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ అంపశయ్య నవీన్ చేతుల మీదుగా మొదటి ఉత్తరం ప్రధానమంత్రికి రాయించి దేశవ్యాప్త కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. ఇప్పటికి తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలతో పాటు సూరత్, బెంగళూరు వంటి చోట్లా ఈ కార్యక్రమం నడుస్తోంది. సాధారణ, మధ్యతరగతి వర్గాలకు సంబంధించిన కూలీలూ, ఉద్యోగస్థులూ, మామూలు ప్రయాణికులు రోజుకు కోట్లాదిమంది రైళ్లలో చౌకగా ప్రయాణిస్తున్నారు. ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం రెండు సాధారణ బోగీలు ఉంటే చాలనే అంచనాను పరిగణనలో తీసుకొని ఇప్పటికీ వాటి సంఖ్యను అలాగే కొనసాగించడం పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకున్నప్పుడు సరికాదు. ప్రతి ఒక్కరూ ఈ అంశాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి ప్రధానమంత్రికి ఒక ఉత్తరం రాయండి. ఉత్తరం రాయవలసిన అడ్రస్:

The Prime Minister, Prime Minister's office, 152, South Block, Raisina Hills, New Delhi-110011. ఈ అడ్రస్ పక్కన కింది భాగంలో మీ అడ్రస్, ఫోన్ నంబర్ రాయడం మరచిపోవద్దు. ఫోన్ నంబర్ తప్పనిసరిగా రాయాలి. తద్వారా అంశం బలమైనదే కాబట్టి శాంప్లింగ్ సర్వేలో ఇంటెలిజెన్స్ వారు ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి ఎంక్వయిరీ చేసే అవకాశం ఉంటుంది. పేదవాడి ప్రయాణ సాధనం రైలుబండిలో మరిన్ని సాధారణ బోగీలు త్వరలోనే కేంద్రం కేటాయిస్తుందని ఆశిద్దాం.

– డాక్టర్ అశోక్ పరికిపండ్ల,
'రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి'– జాతీయ కన్వీనర్ । 99893 10141

మనల్నే అన్నట్లుగా లేదూ?!

కామెంట్



కరణ్ థాపర్

బహుశా ఇది ఎన్నికల సమయం అయినందున మన చుట్టూ తిరుగాడుతుండే ఆలోచనలు, ఆందోళనల పరిధితో ఒక నిర్దిష్ట సంబంధం కలిగి ఉన్న కొన్ని సూత్రీకరణలు, సార్వజనీనత కలిగిన కొన్ని ఉటంకింపులు ఒక సముదాయంగా నన్ను చుట్టుముట్టాయి. వివిధ మూలల నుంచి మన పైకి వచ్చి పడే సందేహాస్పద భావనలు కొన్నింటిని అవి సూదితో గుచ్చినట్లుగా తుస్సుమనిపిస్తాయి, తేల్చేస్తాయి. ఇది మిమ్మల్ని కూర్చోబెట్టి ఆలోచింపజేస్తుందని, కనీసం మీ మోముపై ఒక చిరునవ్వును పూయిస్తుందన్న నమ్మకంతో కొన్ని 'కోట్స్'ని మీతో పంచుకుంటున్నాను.

ఐజక్ అసిమోవ్ ఒకసారి ఇలా అన్నారు: ''మూర్ఖత్వం దేశభక్తిగా పరిగణన పొందినప్పుడు తెలివి కలిగి ఉండటం సురక్షితం కాదు''. దీనికి బెర్ట్రాండ్ రస్సెల్ ఒక ముఖ్యమైన అంశాన్ని జోడించారు. ''ఆధునిక ప్రపంచంలోని తిప్పలకు ప్రాథమికమైన కారణం తెలివితక్కువవారు ఆత్మవిశ్వాసంతో, మేధావులు తమ మది నిండా సందేహాలతో ఉండటం'' – అని. మార్క్‌ట్వైన్ ఒకడుగు ముందుకు వేసి, ''దేశభక్తి అంటే ఏమిటి? దేశం పట్ల అన్నివేళలా విధేయతను కలిగి ఉండటమా, లేక అవసరం అయినప్పుడు మాత్రం ప్రభుత్వం పట్ల విధేయతను చూపటమా?'' అని ప్రశ్నించుకున్నారు. బహుశా మాజీ యు.ఎస్. సెనేటర్ కార్ల్ షర్జ్ ఈ రెండిటినీ చక్కగా సమతూకం చేస్తూ, ''నా దేశం ఒప్పయినా, తప్పయినా కావచ్చు. ఒప్పయితే ఒప్పుగా ఉండనివ్వాలి. తప్పయితే ఒప్పుగా సరిదిద్దాలి'' అన్నారు.

అయితే ఈ రోజున మనం, నా దేశం తప్పు కావచ్చునన్న అంగీకారానికి సిద్ధమై ఉన్నామా? లేదా మూర్ఖత్వానికి మరో పేరైన పక్షపాతం దేశభక్తిని నిర్ణయిస్తుందా? లేదా మనం ప్రేమిస్తున్న దేశాన్నీ, దేశాన్ని పాలిస్తున్న ప్రభుత్వాన్నీ ఒకటిగా కలిపి చూసే పొరపాటు చేస్తున్నామా? అందుకే మూర్ఖులు మితిమీరిన ఆత్మవిశ్వాసంతో, తెలివైనవాళ్లు సందేహాలమయంగా ఉంటున్నారా?

ఈ ప్రశ్నలకు యువాల్ హరారీ పొడిపొడిగా, చాలా తెలివిడిగా సమాధానాలు ఇచ్చారు. ''నేను కృత్రిమ మేధ కంటే సహజసిద్ధమైన బుద్ధిహీనతకు ఎక్కువ భయపడతాను'' అన్నారు. మనకు ఎన్నికల సమయం కావటంతో ఇక్కడ బుద్ధిహీనత ఎక్కువగా ఉండి, విలువైన మేధ తక్కువగా కనిపిస్తోంది.



మల్లికార్జున ఖర్గే-రాహుల్ గాంధీ ; నరేంద్ర మోదీ-అమిత్ షా

కాబట్టి ఇదంతా కూడా రాజకీయాల గురించి మనకేమి చెబుతోంది? దాని గురించే కదా ఇప్పుడు చెప్పుకోబోతున్నదంతా! ఇక్కడ చూడండి. మీరు ఎంచుకోటానికి ఎంపిక చేసిన కొన్ని కొటేషన్లు ఇవి: ''రాజకీయాలు అంటే కష్టాలను కోరి తెచ్చుకునే, ప్రతి చోటా కష్టాన్నే వెతుక్కునే, ప్రతిదాన్నీ తప్పుగా నిర్ధారించుకునే, ప్రతి దానికీ తప్పుడు నివారణల్ని అన్వయించే ఒక కళ '' (గ్రౌచో మార్క్స్). ''రాజకీయం అంటే ఒకర్నుంచి ఒకరిని కాపాడుతామన్న హామీతో పేదవారి నుంచి ఓట్లను, సంపన్నుల నుంచి ఎన్నికల ప్రచార నిధులను రాబట్టుకునే సొగసైన కళ'' (ఆస్కార్ ఎమిరెంగర్). ''రాజకీయాలన్నవి రాజకీయ నాయకులకు వదిలి వేయవలసినంత తీవ్రమైనవన్న నిర్ధారణకు నేను వచ్చాను'' (చార్ల్స్ డి గాలె).

మరి ఈ రాజకీయ కళ... ప్రధాన కళాసాధకులైన రాజకీయ నాయకుల గురించి మనకేమి చెబుతోంది? మళ్లీ మీకు ఇష్టమైన కొటేషన్‌ను ఎంచుకోండి. ''రాజకీయ నాయకులు ఎక్కడైనా ఒకేలా ఉంటారు. నదే లేని చోట నదిపై వంతెన నిర్మిస్తామని వారు వాగ్దానం చేస్తారు'' (నికేతా కృశ్చేవ్). ''సొరంగం చివర వెలుగును చూసినప్పుడు బయటకు వెళ్లి మరికొన్ని సొరంగాలను కొనుగోలు చేసే వ్యక్తులే రాజకీయ నాయకులు'' (జాన్ క్వింటన్). ''తన దేశం కోసం మీ ప్రాణాలను అర్పించే మనిషే రాజకీయ నాయకుడు'' (టెక్సస్ గినన్). ''ఊరి తాళం చెవుల్ని రాజకీయ నాయకుడికి ఇవ్వటానికి బదులుగా తాళాన్నే మార్చేయటం తెలివైన పని కావచ్చు'' (డౌగ్ లార్సన్). ''నేను బాలుడిగా ఉన్నప్పుడు, ఎలాంటి వారైనా దేశాధ్యక్షుడు కావచ్చని నాకు చెప్పారు. నేనిప్పుడు ఆ మాటను నమ్మటం ప్రారంభించాను (ఇర్వింగ్ స్టోన్).

మీరు ఇప్పటికీ నాతో ఉన్నట్లయితే – ఉన్నారనే అనుకుంటున్నాను – 'ప్రెసిడెంట్' అనే మాటకు జోసెఫ్ హెల్లర్ ఇచ్చిన వివరణ మిమ్మల్నేమీ ఆశ్చర్యపరచదు. ఈ వివరణ చక్కగా సరిపోయే నాయకులు చాలా కొద్దిమందే ఉంటారు. అదేమిటో చూడండి: ''ఈ ప్రెసిడెంటు తను ఇవ్వవలసినంత మేరకు పూర్తిగా మీకు మద్దతు ఇస్తారు. ఆ మద్దతుతో మనం – నిదానంగా వెళ్లవలసి ఉన్నప్పటికీ – వీలైనంత వేగంగా ముందుకు వెళ్లాలని కోరుకుంటాం. ఈ ప్రెసిడెంటుకు తలూపేవాళ్లంటే ఇష్టం ఉండదు. మనకు కావలసింది ఎవరంటే – మన నిర్ణయాలన్నిటినీ మనం తీసేసుకున్నాక వాటిని అంగీకరించే – చిత్తశుద్ధి గల స్వతంత్ర వ్యక్తులు''.

ఆడ్లయ్ స్టీవెన్సన్ 1952 నాటి తన ఎన్నికల ప్రసంగంలో రాజకీయ నాయకులు ఒకరితో ఒకరు ఎలా వ్యవహరిస్తారనే దానికి అత్యుత్తమమైన వివరణ ఇచ్చారు. అక్కడ కూడా, వాళ్లంతా ఒక్కటే. ''నేను నా ప్రత్యర్థులకు ఒక ఆఫర్ ఇచ్చాను. వాళ్లు నా గురించి అబద్ధాలు చెప్పటం మానేస్తే, నేను వాళ్ల గురించి నిజాలు చెప్పటం మానేస్తాను'' అన్నారాయన.

ఈ కోట్స్ అన్నీ కూడా మన చుట్టూ జరుగుతున్న వాటిని గుర్తుకు తెచ్చేవి కావా? నేను ఉటంకించిన వ్యక్తులు భారతీయులు కానప్పటికీ, వాళ్లు మన రాజకీయ నాయకుల గురించి, మన దేశం గురించి మాట్లాడినట్లుగా లేదా? సమాధానం 'అవును' కనుకైతే వాళ్లెంతో అనర్గళంగా వ్యక్తపరచిన అసౌకర్యం నుంచి మనం సౌకర్యాన్ని పొందగలమా?

ప్రజలు మారవచ్చు. దేశాలు వేర్వేరు కావచ్చు. కానీ రాజకీయ నాయకులు ఎక్కడైనా ఒకేలా ఉంటారు. రాజకీయాలూ ఒకే విధంగా ఉంటాయి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.2.50 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** హస్త రా.7.41 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** తె.4.27 నుండి 6.11 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.12 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** ప.12.55 నుండి 2.43 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.13.

గరుడ వాహనంపై కోదండ రాముడు

నేడు సీతారాముల కల్యాణం



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం, ఏకశిలానగరిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా టీటీడీ వారు నిర్వహిస్తున్నారు. ఐదో రోజు ఆదివారం మోహినీ అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ మోహినీ అలంకారంలో శ్రీరాముడు గ్రామోత్సవంలో ఊరేగాడు. రాత్రి గరుడ వాహనంపై రాములోరు భక్తజనానికి అభయం ఇచ్చారు. కాగా, ఈ నెల 17వ తేదీ శ్రీరామ నవమితో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 26వ తేదీ పుష్పయాగంతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం పున్నమి వెన్నెల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అత్యంత వైభవంగా నిర్వహించే ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర స్థాయి ప్రముఖులు, లక్షలాది మంది భక్తులు హాజరు కానున్నారు.

జజ్జనకరి.. జనారే.. జగన్ వెనుక జనాలే

సీఎం జగన్ రాకతో జనసంద్రమైన మహా విశాఖ

ఉత్సాహంగా 20వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్ర

- దారి పొడవునా మానవహారం.. పూలు చల్లి స్వాగతం పలికిన జనం
- ఫొటోలు తీసేందుకు పోటీ పడ్డ వాహనదారులు
- పలుకరించేందుకు రోడ్లపైకి వచ్చిన వృద్ధులు, స్కూలు పిల్లలు
- సముద్రాన్ని తలపించిన విశాఖ బీఆర్టీఎస్ రోడ్డు
- లాంగ్ మార్చ్‌లా వెంట నడిచిన జగన్ సైన్యం
- అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వద్ద కలశాలతో మహిళల స్వాగతం
- చిన్నయపాలెం నుంచి ఎండాడ వరకు 45 కి.మీ. మేర సాగిన యాత్ర



గోపాలపట్నం రోడ్‌షోలో అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సాగర తీరంలో పోటెత్తే కెరటాల ఘోష శనివారం విశాఖ బీఆర్టీఎస్ రోడ్డులో వినిపించింది! చిరు మందహాసంతో జగనన్న కదిలి వస్తుంటే ఉప్పొంగిన మహా సైన్యం వెంట నడిచింది! అశేష జనవాహిని నడుమ ప్రశాంత వదనంతో అడుగులు వేస్తున్న సీఎం జగన్ చూసి ప్రచండ భానుడు చల్లబడ్డాడు! ఆకాశం మేఘావృతమై జననేతకు ఘన స్వాగతం పలికింది. మహా విశాఖ చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వేపగుంట జంక్షన్ నుంచి గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం, అక్కయ్యపాలెం, మద్దిపాలెం మీదుగా ఎండాడ వరకు సాగింది. దారిపొడవునా అక్కచెల్లెమ్మలు హారతులు, చిన్నారులు కోలాటాలు, యువకులు డ్యాన్సులు, తీన్‌మార్ స్టెప్పులతో సీఎం జగన్‌కు సాదర స్వాగతం పలికారు. అభిమానుల కోలాహలం మధ్య ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 20వ రోజు ఆదివారం గ్రేటర్ విశాఖలో అపూర్వ రీతిలో సాగింది.

దారులన్నీ యాత్ర వైపే..

చిన్నయ్యపాలెం నైట్ స్టే క్యాంపు వద్ద సీఎం జగన్‌ను చూసేందుకు స్థానికులు, అనకాపల్లి జిల్లా వాసులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలి రావడంతో పరిసరాలు కోలాహలంగా మారిపోయాయి. పలువురు పార్టీ నేతలు సీఎం జగన్‌ను శిబిరం వద్ద కలిశారు. చిన్నయపాలెం వద్ద ఉదయం 10.30 గంటల సమయంలో ప్రారంభమైన బస్సు యాత్ర పెందుర్తి నియోజకవర్గంలోని పినగాడి, రాంపురం, చింతల అగ్రహారం, లక్ష్మీపురం, వరలక్ష్మీనగర్, వేపగుంట మీదుగా గోపాలపట్నం వరకు సాగింది. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారిపొడవునా అక్కచెల్లెమ్మలు హారతులు ఇచ్చారు. లక్ష్మీపురం సెంటర్‌లో విద్యార్థినులు, యువతులు పూలుచల్లి స్వాగతం పలికారు. నాయుడుతోట మీదుగా సాగిన యాత్ర మధ్యాహ్నం భోజన విరామానికి గోపాలపట్నం చేరుకునే సరికి బీఆర్టీఎస్ రోడ్డు మొత్తం జనంతో నిండిపోయింది. గత ప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ తీసుకునేందుకు మండుటెండలో వెళ్లిన రోజులను, ఇప్పుడు పొద్దు పొడవకముందే వలంటీర్ ఇంటికే వచ్చి ఇవ్వటాన్ని పినగాడిలో వృద్ధులు గుర్తు చేసుకున్నారు. మేలు చేసిన తమ బిడ్డను చూస్తుంటే ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. పలుచోట్ల ఫొటోలు తీసేందుకు వాహనదారులు పోటీ పడ్డారు.

మురిసిన మహా విశాఖ..

ఉదయం పూట సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఒక ఎత్తు కాగా మధ్యాహ్నం గోపాలపట్నం నుంచి కొనసాగిన యాత్ర మరో ఎత్తు. సూరీడు చల్లబడటంతో అభిమానుల రెట్టించిన ఉత్సాహం నడుమ గోపాలపట్నం నుంచి కనీవినీ ఎరుగని రీతిలో యాత్ర సాగింది. సంబరాలు మిన్నంటాయి. నదులన్నీ సాగరాన్ని చేరినట్లు దారులన్నీ జగన్ యాత్ర వైపే దారి తీశాయి. లక్షలాదిగా తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో రోడ్డు మొత్తం నిండిపోయింది. ఇసుక వేస్తే రాలనంత జనంతో ఇసుకతోట జంక్షన్, తీన్‌మార్‌తో ఊగిపోయిన ఓల్డ్ కరసా ప్రాంతం, వందలాది కలశాలు నెత్తిన పెట్టుకుని స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న మహిళలతో అక్కయ్యపాలెం జంక్షన్ కిక్కిరిశాయి. మహా విశాఖ ప్రధాన రోడ్డు 20 కి.మీ మేర జన సంద్రాన్ని తలపించింది. మద్రిపాలెం చేరుకున్న జననేతకు అక్కచెల్లెమ్మలు ఘన నీరాజనం పలికారు. గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులు ఇచ్చారు. 58 నెలల పాలనలో జగనన్న అందించిన పథకాలు, చేసిన మేలును గుర్తు చేసుకున్నారు. గోపాలపట్నంలో మధ్యాహ్నం భోజన విరామం అనంతరం 3.30 గంటలకు తిరిగి ప్రారంభమైన బస్సు యాత్ర ఎండాడ వరకు సాగింది. సీఎం జగన్ రాత్రి 8.54 గంటలకు ఎంవీవీ సిటీ సమీపంలోని ఎండాడ నైట్ క్యాంప్ వద్దకు చేరుకున్నారు.

డబ్బుతో బాబు ఓట్ల రాజకీయం

వైఎస్సార్‌సీపీ కుటుంబాల్లో ఉండే వారిని 'వెధవలు' అంటూ కోమటి జయరాం సంబోధిస్తారా?



- ఓటుకు రూ.6 వేల నుంచి రూ.10వేలు పెట్టండి.. ఒక్కొక్కరు పది వైఎస్సార్‌సీపీ కుటుంబాలను మార్చాలని ప్రచారం చేస్తారా?
- టీడీపీ ఎన్నారైల మనీ పాలిటిక్స్‌పై అప్రమత్తంగా ఉండాలి
- ఈ విష ప్రచారాలపై ప్రజలు ఎన్నికల సంఘానికి, పోలీసులకు ఫిర్యాదు చేయాలి
- ఇలాంటి ఎన్నారైలపై పోలీసు కేసులకు మేం వెనకాడబోం
- ప్రజలకు మంచి చేసిన సీఎం సైకో ఎలా అవుతారు?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ చంద్రబాబు చిత్రపటాన్ని చెప్పలతో కొడుతున్న టీడీపీ కార్యకర్తలు

బెదిరింపులు, ఒత్తిళ్లకు తలొగ్గిన చంద్రబాబు

5 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థుల మార్పు

- ఉండి సీటు ఎగరేసుకుపోయిన రఘురామకృష్ణంరాజు.. సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు షాక్.. పార్టీ పదవితో సరి
- బందారుకు మాడుగుల.. పైలా ప్రసాద్‌కు మొండిచేయి.. పాడేరు సీటు రమేష్ నాయుడు నుంచి గిడ్డి ఈశ్వరికి బదిలీ
- మడకశిరలో సునీల్ కుమార్‌ను తొలగించి ఎంఎస్ రాజుకు టికెట్.. వెంకటగిరిలో లక్ష్మీప్రియకు షాక్.. అభ్యర్థిగా ఆమె తండ్రి
- అనపర్తిపై ఇంకా సందిగ్ధమే.. దెందులూరు, తంబళ్లపల్లె బీ ఫారాలు ఇవ్వని చంద్రబాబు
- ఉండిలో రామరాజు అనుచరుల ఆగ్రహం


మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పాలన విశాఖ నుంచే.. గెలిచేది జగనే..

ఎన్నికల ముందు లావాదేవీలతో స్పష్టం చేసిన నందమూరి బాలకృష్ణ

రెండు నెలల కిందట రుషికొండలో రెండెకరాలకు పైగా స్థలం కొనుగోలు

- రుషికొండ బీచ్‌రోడ్‌లో రూ.65 కోట్లు పెట్టి జనవరిలో స్థలం కొన్న బాలయ్య
- ఈ స్థలం కొనుగోలు చేయడానికి అప్పటికప్పుడు కొత్త కంపెనీ ఏర్పాటు
- ఆ కంపెనీలో బాలకృష్ణకు, ఆయన కుటుంబీకులకే 100 శాతం వాటా
- గతంలో బాబు అధికారంలో ఉన్నప్పుడు అమరావతిలో స్థలం కొన్నా నష్టమే
- 6.5 కోట్లకు కొంటే రూ.2.4 కోట్లకు పడిపోయిందని వెల్లడించిన బాలయ్య
- రుషికొండలో ముఖ్యమంత్రి కార్యాలయం ఖాయం కనుక అక్కడే అనుకూలం
- టీడీపీ గెలుస్తుందనే ఆశ లేదు కాబట్టే రుషికొండవైపు బాలకృష్ణ చూపు
- అమరావతిపై టీడీపీకి సైతం ఆశలు పోయాయంటున్న రాజకీయ నిపుణులు



ANNEXURE NO. 1
Name: NANDAMURI BALAKRISHNA
Relation: Self

Annexure No: 1.2

	Details	Amount
Details of investments in Bonds, Debentures/Shares and Units in companies/Mutual Funds and Others and the amount	25% share of interest in the Partnership firm M/s NBK Classic2 LLP at Rushikonda Beach Road, S y Nos 9/5p, 12/2p, 12/3p Extent: Ac 10455 Sqyds Market Value:Rs. 17,57,62,775/- 1/7 share of interest in the Property at ghazmandy.	175,762,775

విశాఖలోని రుషికొండ వద్ద కొనుగోలు చేసిన స్థలం గురించి అఫిడవిట్‌లో పేర్కొన్న బాలకృష్ణ



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎన్ని కూటములు కట్టినా ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచే అవకాశం లేదని తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒక నిర్ణయానికి వచ్చేసినట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖపట్నాన్ని రాజధానిగా ప్రకటించడాన్ని, అక్కడ రుషికొండలో కార్యాలయాన్ని నిర్మిస్తుండటాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రాష్ట్రానికి రాజధానిని లేకుండా చేశారంటూ... తన మద్దతుదారులందరికీ ఇదే నూరిపోస్తోంది. తాము గనక గెలిస్తే అమరావతే రాజధాని అంటూ ఘంటాపథంగా చెబుతోంది కూడా. మరి అలాంటి పార్టీలో అత్యంత ముఖ్యుడైన నందమూరి బాలకృష్ణ... చంద్రబాబు తరవాత పార్టీకి నెంబర్-2 స్థానంలో ఉన్న బాలకృష్ణ... ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు విశాఖలోని రుషికొండలోనే దాదాపు 65 కోట్లు పెట్టి భారీ స్థలం కొన్నారంటే ఏమనుకోవాలి? భవిష్యత్తు కనిపిస్తోంది కనక ఇప్పటికైనా జాగ్రత్తపడి స్థలం కొంటే భారీగా లాభపడవచ్చన్న అభిప్రాయం ఉండబట్టే కదా!!. దీనర్థం తెలుగుదేశం పార్టీ ఏ కోశానా గెలవదనే కదా?!.

అమరావతిలో కొన్నా... భారీ నష్టాలు

నిజానికి ఎన్టీఆర్ తనయుడిగా... చంద్రబాబుకు వియ్యంకుడిగా... టాప్ హీరోల్లో ఒకడిగా ఉన్న బాలకృష్ణకు ఆస్తులకు కొదవలేదు. ఇప్పుడు కొనకపోయినా... ఎప్పుడైనా ఎక్కడ కావాలంటే అక్కడ స్థలాలు, భవనాలు కొనే ఆర్థిక స్తోమత ఆయనకుంది. కాబట్టి ఆయన ఎక్కడ ఏది కొన్నా దాన్ని పెట్టుబడిగానే భావించాలి. మున్ముందు మంచి లాభాలొస్తాయనే ఉద్దేశంతోనే కొంటారు. కాకపోతే 2019లో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నపుడు అమరావతిలో ధరలు పెరిగి బాగా లాభం వస్తుందనే ఉద్దేశంతో ఆయన ఎకరం స్థలం దాదాపు 6.5 కోట్లు పెట్టి కొన్నారు. కానీ ఆ తరవాత ఎన్నికలొచ్చి... చంద్రబాబు నాయుడు ఓడిపోవటం... రాజధానిగా ఆ ప్రాంతం సరైనది కాదని, అన్ని అర్హతలూ ఉన్న విశాఖపట్నాన్ని గనక రాజధానిని చేస్తే తక్కువ పెట్టుబడులతో ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భావించారు. దానికి అనుగుణంగానే విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, అమరావతిని పాలన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేస్తామని ప్రకటించారు. విశాఖలోని రుషికొండలో టూరిజం విభాగం కార్యాలయాన్ని కూడా నిర్మించింది. కాకపోతే రుషికొండలో కార్యాలయ నిర్మాణాన్ని, విశాఖను రాజధానిగా ప్రకటించడాన్ని తెలుగుదేశం పార్టీ ఆది నుంచీ జీర్ణించుకోలేకపోతోంది. అమరావతిలో తమ రియల్ ఎస్టేట్ కలలు నిలువునా కూలిపోవటంతో విశాఖను రాజధానిగా ప్రకటించవద్దంటూ న్యాయస్థానాల్లో కేసులు వేసింది. ప్రతి స్థాయిలోనూ అడ్డుకునే ప్రయత్నం చేస్తూ వస్తోంది. ఎన్ని అడ్డంకులు సృష్టిస్తున్నా జగన్ సంకల్పం గట్టిది కావటంతో అవన్నీ వీగిపోతూ వస్తున్నాయి. రుషికొండ కార్యాలయాన్ని టూరిజం విభాగం ఆరంభించేసింది కూడా. ఈ నేపథ్యంలో జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక తాను విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని ముఖ్యమంత్రి జగన్ ఇటీవలే జనం సాక్షిగా ప్రకటన చేశారు.

ముందే స్థలం కొన్న బాలయ్య...

ప్రతి సర్వేలోనూ వైఎస్ జగన్ గెలుపు ఖాయమని వస్తుండటంతో పాటు తెలుగుదేశం పార్టీ అంతర్గతంగా చేస్తున్న సర్వేల్లోనూ వైసీపీ గెలుపు తథ్యమని తేలుతుండటంతో నందమూరి బాలకృష్ణ జాగ్రత్త పడ్డట్టు కనిపిస్తోంది. ఆయన వియ్యంకుడికి చెందిన గీతం కళాశాల కూడా సమీపంలోనే ఉండటంతో రుషికొండలోనే మంచి స్థలం చూడాలని ఈ ఏడాది జనవరిలో బాలకృష్ణ వారిని కోరినట్లు తెలిసింది. గతంలో ఆంధ్రా యూనివర్సిటీలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసి... కొద్దికాలం గీతం వర్సిటీకి చైర్మన్‌గా కూడా పనిచేసిన విద్యావేత్త కోనేరు రామకృష్ణారావు కుటుంబీకులకు చెందిన స్థలం అక్కడ ఉండటంతో దాన్ని బాలకృష్ణ అల్లుడు డీల్ చేసినట్లుగా సమాచారం. కోనేరు కుటుంబీకులంతా దాదాపుగా విదేశాల్లో ఉండటంతో వారికి చెందిన 10,255 చదరపు గజాల (2.15 ఎకరాలు) బీచ్‌రోడ్‌కు అభిముఖంగా ఉన్న స్థలాన్ని జనవరిలోనే బాలకృష్ణ రూ.65 కోట్లకు కొన్నారు. ఇందులో 1150 చదరపుటడుగుల చిన్న ఇల్లు కూడా ఉంది. స్థలం కొన్న విషయం బయటకు రాకుండా బాలయ్య అప్పటికప్పుడు తన కుటుంబానికే 100 శాతం షేర్లుండేలా ఎన్‌బీకే క్లాసిక్-2 అనే ఓ లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ కంపెనీని ఏర్పాటు చేశారు. దాని పేరిటే భూమిని కొన్నారు. దీన్లో బాలకృష్ణకు వ్యక్తిగతంగా 25 శాతం... హెచ్‌యూఎఫ్ కర్తగా 30 శాతం; ఆయన భార్యాపిల్లలకు మిగిలిన 45 శాతం వాటాలున్నాయి. ఈ విషయాన్ని తాజాగా వేసిన ఎన్నికల అఫిడవిట్లో నేరుగా ఆయనే తెలియజేశారు. కాకపోతే ఇప్పటికిప్పుడు ఇంత హడావుడిగా బాలయ్య రుషికొండలో స్థలం కొన్నారని తెలిసిన రాజకీయ పరిశీలకులు ముక్కున వేలేసుకుంటున్నారు.

జగన్ మళ్లీ అధికారంలోకి రావాలనేది ప్రజల ఆకాంక్ష

- 'సాక్షి' మీడియా గ్రూప్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ సపోర్టర్స్–హైదరాబాద్ ఆధ్వర్యంలో 'లెట్స్ ఓట్ ఫర్ వైఎస్ జగన్' కార్యక్రమం



కార్యక్రమంలో 'సాక్షి'మీడియా గ్రూప్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు

మూసాపేట: సమాజంలో అందరి మేలు కోరే ఏపీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని 'సాక్షి'మీడియా గ్రూప్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి శాంతినగర్‌లోని రామాలయం సమీపంలో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్ ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ సపోర్టర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్: లెట్స్ ఓట్ ఫర్ వై.ఎస్. జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్, బాలయ్యకు సొంతూళ్లో పోటీ చేసే దమ్ము లేదని విమర్శించారు. పుట్టు పూర్వోత్తరాలన్నీ తెలిసిన సొంతూళ్ల ప్రజలు గెలిపించరనే వారు అక్కడ పోటీ చేయరన్నారు. అధికారంలోకి రావడానికి వారు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు వాటిని ధైర్యంగా ఎదుర్కొని తిప్పికొట్టాలని ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. వై.ఎస్. జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని చెప్పారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న వైఎస్సార్ అభిమానులు, తమ నియోజకవర్గాల్లో, ఇతర నియోజకవర్గాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయించాలని కోరారు. 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ సీట్లు గెలిచి వై.ఎస్. రాజశేఖరరెడ్డికి నిజమైన నివాళులు అర్పిద్దామన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు తిప్పరాజు మాట్లాడుతూ విజయవాడలో ఎన్నో ఆలయాలను కూల్చేసిన చంద్రబాబు కావాలా లేక సమాజమే దేవాలయం, మనుషులే దేవుళ్లుగా భావించే జగన్‌మోహన్‌రెడ్డి కావాలా? అన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విశ్లేషకులు సీఏ నాగార్జునరెడ్డి, ఎంఈవీ ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీఎల్ఎన్ రెడ్డి, నిర్వాహకులు ఎస్వీ సుబ్రహ్మణ్యంరెడ్డి, బానా రాఘవ, కె.చంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజశేఖర్, సురేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సుస్పష్టం

- గుంట నక్కలు, ముళ్ల పందులు కూటమిగా ఒకవైపు..
- జగన్ ఒక్కరే ఒకవైపు.. ఆయన వెంటే జనం
- పవన్ స్పష్టతలేని వ్యక్తి.. చంద్రబాబు కోసమే పుట్టాడు, పెరిగాడు
- ఎన్నికల అనంతరం బాబుతోనే ఆయన అంకం ముగుస్తుంది

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి. పక్కన రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, మంత్రి జోగి రమేష్

కంకిపాడు: 'సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సుస్పష్టమైంది. నానాజాతి సమితిగా గుంటనక్కలు, హైనాలు, ముళ్ల పందులు ఒకవైపు ఉంటే సంక్షేమం, మంచి ఎజెండాతో ఆశీస్సులు కోరుతూ జగన్ ఒక్కరే మరోవైపు ఉన్నారు. ఆయన వెంటే జనం ఉన్నారు. ఎవరెవరితో కలిసివచ్చినా ఒరిగేదేమీలేదు. వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోవటం ఎవరి తరమూ కాదు'.. అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, మంత్రి జోగి రమేష్‌తో కలిసి ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రమంతటా సంస్కరణలు, సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. 87 శాతం మంది ప్రజానీకానికి సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందాయన్నారు. ప్రజల జీవితాల్లో మంచి మార్పు లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగించారన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

జగన్‌కు బాసటగా ప్రజాప్రవాహం..

సంక్షేమం, మంచి అజెండాతో ప్రజాశీస్సులు కోరుతూ ముఖ్యమంత్రి జగన్ ఒక్కడిగా పోరాడుతున్నారు. ప్రజల అండదండలు, ఆశీస్సులు జగన్‌కే ఉన్నాయి. 2014–19 వరకూ అరాచక పాలన సాగింది. 2019 నుంచి దేశం యావత్తూ ఆదర్శంగా తీసుకునేలా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలన సాగింది. ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని, నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతోనే జగన్ ప్రజా మద్దతు కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బస్సుయాత్ర, సిద్ధం సభలకు జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఉప్పెనలా ప్రజా ప్రవాహం జగన్‌కు బాసటగా నిలుస్తోంది. ప్రజల్లో లభిస్తున్న ఆదరణ వైఎస్సార్‌సీపీ విజయాన్ని స్పష్టంచేస్తోంది.

గుంట నక్కలు, ముళ్ల పందులు అన్నీ కలిసి నానా జాతి సమితిగా..

ముళ్ల పందులు, గుంట నక్కలు, హైనాలు అన్నీ ఒక వైపు ఉంటే, జగన్ ఒక్కడే ఒక వైపు ప్రజల మద్దతుతో ఉన్నారు. అజెండా లేకుండా, అధికారం కోసం పొత్తులతో నానా జాతి సమితిగా ఏర్పడ్డారు. అధికారం కోసం శక్తులన్నీ ఏకమయ్యాయి. అధికారం అంటే కేవలం కుర్చీకాదు. అధికారం అంటే బాధ్యత, సేవే లక్ష్యంగా జగన్ పాటుపడుతున్నారు. అఖండ మెజారిటీలతో 151కు పైగా స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించటం ఖాయం. ఈ నెల 25న సీఎం జగన్ నామినేషన్ దాఖలు చేస్తారు. రెండ్రోజుల్లో ప్రజల మేనిఫెస్టో రానుంది.

పవన్ ఎప్పుడూ పరిపక్వ నేతగా మాట్లాడలేదు..

ఇక పవన్‌కళ్యాణ్ ఒక స్పష్టతలేని వ్యక్తి. ఎప్పుడూ పరిపక్వత కలిగిన నేతగా మాట్లాడలేదు. నాయకుడు కావాలన్న నేతగానూ ఎప్పుడూ వ్యవహరించలేదు. పవన్ పుట్టింది, పెరిగింది చంద్రబాబు కోసమే. బాబు బటన్ నొక్కితేనే పవన్ కదులుతాడు, మాట్లాడతాడు. ఇక కూటమికి చిరంజీవి మద్దతిస్తే ఒరిగేదేమీలేదు. ఎంతమంది కూటమిగా ఏర్పడ్డా, కలిసొచ్చినా రానున్న ఎన్నికల విజయం వైఎస్సార్‌సీపీదే. ఎన్నికల అనంతరం చంద్రబాబుతో పాటుగా పవన్ అంకం కూడా ముగుస్తుంది' అని పేర్కొన్నారు.

రాష్ట్రీయం

సీఎం రేవంత్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కింది: హరీశ్



మాట్లాడుతున్న హరీశ్‌రావు

మెదక్ జోన్: ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చమంటే కేసులు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని, మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తేనే ఆయన అహంకారం దిగుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం రాత్రి మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేత, దాటవేత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏడుపాయల అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.100 కోట్లు మంజూరు చేస్తే ఆ నిధులను రద్దు చేసిన సీఎంకు అమ్మవారి ఉసురు తగులుతుందన్నారు. వి.హనుమంతరావు, మోత్కుపల్లి నర్సింహులు లాంటి సీనియర్ నాయకులకే రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటే.. ఇక మామూలు ప్రజలకు ఎలా అందుబాటులో ఉంటారని హరీశ్‌రావు విమర్శించారు.

రాజకీయ రంగస్థలం

ఎన్నికల బరిలో సినీ తారలు ● కంగనా మొదలు రచన దాకా ● బీజేపీ, తృణమూల్ నుంచే ఎక్కువ

రాజకీయం కూడా రంగస్థలంగా మారిపోయింది. మన దేశంలో రాజకీయాలు, నటన దశాబ్దాలుగా పరస్పరం పెనవేసుకుపోయాయి. సినీ రంగంలో ఓ రేంజ్‌లో వెలిగిన పలువురు సూపర్‌స్టార్లు ఎన్నికల బరిలోనూ దుమ్ము రేపారు. ఈసారి కంగనా రనౌత్ మొదలుకుని రచనా బెనర్జీ దాకా పలువురు సినీ తారలు లోక్‌సభ బరిలో దిగుతున్నారు. ఈ జాబితాలో అధికార బీజేపీ ముందుంది. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈసారి తారాబలంపై గంపెడాశలు పెట్టుకుంది. ఎక్కువగా ఉత్తరాది నుంచే బరిలో దిగుతున్న ఈ తారల్లో పలువురు తెలుగు ప్రేక్షకులను అలరించినవారే కావడం విశేషం...!

- సాక్షి, నేషనల్ డెస్క్

కంగనా రనౌత్



సోదరుడికి తుపాకీ బొమ్మ, తనకు ఆడపిల్ల బొమ్మ తెచ్చినందుకు ఏమిటీ వివక్ష అని తండ్రినే ప్రశ్నించిన తత్వం కంగనది! చిన్నప్పటి నుంచే రెబెల్‌గా పేరుబడ్డారు. స్వయంకృషితో బాలీవుడ్‌లో రాణించారు. బాలీవుడ్ పరిశ్రమపై సంచలన ఆరోపణలు, బడా హీరోలపై కామెంట్లతో వార్తల్లో నిలిచారు. కంగనా హిమాచల్‌లోని స్వస్థలం మండి నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్యను ఢీకొడుతున్నారు. ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు.

రవి కిషన్



భోజ్‌పురి సినిమాల్లో సూపర్‌స్టార్. రేసుగుర్రం తదితర సినిమాల్లో విలన్‌గా తెలుగు ప్రేక్షకులకు చిరపరిచితుడు. అసలు పేరు రవీంద్ర శ్యాం నారాయణ్ శుక్లా. యూపీలోని గోరఖ్‌పూర్ బీజేపీ సిట్టింగ్ ఎంపీ. మరోసారి అక్కడినుంచే పోటీ చేస్తున్నారు.

సురేశ్ గోపి



ఈ మలయాళ సూపర్‌స్టార్‌కు చిన్నప్పటి నుంచీ రాజకీయ మక్కువ ఎక్కువే. కాలేజీ రోజుల్లోనే ఎస్ఎఫ్ఐలో చురుకైన కార్యకర్తగా ఉన్నారు. 2016లో రాజ్యసభకు నామినేట య్యారు. అనంతరం బీజేపీలో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున కేరళలోని త్రిసూర్ నుంచి పోటీ చేసి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈసారీ అక్కడి నుంచే బరిలో ఉన్నారు. కె.మురళీధరన్ (కాంగ్రెస్), వి.ఎస్.సునీల్‌కుమార్ (సీపీఐ) నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

నవనీత్ కౌర్ రాణా



2004లో వచ్చిన 'శ్రీను, వాసంతి, లక్ష్మి' సినిమా ద్వారా తెలుగు ప్రజలకు పరిచయమయ్యారు. వివాహానంతరం రాజకీయ కెరీర్ ఆరంభించారు. 2011లో మహారాష్ట్రలోని బద్నేరా స్వతంత్ర ఎమ్మెల్యే రవి రాణాను పెళ్లాడారు. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో అమరావతి నుంచి కాంగ్రెస్, ఎన్సీపీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా గెలిచారు. ఈసారి కూడా అమరావతి నుంచే బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బల్వంత్ వాంఖడే, అంబేడ్కర్ మనవడు ఆనందరాజ్ నుంచి పోటీ ఎదుర్కొంటున్నారు.

గోవిందా



ఈ బాలీవుడ్ సూపర్‌స్టార్ అసలు పేరు గోవింద్ అరుణ్ అహూజా. 2004లో బాలీవుడ్‌లో బిజీగా ఉంటూనే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ముంబై నార్త్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బీజేపీ దిగ్గజం రాం నాయక్‌ను ఓడించారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవలే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనలో చేరారు. ఈసారి పోటీ చేయబోనని ప్రకటించినా, ముంబైలో ఏదో ఒక లోక్‌సభ స్థానం నుంచి పోటీకి ఆసక్తిగా ఉన్నారు.

అరుణ్ గోవిల్



ప్రజాదరణ పొందిన రామాయణ్ సీరియల్‌లో రాముని పాత్రతో ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయారు. యూపీలోని తన స్వస్థలం మీరట్ నుంచి బీజేపీ తరఫున బరిలో దిగారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభించిన ఊపులో ఉన్న బీజేపీ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకుంది. మీరట్‌తో పాటు పరిసర లోక్‌సభ స్థానాలపైనా గోవిల్ ప్రభావం చూపుతారని ఆశిస్తోంది.

హేమమాలిని



డ్రీమ్‌గాళ్‌గా దేశవ్యాప్త క్రేజ్ సంపాదించిన సూపర్‌స్టార్. 2011లో బీజేపీ తరఫున రాజ్యసభకు ఎన్నికవడం ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని మథుర నుంచి వరుసగా గెలిచారు. హ్యాట్రిక్ కొట్టే ప్రయత్నంలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ముకేశ్ ధంగార్, బీఎస్పీ నుంచి సురేశ్ గట్టి పోటీ ఇస్తున్నారు.

రచనా బెనర్జీ



చిరంజీవి హీరోగా వచ్చిన 'బావగారు బాగున్నారా'తో పాటు పలు తెలుగు సినిమాల్లో తన అందం, నటనతో అలరించారు. ఈ బెంగాలీ ముద్దుగుమ్మ అసలు పేరు ఝుమ్‌ఝుమ్ బెనర్జీ. 1997లో కన్యాదానం సినిమాతో పాపులర్ అయ్యారు. తెలుగులో 13 సినిమాల్లో నటించారు. ఒడియాలో ఏకంగా 36 సినిమాల్లో నటించి అక్కడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రెండు పెళ్లిళ్లయ్యాయి. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నారు. పశ్చిమబెంగాల్లోని హుగ్లీ నుంచి తృణమూల్ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ, నటి లాకెట్ చటర్జీతో తలపడుతున్నారు.

శత్రుఘ్న సిన్హా



బాలీవుడ్ దిగ్గజాల్లో ఒకరు. 'టాపిక్ ఈజ్ ఓవర్' అంటూ రక్తచరిత్ర సినిమాలో ఎన్టీఆర్ వేషధారణతో తెలుగు వారినీ అలరించారు. 1992లో న్యూఢిల్లీ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ తరఫున బరిలో దిగిన మరో బాలీవుడ్ దిగ్గజం రాజేశ్ ఖన్నా చేతిలో ఓటమి చవిచూశారు. 1996లో రాజ్యసభకు ఎన్నికై వాజ్‌పేయి హయాంలో కేంద్ర మంత్రిగా కూడా చేశారు. 2009, 2014ల్లో బిహార్లోని పట్నా సాహిబ్ నుంచి బీజేపీ టికెట్‌పై గెలిచారు. 2019లో అక్కడినుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి తృణమూల్ కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి, కేంద్ర సహాయ మంత్రి ఎస్.ఎస్.అహ్లూవాలియా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

ఆగని ఇజ్రాయెల్ దాడులు

రఫా సిటీలో 22 మంది దుర్మరణం

రఫా(గాజా స్ట్రిప్): గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడుల పరంపర కొనసాగుతోంది. ఆదివారం దక్షిణ గాజా నగరమైన రఫాలో శరణార్థి శిబిరాలపై ఇజ్రాయెల్ జరిపిన వేర్వేరు వైమానిక దాడుల్లో మొత్తంగా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 18 మంది చిన్నారులు ఉన్నారు. కువైటీ ఆస్పత్రి దగ్గర జరిగిన దాడిలో భార్యాభర్తలు, వారి మూడేళ్ల చిన్నారి చనిపోయారు. మరో దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 13 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజాలోని మొత్తం 23 లక్షల జనాభాలో దాదాపు సగం మంది రఫాలోనే తలదాచుకుంటున్నారు. అయినా వారిపైనే ఇజ్రాయెల్ ప్రతిరోజూ వైమానిక దాడులు చేస్తూ తన ప్రతీకారం తీర్చుకుంటోంది. ఇజ్రాయెల్ ఆక్రమణలోని వెస్ట్‌బ్యాంక్‌లోని హెబ్రోన్ పట్టణ చెక్‌పోస్ట్‌పై ఆదివారం ఉదయం కత్తి, గన్‌తో దాడిచేసిన ఇద్దరు పాలస్తీనియన్లను హతమార్చామని ఇజ్రాయెల్ మిలిటరీ తెలిపింది. మరోవైపు ఉక్రెయిన్, పాలస్తీనియన్లకు సాయం కోసం ఉద్దేశించిన 26 బిలియన్ డాలర్ల ప్యాకేజీకి అమెరికా దిగువ సభ తన ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజీ కిందే పాలస్తీనియన్లకు 9 బిలియన్ డాలర్ల మానవతా సాయం అందించనున్నారు. ఇజ్రాయెల్–హమాస్ పోరులో ఇప్పటిదాకా 34,000కుపైగా పాలస్తీనియన్లు చనిపోయారు. ఆరునెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ఇకనైనా చరమగీతం పాడాలని ప్రపంచదేశాలు తమ వంతుగా దౌత్యమార్గాలను అన్వేషిస్తున్నాయి.

బీజేపీ టార్గెట్ చేసింది.. మాకు రక్షణ లేదు: మమత

కుమార్‌గంజ్: తనను, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని కేంద్రంలోని అధికార బీజేపీ లక్ష్యంగా చేసుకుందని, తమకు రక్షణ లేదని భావిస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలకు, పశ్చిమ బెంగాల్ ప్రజలకు వ్యతిరేకంగా సాగుతున్న కుట్రలను రాష్ట్రంలో అందరూ ఒక్కటై ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఆదివారం కుమార్‌గంజ్‌లో ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. బెంగాల్‌లో సోమవారం పెద్ద విస్ఫోటనం జరగబోతోందని, అది తృణమూల్ కాంగ్రెస్‌ను, ఆ పార్టీ నేతలను వణికించడం ఖాయం అంటూ బీజేపీ నేత సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి ఓ ద్రోహి తమ పార్టీ నుంచి బీజేపీలో చేరాడని సువేందు అధికారిపై మండిపడ్డారు. చాక్లెట్ బాంబు పేలుళ్లు తమను ఏమీ చేయలేవని అన్నారు.

నన్నేమీ వాషింగ్ మెషీన్‌లో వేయలేదు

నాపై మోపిన కేసుల దర్యాప్తు కొనసాగుతోంది
బీజేపీతో జట్టుకట్టాక కేసులేవీ ఎత్తేయలేదు
విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టిన అజిత్ పవార్

ఇంటర్వ్యూ



విపక్ష నేతలను పార్టీలో చేర్చుకుని వారి అవినీతిమరకలను బీజేపీ వాషింగ్‌మెషీన్‌లో వేసి మటుమాయం చేసి సచ్ఛీలుగా నమ్మబలుకుతోందంటూ బీజేపీపై కొంతకాలంగా ఆరోపణలున్నాయి. అయితే తననేమీ అలాంటి వాషింగ్‌మెషీన్‌లో బీజేపీ పడేయలేదని ఎన్సీపీ నేత అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. ఎన్సీపీలో చీలిక తెచ్చాక ఏక్‌నాథ్ షిండే, బీజేపీ సర్కార్‌లో చేరిన అజిత్ పవార్‌పై ఉన్న పాత కేసులను బీజేపీ సర్కార్ కొట్టేసిందంటూ వచ్చిన వార్తలపై అజిత్ స్పందించారు. ఇండియాటుడే ముఖాముఖిలో అజిత్ ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఈడీ భయంతోనే ఎన్సీపీను చీల్చారన్న ఆరోపణలపై..

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు భయపడి కొందరు ఎన్సీపీ నేతలు పార్టీని చీల్చాలని నాపై ఒత్తిడితెచ్చారనేది శుద్ధ అబద్ధం. అందరు ఎన్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్డీఏలో చేరాలని ఎప్పుడో అనుకున్నారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో సంకీర్ణ కూటమి సర్కార్ కొనసాగుతున్న కాలంలోనే ఈ నిర్ణయం జరిగిపోయింది. సంబంధిత లేఖపై జయంత్ పాటిల్, అనిల్ దేశ్‌ముఖ్, జితేంద్ర అవ్హాద్, రాజేశ్ తోపే, ఇంకొందరు సీనియర్లు సంతకాలు చేశారు. బీజేపీతో జట్టుకట్టాలని మేం ఆనాడే అనుకున్నాం.

ఎక్కడి కేసులు అక్కడే..

''మహారాష్ట్రలో నీటిపారుదల కేసులో నాపై విపక్షాలు చేస్తున్నవన్నీ నిరాధార ఆరోపణలే. ఇప్పుడు నాపై ఆరోపణలు చేస్తున్న విపక్ష నేతలు అందరితోనూ గతంలో కలిసి పనిచేశా. నాపై ఇలాంటి ఆరోపణలు ఆనాడు చేయలేదు. ఇప్పుడు వారితో లేను. అందుకే నాపై ఆరోపణల బురద చల్లుతున్నారు. ఎన్డీఏ కూటమిలో చేరగానే బీజేపీ 'వాషింగ్ మెషీన్'లో ఉతికేసిందనేది అవాస్తవం. ఇరిగేషన్ కేసులో నాపై కేసులు ఏవీ ఎత్తేయలేదు. కేసులు అలాగే ఉన్నాయి. దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది''

సుప్రియా సూలేపై తన భార్య పోటీపై..

పవార్‌ల కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. పార్టీ రెండు ముక్కలయ్యాక సుప్రియాపై ఇటీవల రాజకీయ అరంగేట్రం చేసిన తన భార్య సునేత్రను పోటీకి నిలబెట్టడాన్ని అజిత్ పవార్ సమర్థించుకున్నారు. ''ఇది పవార్ కుటుంబ సభ్యుల మధ్య ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న పోరాటం. సుప్రియ, శరద్‌లకు వ్యతిరేకంగా ఓటేయాలంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు. నేను ఎవరినైనా అలా బెదిరిస్తే నా ముందుకు తీసుకుని రండి. అది నిజం అని చెప్పించండి చూద్దాం. ఫోన్‌లో బెదిరించానని వాళ్లు ఆరోపిస్తే, ఆ ఆరోపణల తాలూకు ఫోన్ రికార్డులనైనా చూపించమనండి'' అని సవాల్ విసిరారు.

-న్యూఢిల్లీ

ఓటు వినియోగించుకున్న కాసేపటికే వృద్ధుడి మృతి

కొట్టాయం: కేరళలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన కొద్దిసేపటికే ఓ వృద్ధుడు మృతిచెందాడు. కొట్టాయం జిల్లాకు చెందిన 99 ఏళ్ల ఎ.కె.రామన్ నాయర్ శనివారం తన ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఎన్నికల సంఘం సిబ్బంది ఆయన ఇంటికి వచ్చి బ్యాలెట్ పేపర్ తీసుకెళ్లారు. తర్వాత కొన్ని నిమిషాల వ్యవధిలోనే చనిపోయాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ఓటు వేసినందుకు చాలా ఆనందించాడని తెలిపారు. రామన్ నాయర్ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్నాడు.

లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గలేకే రాజ్యసభకు..

సోనియాపై మోదీ విసుర్లు



జైపూర్: ప్రజాబలం లేక లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గలేనివారు రణక్షేత్రం వదిలేసి, రాజస్తాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఎన్నో పాపాలు చేసిందని, అందుకే దేశ ప్రజలు ఆ పార్టీని శిక్షించారని చెప్పారు. ఒకప్పుడు 400 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ఇప్పుడు సొంతంగా కనీసం 300 స్థానాల్లో పోటీ చేయలేని దుస్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. ఆ పార్టీ పరిస్థితి పూర్తి దిగజారిందన్నారు. ఆదివారం రాజస్తాన్‌లోని జలోర్, బన్స్వారా జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహిరంగ సభలో ప్రసంగించారు. దేశాన్ని బలోపేతం చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని తేల్చిచెప్పారు. 2014కు ముందు నాటి పరిస్థితులను దేశ ప్రజలు ఎంతమాత్రం కోరుకోవడం లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పాలనలో పుట్టుకొచ్చిన అవినీతి, బంధుప్రీతి అనే చెదపురుగులు మన దేశాన్ని గుల్ల చేశాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పట్ల ప్రజలు చాలా కోపంగా ఉన్నారని, ప్రధానంగా యువత మరోసారి కాంగ్రెస్ ముఖం చూడడానికి కూడా ఇష్టపడడం లేదని అన్నారు. విపక్షాలు 'ఇండియా' అనే అవకాశాద కూటమిగా ఏర్పడ్డాయని మోదీ ఆరోపించారు. ఆ కూటమి గాల్లోకి ఎగరడానికి ముందే దారం తెగిన గాలిపటంగా ఉందని ఎద్దేవా చేశారు.

ముయిజ్జు పార్టీకి భారీ మెజారిటీ

మాలె: మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు ముయిజ్జు సారథ్యంలోని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్(పీఎన్‌సీ)భారీ మెజారిటీ సాధించింది. పార్లమెంట్‌లోని 93 సీట్లకు జరిగిన ఎన్నికల్లో పీఎన్‌సీ 60కి పైగా సీట్లతో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. 2 లక్షల మంది ఓటర్లలో ఆదివారం జరిగిన పోలింగ్‌లో 72.96% మంది ఓటేశారు. చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు చర్యలతో భారత్‌తో మాలె సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా ఎన్నికల ఫలితాలు రెండు దేశాల మధ్య సంబంధాలపై మరింత ప్రతికూల ప్రభావం చూపుతాయని పరిశీలకులు భావిస్తున్నారు.

రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 9 మంది మృత్యువాత

వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా విషాదం

కోటా: రాజస్తాన్‌లోని ఝులావర్ జిల్లాలో ఆదివారం వేకువ జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు సోదరులు సహా మొత్తం 9 మంది మృత్యువాతపడ్డారు. ఝులావర్‌లోని ఖాన్‌పూర్, బరన్ జిల్లా హర్నవాడకు చెందిన చెందిన కొందరు మధ్యప్రదేశ్‌లోని దుంగ్రిలో వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న మారుతి వ్యాన్ పచోలా గ్రామ సమీపంలో ట్రక్కును వేగంగా ఢీకొట్టింది. ఘటనలో వ్యానులోని తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా ఒకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నా భర్తను చంపాలని చూస్తున్నారు: సునీత

రాంచీ: మధుమేహంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేజ్రీవాల్‌ను కడతేర్చాలని కేంద్రంలోని బీజేపీ సర్కార్ బలంగా కోరుకుంటోందని ఆయన భార్య సునీత తీవ్ర ఆరోపణలు చేశారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా రాంచీలో విపక్షాలు తలపెట్టిన 'ఉల్గులాన్(విప్లవ) న్యాయ్ మహార్యాలీ'లో సునీత మాట్లాడారు. ఈ భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, జేఎంఎం చీఫ్ శిబూ సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, హేమంత్ సోరెన్ భార్య కల్పనసహా కూటమిలోని 28 పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యారు. ''కేజ్రీవాల్‌కు జైలులో కెమెరా పర్యవేక్షణలోనే ఆహారం అందిస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న కేజ్రీవాల్ రోజూ 50 యూనిట్లు(0.5 ఎంఎల్ డోస్) ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాల్సిందే. ఇన్సులిన్ ఇవ్వడం మానేశారు. వాళ్లు(బీజేపీ ప్రభుత్వం) నా భర్తను చంపాలనుకుంటున్నారు. అయినా సరే మేం నియంతృత్వంపై పోరాడి విజయం సాధిస్తాం' అని సునీత అన్నారు. ''విపక్షాల 'ఇండియా' కూటమి నుంచి వైదొలగాలని గిరిజన నేత హేమంత్ సోరెన్‌ను ఈడీ దాడులతో బీజేపీ భయపెట్టింది. జైలుకైనా వెళ్లారుగానీ బీజేపీకి ఆయన తలవంచలేదు'' అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే అన్నారు. మోదీ సర్కార్ అకారణంగా జైలులో నిర్బంధించిన కారణంగా ఈ సభకు కేజ్రీవాల్, హేమంత్ రాలేకపోయారని, వారి కోసమంటూ రెండు కుర్చీలను సభా వేదికపై ఖాళీగా ఉంచారు.

రాముడు అందరివాడు: అబ్దుల్లా

''రాముడు వాళ్ల మనిషి అన్నట్లు బీజేపీ భ్రమిస్తోంది. ఆయన హిందువులకు మాత్రమే చెందిన వారుకాదు మొత్తం మానవాళికి చెందిన వ్యక్తి. అందరివాడు'' అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. '' ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలోని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ పనిగా పెట్టుకుంది. ఆ ఆటలు సాగవు'' అని హేమంత్ సోరెన్ సందేశాన్ని ఆయన భార్య కల్పన సభావేదికపై చదివి వినిపించారు.



ఎన్నికల విచిత్రం

గుసగుసలాడుకుంటున్న వీరిద్దరూ జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ భార్య సునీత. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో 'ఇండియా' కూటమి చేపట్టిన మహా ర్యాలీలో పాల్గొన్నారు. కేజ్రీవాల్, సోరెన్ వివిధ ఆరోపణలపై వేర్వేరు జైళ్లలో ఉన్న విషయం తెలిసిందే.

ఎలక్షన్ బీట్

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

నామినేషన్ పత్రాల్లోని సంతకాలు అసలైనవి కావని గుర్తించిన అధికారులు

సూరత్: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన నీలేశ్ కుంభానీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నామినేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి ఆదివారం తిరస్కరించారు. ఆయనను ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాల్లో ముగ్గురు వ్యక్తులు చేసిన సంతకాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఇదే నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థిగా సురేశ్ పాడ్‌సాలా దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లోని సంతకాల్లో సైతం తేడాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేల్చారు. ఇద్దరు అభ్యర్థులు మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వారిని ప్రతిపాదిస్తూ చేసిన సంతకాలు అసలైనవి కావని గుర్తించామని, అందుకే ఇద్దరు నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి సౌరభ్ పార్థీ చెప్పారు. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు.

కోక్రాజార్ ఎంపీ నామినేషన్ తిరస్కరణ

అస్సాంలో కోక్రాజార్(ఎస్టీ రిజర్వుడ్) నియోజకవర్గ సిట్టింగ్ ఎంపీ నబా హీరాకుమార్ శరానియా నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. కోక్రాజార్ నుంచి రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన నబా హీరాకుమార్ మూడోసారి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఆయన ఎస్టీ కాదని ఇటీవల గౌహతి హైకోర్టు తేల్చిచెప్పింది. దాంతో ఆల్ అస్సాం ట్రైబల్ సంఘం ఇచ్చిన ఎస్టీ సర్టిఫికెట్‌తో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సర్టిఫికెట్ చెల్లదని పేర్కొంటూ అధికారులు ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు.

మమత పాలనలో అరాచకం: రాజ్‌నాథ్

జలంగి: టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ పాలనలో పశ్చిమబెంగాల్‌లో అరాచకం రాజ్యమేలుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. మహిళా సీఎం ఉన్నప్పటికీ రాష్ట్రంలో సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. సందేశ్‌ఖాలీ ఉదంతం గురించి విన్న ప్రతి ఒక్కరూ సిగ్గుతో తలదించుకుంటున్నారన్నారు. దోపిడీదారులు, గూండాల పాలనలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని విమర్శించారు. ఆదివారం ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ ప్రసంగించారు. బంకించంద్ర చటోపాధ్యాయ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు జన్మించిన గడ్డ, దేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదికగా ఉన్న బెంగాల్ నేడు నేర కార్యకలాపాలకు మరోపేరుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాళ్లొస్తే ప్రజాస్వామ్యం అంతం: ఖర్గే

సత్నా: కేంద్రంలో 'మోదీ–షా సర్కారు' మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం అనేదే ఉండదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని సైతం వారు బుట్టదాఖలు చేస్తారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని సత్నాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా ఖర్గే విమర్శలు గుప్పించారు. మహిళలు, కార్మికులు, రైతులకు ఓటు హక్కును కల్పించిన రాజ్యాంగం ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి, హస్తం గుర్తుకే ఓటేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల్లోని అవినీతి పరులైన నేతలను బీజేపీలో చేర్చుకుంటున్నారంటూ మోదీ, అమిత్ షాలపై ఆయన మండిపడ్డారు. అవినీతి నేతలను పరిశుద్ధులుగా మార్చేందుకు అమిత్ షా వద్ద వాషింగ్ మెషీన్ కలిగిన పెద్ద లాండ్రీయే ఉన్నట్లు కనిపిస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ గెలిస్తే ఘర్షణలే: అమిత్ షా

కటిహార్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని ప్రతిపక్షాలు గెలిస్తే దేశంలో ఘర్షణలు, అత్యాచారాలు, పేదరికం పెరిగిపోతాయని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఉగ్రవాదం పట్ల మెతక వైఖరిని, అణగారిన వర్గాల ఉన్నతిపై ఉదాసీనతను చూపుతాయని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని కటిహార్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. తమ పార్టీ దేశానికి మొట్టమొదటి ఓబీసీ ప్రధానమంత్రిని అందించిందని చెప్పారు. కుటుంబపాలనకు నరేంద్ర మోదీ ముగింపు పలికారని ఆయన తెలిపారు. మోదీ ఉగ్రవాదం, నక్సలిజం అంతు చూశారన్నారు.

హక్కుల్ని హరించాలనుకుంటోంది

బీజేపీపై ప్రియాంకా గాంధీ ఫైర్

రాయ్‌పూర్: బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చివేయడంతోపాటు ప్రజల హక్కుల్ని హరించాలనుకుంటోందని కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. ఆదివారం ఆమె రాజ్‌నంద్‌గావ్, కాంకేర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ప్రసంగించారు. 'ఈ ఎన్నికల్లో 400 లోక్‌సభ సీట్లను సాధిస్తే దేశ రాజ్యాంగాన్ని మార్చుతామని ఎన్నికల ర్యాలీల్లో బీజేపీ నేతలు, పలువురు మంత్రులు అంటున్నారు. ప్రధాని మోదీ, సీనియర్ నాయకులు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. అయితే, మోదీ అనుమతి లేకుండానే బీజేపీ నేతలు అంత పెద్ద హామీ ఇస్తారని మీరు భావిస్తున్నారా?'అని ప్రియాంక ప్రజలను ప్రశ్నించారు. దేశ రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా ప్రజల హక్కుల్ని హరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. అదే జరిగితే ప్రజలకు కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేకుండాపోతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

వారసత్వమే ప్రతిపక్షాల లక్ష్యం: నడ్డా

ముంబై: ప్రతిపక్ష పార్టీలు వారసత్వ రాజకీయాలను కొనసాగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా విమర్శించారు. శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ(ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ) ఇటువంటివేనని పేర్కొన్నారు. ఈ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల్లో భారీ హామీలను ప్రకటించి, అధికారంలోకి వచ్చాక అమలు విషయాన్ని మర్చిపోతాయని విమర్శించారు. మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో నడ్డా మాట్లాడారు. బీజేపీ గత పదేళ్లుగా కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని అందించిందని చెప్పారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి హామీలను ప్రధాని మోదీ సారథ్యంలో నెరవేర్చిందని, సీఏఏను అమలు చేస్తోందని నడ్డా తెలిపారు.

సాక్షి కరీంనగర్

సోమవారం ‌। 22 ‌। ఏప్రిల్ ‌। 2024

ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ బస్సుయాత్ర

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేసీఆర్ బస్సు యాత్ర తేదీలు ఖారయ్యాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర తలపెట్టారు. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర మొత్తం 17 రోజులపాటు జరగనుంది. యాత్ర ఐదురోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో సాగనుంది. మే 2న జమ్మికుంట, 3న రామగుండం, 5న జగిత్యాల, 9న కరీంనగర్, 10న సిరిసిల్లలో యాత్ర ఉండనుంది. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువైన కరీంనగర్‌లో పార్టీకి పునర్వైభవం తెచ్చేందుకు కేసీఆర్ ఈ యాత్ర చేపట్టారు.



వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీపీ కార్యాలయంలో ఫిర్యాదులు నిలిపివేత



సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్ క్రైం: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సీపీ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ వెలువడి మే 13వ తేదీన పోలింగ్ ఉన్నందున పోలీసులు భద్రతా విధుల్లో ఉంటారని, ఈ నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ ఫిర్యాదుల కేంద్రంలో ఎటువంటి ఫిర్యాదులు స్వీకరించబడవని సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఫిర్యాదుల స్వీకరణ యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు గమనించాలని సూచించారు.

కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో రగడ

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. నగరంలోని కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్‌రావు నివాసంలో ఆదివారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సోమవారం రాజేందర్‌రావు నామినేషన్ వేయనున్న దృష్ట్యా జనసమీకరణపై ఈ సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. అయితే వందమంది వరకు ముఖ్యనాయకులు వస్తారని అంచనా వేసుకోగా, రెండు వందలకు పైగా పార్టీ శ్రేణులు హాజరయ్యారు. పైగా పార్టీలో ఇటీవల నెలకొన్న కొత్త పాత పంచాయితీ మరోసారి బయటపడింది. మైనార్టీ నాయకులు తాజ్, ఆసిఫ్‌ల నడుమ గొడవ మొదలై కాలర్ పట్టుకునే వరకు వెళ్లింది. దీంతో అక్కడే ఉన్న నాయకులు సర్ది చెప్పారు. ఇదిలా ఉంటే డివిజన్ల వారిగా తమను ఇన్‌చార్జీలుగా పరిగణించాలన్న డిమాండ్లు అధికం కావడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసినట్లు సమాచారం.

త్వరలోనే భాషా పండితులకు పదోన్నతులు



మాట్లాడుతున్న ఎండీ.అబ్దుల్లా

కరీంనగర్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ అబ్దుల్లా అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాషా పండితుల పదోన్నతులకు సంబంధించి హైకోర్టులో అనుకూలంగా తీర్పురావడం హర్షనీయం అన్నారు. పండిత పరిషత్తు సుదీర్ఘ పోరాటానికి ఈ తీర్పు నిదర్శనమని అన్నారు. పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్‌ను ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం భాషా పండితులకు మినహాయించాలని ఎన్‌సీఈటీఆర్ రాష్ట్ర విద్యాశాఖ పక్షాన వివరణ కోసం రాయించడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.చైతన్య, ఎండీ.ఉమర్ అలీ, కట్టెకోల స్వామి, కరుణాకర్, శ్రీనివాస్, దీపక్‌మిథానీ, శ్యామ్, జహంగీర్, రేణుక, శారద, సునీత పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సర్వేల జోరు

- ఫోన్, సోషల్ మీడియాలో హోరెత్తుతున్న సర్వే
- గెలుపోటములపై సాగుతున్న అభిప్రాయసేకరణ
- ప్రభుత్వానికి నివేదిక పంపిన నిఘా వర్గాలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ పోరు మెల్లిగా వేడెక్కుతోంది. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ఇదే సమయంలో ఏ పార్టీ గెలుస్తుంది..? అన్న విషయంపై సర్వేలు కూడా ఊపందుకున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక రాజకీయాలు స్వల్పంగా మార్పు చెందుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఓటర్లను తమవైపునకు తిప్పుకునే యత్నం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ.. ప్రచారాన్ని హోరెత్తిస్తూ.. సభలు, సమావేశాలతో తలమునకలవుతున్నారు.

మార్పు కనిపెట్టేందుకు..

ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయంలో స్వల్ప మార్పు వచ్చింది. ఈ మార్పు ఎవరికి అనుకూలం..? ఎవరికి వ్యతిరేకం అన్న విషయంపై స్పష్టత కోసం అన్ని పార్టీల నుంచి అప్పుడే రహస్య సర్వే టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఎవరి స్టైల్లో వారు ఓటర్ల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఇందుకోసం సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారు. పార్టీల మేనిఫెస్టోలు, విధానాలపై పలు రకాల పోస్టింగులు రూపొందించి వాటిపై జనాలు స్పందిస్తున్న తీరు ఆధారంగా సమాచారం సేకరిస్తున్నారు. అలాగే వయసుల వారీగా పలు రకాల ప్రశ్నలను సంధిస్తూ ఓటర్ల మనోగతాన్ని తెలుసుకునే యత్నం చేస్తున్నారు. ఏ విషయంలో ప్రజల అభిప్రాయం మారుతుందో నిశితంగా తెలుసుకునే యత్నం చేస్తున్నారు. పబ్లిక్ పల్స్ పట్టుకుని తదనుగుణంగా పాలసీలు, హామీలు, ప్రత్యర్థులపై ఆరోపణాస్త్రాలు సంధించేందుకు వ్యూహాలు రూపొందించుకుంటున్నారు.

పూర్తయిన ఇంటలిజెన్స్ సర్వే

సాధారణంగా నిఘా వర్గాలు ఎన్నికల ముందు, నోటిఫికేషన్ వచ్చిన తరువాత రాజకీయ పరిస్థితి, ఓటర్ల అభిప్రాయాలపై కచ్చితమైన సమాచారం పంపిస్తాయి. అలాగే ఉమ్మడి జిల్లాలోనూ ఈ సర్వే ఇటీవల పూర్తయింది. పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ సెగ్మెంట్లలోని 13 నియోజకవర్గాల్లో రెండోసారి సర్వే కూడా పూర్తి చేశారు. వాస్తవానికి నామినేషన్లకు ముందు ఒకసారి రిపోర్టు పంపిన అధికారులు.. నామినేషన్ల తరువాత కూడా ప్రభుత్వానికి ఓ రిపోర్టు పంపారు. ప్రభుత్వ పాలసీలు అమలవుతున్న తీరు.. వాటిపై ప్రజల అభిప్రాయం.. లోపాలు తదితరాలపై సమగ్ర సమాచారం సేకరించారు. ముఖ్యంగా మహిళల అభిప్రాయాలకు సర్వే రిపోర్టులో పెద్దపీట వేసినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్‌తోనే వస్త్రపరిశ్రమ సంక్షోభం



సిరిసిల్ల శాంతినగర్ సభలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

- నూలు కొనుగోలులో అక్రమాలు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్
- సిరిసిల్లలో భారీ బైక్ ర్యాలీ

సిరిసిల్ల/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభానికి బీఆర్‌ఎస్ కారణమని, మాస్టర్ వీవర్స్‌కు బతుకమ్మ ఆర్డర్లను ఇచ్చి ఆసాములను కూలీలుగా మార్చారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. సిరిసిల్లలో ఆదివారం బీజేపీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం శాంతినగర్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. ప్రభుత్వం నేతన్నలకు రూ.270 కోట్ల బకాయిలుంటే రూ.50కోట్లు చెల్లించడం ఏంటని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల ఉత్పత్తికి అవసరమైన యార్న్ కొనుగోలులో భారీ అవినీతి జరిగిందన్నారు. మూడు కంపెనీలకు ఆర్డర్లు ఇచ్చి.. ఆ కంపెనీల వద్ద అప్పటి మంత్రి కేటీఆర్ కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని.. ప్రజలు వాస్తవాలు గమనించి ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు.

నేతన్నలకు బీజేపీ అండగా ఉంటుంది

నేతన్నల సమస్యలపై ముఖ్యమంత్రికి లేఖ రాశానని, అనేక రూపాల్లో సర్కార్ తీరును ఎండగట్టినా స్పందించకపోవడంతో నేతన్నకు మద్దతుగా దీక్ష చేసేందుకు సిద్ధమైతేనే దిగి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో ఇచ్చిన రూ.50కోట్లను కూడా ఆపేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని, అదే జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం రూ.370కోట్లతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు దుమాల శ్రీకాంత్‌తోపాటు పలువురు యువకులు, మహిళలు బీజేపీలో చేరారు.

గీతకార్మికులను ఆదుకునే సోయి లేదా ?

గీతకార్మికులను ఆదుకునే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా? అని సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌లో ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయిన తాటి, ఈత చెట్లను ఆదివారం పరిశీలించారు. ఈతమొక్కల పెంపకానికి బిందుసేద్యంపై 90శాతం సబ్సిడీ, ప్రతీ గ్రామంలో ఐదెకరాల భూమిని కొని ఈతవనాలు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. గౌడన్నలు చనిపోతే పరిహారం కాదు.. బతికి ఉన్నప్పుడు ఉపాధి కల్పించాలని కోరారు. ఇటీవల విద్యుత్‌షాక్‌తో మరణించిన తాడూర్‌కు చెందిన మల్లబోయిని మధుప్రియ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓట్లు వేసి మళ్లీ నరేంద్రమోదీని గెలిపించాలని ఎంపీ అభ్యర్థి సంజయ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో పలువురు యువకులు సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. అంతకు ముందు జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కోనేటి సాయిలు కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కాషాయమయం.. కొండగట్టు క్షేత్రం



కొండపై హనుమాన్ దీక్షాపరులు



మాల విరమణ చేస్తున్న హనుమాన్ భక్తులు

- నేటి నుంచి అంజన్న చిన్న జయంతి ఉత్సవాలు
- తరలిరానున్న రెండు లక్షల మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న సన్నిధి కాషాయమయంగా మారింది. ఈనెల 22 నుంచి 24వరకు హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది హనుమాన్ దీక్షస్వాములు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఈవో చంద్రశేఖర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. తాగునీటితోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచారు. 650 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. దిగువ కొండగట్టు నుంచి కొండపైకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే మెట్లదారి కూడా సిద్ధమైంది. జేఎన్టీయూ వైపు నుంచి వచ్చే వాహనాలకు బొజ్జ పోతన్న సమీపంలో పార్కింగ్ గుర్తించారు. దీక్షస్వాములు మంగళవారం అర్ధరాత్రి వరకు స్వామివారిని దర్శించుకుని అనంతరం మాల విరమణ చేయనున్నారు. సమస్యలుంటే 94910 00653 నంబర్‌లో సంప్రదించాలని ఆలయ ఏవో చంద్రశేఖర్ తెలిపారు.

వయసు శరీరానికే.. మనసుకు కాదు

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జెజ్జూరం చంద్రకుమార్



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

విద్యానగర్(కరీంనగర్): వయసు శరీరానికే కాని మనసుకు కాదని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ విశ్రాంత ఉద్యోగుల సహస్ర చంద్ర దర్శకులకు (80ఏళ్లు దాటిన)వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా హాజరైన చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఎంతమితంగా మాట్లాడితే అంత మేలు జరుగుతుందన్నారు. తక్కువగా మాట్లాడినప్పుడు సత్యమే పలకగలమన్నారు. వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ మన జీవితాలు ఇతరులను చీకటి నుంచి వెలుగులోకి మళ్లించే మార్గదర్శకాలు కావాలన్నారు. వోపా జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ ఆచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, మొగ్దుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలనీ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, యాస్వాడ అంజయ్య, బండ్ల శివప్రసాద్, వంగల అనోధరాచారి, ఎర్రోజు భీష్మాచారి, తిప్పర్తి అంజయ్య పాల్గొన్నారు.

గజవాహనంపై రామయ్య

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు గజవాహనంపై విహరించారు. స్వామివారిని పూలతో విశేషంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, అర్చకులు శేషం వంశీధరచార్యులు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ మాడవీధుల గుండా స్వామివారు విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో కందుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



గజవాహనంపై విహరిస్తున్న రామయ్య

వినోద్ గెలిస్తే సంక్షేమం.. 'బండి' వస్తే సంక్షోభం



కొత్తపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

- కరీంనగర్ ఎమ్మెల్యే కమలాకర్
- చివరి శ్వాస వరకూ ప్రజాసేవకే అంకితం
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు కోసం పార్లమెంటులో కొట్లాడుతారని.. బండి సంజయ్‌కి ఓట్లేస్తే ప్రజలకు సంక్షోభం తప్పదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఉండదని అన్నారు. ఐదేళ్లలో ఎంపీగా సంజయ్ పార్టీ కోసమే పని చేశారని, ఏనాడు ప్రజల బాగోగులు పట్టించుకోలేదని చెప్పారు. ప్రజల మనోభావాలతో రాజకీయం చేస్తున్నారని, గత పార్లమెంట్ ఎన్నికల్లో సంజయ్‌కి ఓట్లు వేసి ప్రజలు ఇప్పుడు తిప్పలు పడుతున్నారని తెలిపారు. సంజయ్ ఏనాడూ పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై మాట్లాడలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ చివరి శ్వాస వరకు ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలొస్తేనే సంజయ్‌కు ప్రజలు గుర్తుకువస్తారని, తానైతే ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతునవుతానని తెలిపారు. రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ మోసం చేస్తోందన్నారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు కౌన్సిలర్లు మొండయ్య, వేణుగోపాల్, రాంబాబు, సత్యనారాయణ రెడ్డి, విజయ రమేష్, కో ఆప్షన్ సభ్యులు ఫక్రొద్దీన్, ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు జమీలొద్దీన్, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్, ఎస్కే.బాబా, సుధాకర్, వెంకట్‌రెడ్డి, కొమురయ్య, రుద్ర రాధ, మహేశ్వరి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- 'మనఊరు– మనబడి'తో మౌలిక వసతుల కల్పన
- జిల్లావ్యాప్తంగా 375 పాఠశాలల ఎంపిక.. రూ.3.75 కోట్లు విడుదల
- 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీలకు బాధ్యతలు



చింతకుంట మండల పరిషత్ పాఠశాల

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' అమలుకు జిల్లాలో అడుగులు వేగంగా పడుతున్నాయి. జూన్ 10లోగా పాఠశాలల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో విద్యాశాఖ, ఇంజినీరింగ్‌శాఖ అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో మొత్తం 651 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 36,322 మంది చదువుతున్నారు. మొదటి విడతగా 120 ప్రాథమిక, 16 ప్రాథమికోన్నత, 94 ఉన్నత మొత్తం 230 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇటీవలే విద్యార్థులు లేని 46 పాఠశాలలను మినహాయించి మొత్తంగా 375 స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వారు ఆయా పాఠశాలలను సందర్శించి, పాఠశాల విద్యా కమిటీ, ప్రధానోపాధ్యాయులతో చర్చించి ఒక్కోబడికి రూ.30లక్షల నుంచి రూ.2కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. 375 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ కమిటీలు ఇటీవలే రద్దు కావడంతో వాటి స్థానంలో 'అమ్మ' ఆదర్శ పాఠశాల కమిటీలను తీసుకవచ్చింది. వీటి బాధ్యతలను పాఠశాల పరిధిలోని మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి అప్పగించింది. 375 పాఠశాలల్లో కమిటీల ఎంపిక ప్రక్రియ సైతం పూర్తయింది. ఈ పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు లక్ష చొప్పున జిల్లా మొత్తంగా రూ.3.75 కోట్లు అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది.

చేపట్టనున్న పనులివే..

ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' కార్యక్రమం కింద 12 రకాల మౌలిక వసతులు కల్పించనున్నారు. పాఠశాలలో నీటి సౌకర్యంతో కూడిన టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, ఫర్నిచర్, పాఠశాలకు మొత్తం పెయింటింగ్, పెద్ద, చిన్న మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, ప్రహరీలు, కిచెన్ షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త తరగతి గదులు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు, డిజిటల్ విద్య అమలు వంటి సదుపాయాలను సమకూర్చనున్నారు. జూన్ 10 నాటికి ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఆహ్లాదం.. అధ్వానం

- నగరంలోని పార్కుల్లో సందడి
- పచ్చదనానికి దూరంగా కొన్ని పార్కులు
- నిర్వహణ పెంచితే మరింత ఆదరణ

నగరంలో ఉన్న పార్కులు :	22
పార్కుల అభివృద్ధి	
అమృత్ పథకం కింద :	09
సీఎం హామీ పథకం కింద:	05
పట్టణ ప్రగతి, జనరల్‌ఫండ్:	08



నగరంలోని పూలే పార్క్



జ్యోతినగర్‌లోని కేడీఆర్ పార్క్‌లో సందడి

కరీంనగర్ కార్పొరేషన్: వేసవిలో సాయంత్రం నగరంలోని పార్కుల్లో సందడి నెలకొంది. సెలవుల నేపథ్యంలో పార్కులు పిల్లలు, పెద్దలతో కళకళలాడుతున్నాయి. కొన్ని పార్కులు ఆకర్షణీయంగా ఉండగా, మరికొన్ని పార్కుల్లో పచ్చదనం కరువైంది. నిర్వహణ లోపంతో ఇంకొన్ని వినియోగంలోకి రాలేకపోతున్నాయి. నగరపాలకసంస్థ పరిధిలో దాదాపు 22 పార్కులు ఉన్నాయి. నగర శివారులోని ఉజ్వల పార్క్, జింకల పార్కులు ఉమ్మడి జిల్లావాసులకు కూడా సుపరిచితమే. వీటితో పాటు నగరంలోని జ్యోతిబాపూలే పార్క్(సర్కస్ గ్రౌండ్), జ్యోతినగర్‌లోని కేడీఆర్‌పార్క్, బ్యాంక్‌కాలనీలోని పార్కులకు ఆదరణ ఉంది. మల్టీపర్పస్ పార్క్ పనులు కొనసాగుతున్నాయి. సీఎం హామీ నిధులతో ప్రహరీ నిర్మించగా, మిగతా పనులు స్మార్ట్‌సిటీ కింద జరుగుతున్నాయి. వావిలాలపల్లిలోని రామాలయం పక్కనున్న పార్క్‌లో పచ్చదనం కొరవడింది. ఈ పార్క్‌లో బోర్‌వెల్ చెడిపోవడంతో గ్రీనరీ లేకుండా పోయింది. బ్యాంక్‌కాలనీలోని పార్క్‌లో సాయంత్రమైందంటే సందడి నెలకొంటోంది. పచ్చదనం పెంచాల్సి ఉంది. కేడీఆర్ పార్క్ ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మికతను పంచుతోంది. ఈ పార్క్‌లో శివాలయం ఉండడంతో భక్తులూ వస్తుంటారు. కాశ్మీర్‌గడ్డలోని పార్క్ మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పార్క్‌లో ఓ భాగం మీ సేవ కేంద్రానికి కేటాయించగా, మిగిలిన మరో భాగం వృథాగా ఉంది. చాలా కాలనీల్లో కొత్తగా పార్కులను అభివృద్ధిచేస్తున్నారు. ఇదిలాఉంటే పార్కుల నిర్వహణను పగడ్బందీగా చేపడితే, నగరవాసులకు ఈ వేసవిలో మరింత ఆహ్లాదాన్ని పంచనున్నాయి.



ఏళ్లకాలంగా కనీస అభివృద్ధి లేక బోసిపోయి ఉన్న కశ్మీర్‌గడ్డలోని పార్క్



నగరంలోని వావిలాలపల్లిలో పచ్చదనం లేక బోసిపోయిన రాజీవ్‌పార్క్



పచ్చదనంతో కళకళలాడుతున్న బ్యాంక్‌కాలనీలోని పార్క్.. జనాల సందడి

క్లుప్తంగా

కవిత్వంతో చైతన్యవంతులను చేయాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: ఆకలి కేకలలో, శ్రామికస్వేదంలో కవిత్వం వినిపించాలి, కనిపించాలి అని ప్రముఖ కవి డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ అన్నారు. భవాని సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో కవనభేరి కవితా సంకలనం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజాన్ని చైతన్యం చేసే కవిత్వాలను విరివిగా రాయాలని కోరారు. విశిష్ట అతిథి ఎస్సారార్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ, కవి సమాజానికి మార్గదర్శిలాంటి వాడని, కవిత్వం సమాజంలో మార్పును తెచ్చే ఆయుధమన్నారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగాచార్య సంపత్‌కుమార్, కవులు నూజెట్టి రవీంద్రనాథ్, బొమ్మకంటి కిషన్, గంప ఉమాపతి, టి.నవనీతరావు, కుమారస్వామి తడిగొప్పుల, బలిజపల్లి కిషన్, ప్రేమ్‌సాగర్‌రావు, రజిత, జ్యోతిలక్ష్మి, ఎలిపె మధు, రాము ఇటిక్యాల, కాసు మహేందర్‌రాజు, డాక్టర్ ఎడవల్లి తిరుమలరెడ్డి, తిరుకోవెల వెంకటరమణ, జైపాల్‌రెడ్డి, బాల్సాని కొమురయ్య, ఇ.అంబేద్కర్, జి.కుమార్, ఎల్గొండ రవి, శ్యామ్, సతీశ్‌కుమార్, మఠం సాంబమూర్తి, గుండు కోటేశ్వరరావు, ఎస్.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న ఎనిమిదిన్నర లీటర్ల మద్యాన్ని పట్టణ ఎస్సై మన్మధరావు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్మపురి మండలం నేరెల్ల గ్రామానికి చెందిన అయ్యోరి చిలకయ్య తన కిరాణం దుకాణంలో మద్యం విక్రయించేందుకు జగిత్యాలలో మద్యం కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. పట్టణ పోలీసులు మద్యం స్వాధీనం చేసుకొని చిలకయ్యపై కేసు నమోదు చేశారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న దాబాపై ఆదివారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాబా నిర్వాహకుడి వద్ద రూ.22,899 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపా రు.

బావిలో పడిన జాతీయ పక్షి.. కాపాడిన యువకులు


నెమలిని రక్షించిన యువకులు

మల్యాల: మల్యాల మండలం మానాల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడిన జా తీయ పక్షి నెమలిని గ్రామ యువకులు కాపాడారు. గ్రామానికి చెందిన దోనకొండ విలాస్‌కు చెందిన వ్యవసాయ బావిలో నెమలి పడింది. ఆదివారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లిన విలాస్ బావిలో నెమలిని గమనించాడు. తన స్నేహితులు బెత్తం నరేశ్, కుడిదెల వినోద్‌తో కలిసి తాడు సాయంతో బావిలోకి దిగి నెమలిని బయటకు తీశారు. నెమలి రెక్క విరిగినట్లు గుర్తించిన యువకులు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చి వారికి అప్పగించారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.

ప్రలోభాలపై నజర్

- అభ్యర్థుల బ్యాంకు లావాదేవీలపై కన్ను
- రూ.10 లక్షలు దాటితే లెక్క తప్పనిసరి
- రోజువారీ ఖర్చులపైనా ఆరా



కరీంనగర్: 'ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం కోసం ఖర్చు చేయడం, ఓటర్లకు నగదు పంపిణీ పేరిట ప్రలోభాలకు గురి చేయడం లాంటి అంశాలపై ఆదాయపన్ను శాఖ నిఘా సారిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు ఆ శాఖ సిద్ధమవుతోంది. ముఖ్యంగా నగదు పంపిణీపై ఆ శాఖ ప్రజల సహకారాన్ని కోరుతోంది. దీని కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేవారి సమాచారం ఇస్తే, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసానిస్తోంది. ఎన్నికలు ముగిసే వరకు బ్యాంకు లావాదేవీలపై ఐటీ శాఖ నజర్ పెడుతోంది. ముఖ్యంగా రూ.10 లక్షలకు మించి లావాదేవీలు దాటితే పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది. రోజూ బ్యాంకు లావాదేవీలను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా అబ్జర్వర్స్‌ను నియమించింది'.

బ్యాంకు లావాదేవీలపై ఆరా

వాణిజ్య బ్యాంకులతో పాటు సహకార, ప్రైవేట్ బ్యాంకుల లావాదేవీలపై ఐటీ శాఖ ఆరా తీయనుంది. రూ.10 లక్షల ట్రాన్స్‌జక్షన్ నిర్వహించే ఖాతాదారులపై నిఘా సారించనున్నారు. ఇలా అన్ని బ్యాంకులు రోజూ రూ.10 లక్షల ట్రాన్స్‌జక్షన్ దాటిన ఖాతాల వివరాలను పరిశీలించి.. ఆ డబ్బులు ఎవరి ఖాతాలో జమ చేస్తున్నారు అనే అంశాలను ఆదాయపు పన్ను శాఖకు వివరించాల్సి ఉంటుంది. దీని కోసం ఆ శాఖ ప్రత్యేకంగా ఓ పరిశీలకున్ని నియమించింది. సదరు పరిశీలకుడు రోజూ బ్యాంకు లావాదేవీలన్నింటినీ తనిఖీ చేసి అనుమానమున్న ఖాతాలను స్తంభింపజేయడమే కాకుండా వాటి గుట్టును రట్టు చేయబోతున్నారు. అక్రమ పద్ధతుల్లో నగదు పంపిణీ సాగకుండా అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి.

రంగంలోకి నిఘా బృందాలు..

ఓటర్లను రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రలోభాలకు గురి చేయకుండా ఆదాయపు పన్ను శాఖ కఠిన చర్యలు చేపట్టనుంది. పార్టీల సీనియర్ నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులకు డబ్బులు పంచే వ్యవహారాలపై నిఘా పెట్టనుంది. ముఖ్యంగా ఆ శాఖలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రస్తుతం అభ్యర్థుల చుట్టూనే కాకుండా రాజకీయ పార్టీల కేడర్ కార్యకలాపాలపై దృష్టిసారిస్తూ చర్యలకు సిద్ధమవుతోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నగదు పంపిణీపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలతో పాటు అప్పటి సంఘటలన్నింటినీ ఆదాయ పన్ను శాఖ క్రోడీకరిస్తూ తనిఖీలకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుంది. దీని ఆధారంగా ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కడెక్కడ తనిఖీలు చేపట్టాలన్న అంశంపై ఆ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే నిఘా బృందాలను రంగంలోకి దించి పార్టీల రోజు వారీ కార్యకలాపాల పనితీరును పరిశీలిస్తోంది. మరో పది రోజుల పాటు ఆశాఖ సాధారణ కార్యకలాపాలను పక్కన పెట్టి కేవలం ఎన్నికల్లో నగదు ప్రలోభాలనే లక్ష్యంగా చేసుకుంటోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నగదు పంపిణీ విస్తృతమయ్యే అవకాశాలు ఉండడంతో ఐటీ అధికారులు ఇక రాజకీయ పార్టీలను నీడలా వెంటాడబోతున్నారు.

మూడు ముక్కలు.. ఆరు ఆటలు..!

- మెట్‌పల్లి మండలంలో జోరుగా పేకాట
- గుట్ట ప్రాంతాలు, మామిడి తోటలే అడ్డాలు
- రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- పట్టుబడకుండా సెంట్రీల ఏర్పాటు


ఏఎస్ఆర్‌తండాలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మూడు ముక్కలు.. ఆరు ఆటలు అన్న చందంగా పేకాట మెట్‌పల్లి మండలంలో జోరుగా నడుస్తోంది. ఇందుకు గుట్ట ప్రాంతాలు, మామిడి తోటలే కేంద్రాలవుతున్నాయి. ఇష్టారీతిన పేకాట ఆడుతూ బానిసైన కొందరు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. నిర్వాహకులు పేకాటకు సెంట్రీలను పెట్టి మరి పకడ్బందీగా నిర్వహించడంతో.. పోలీసులకు సైతం పట్టుకోవడం కష్టతరంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

శివారు ప్రాంతాలే అడ్డాలు

మెట్‌పల్లి మండలంలోని శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని కొందరు వ్యక్తులు పేకాట ఆడిస్తున్నారు. గుట్ట ప్రాంతాలు, మామిడి తోటలు, పొలాల మధ్య షెడ్లలో ప్రత్యేకంగా స్థావరాలను ఏర్పాటు చేసి నిర్వాహకులు పేకాటను ఆడిస్తున్నారు. కూర్చున్న చోటుకే మందు, విందు సమకూర్చుతూ రహస్యంగా పేకాటను ఆడించేస్తున్నారు. ఈ అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేకాట నడుస్తుండడంతో.. చుట్టుపక్కల వారే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి, నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు కూడా వచ్చి పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. రోజుకు రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

సెంట్రీలతో సెక్యూరిటీ

రహస్యంగా పేకాట ఆడిస్తున్న ప్రాంతానికి కొద్ది దూరంలో నిర్వాహకులు కాపలాగా కొంతమంది వ్యక్తులను సెంట్రీలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరికి రోజుకు రూ.500 నుంచి రూ.1,000 ముట్టజెప్తారని సమాచారం. స్థావరం ఏర్పాటు చేసిన ప్రాంతంలో పోలీసులు, ఇతరులెవరైనా వస్తే వారి కదలికపై దృష్టి పెట్టి వెంటనే నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం చేరవేసేలా జాగ్రత్త పడుతున్నారు.

అప్పులపాలు..

మొదట సరదాగా మొదలైన ఈ ఆట తర్వాత బానిసగా మారడంతో.. ఎంతోమంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అప్పులపాలై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో కుటుంబాలు ఇప్పటికీ అవస్థలు పడుతున్నాయి. ఇటీవల మెట్‌పల్లి మండలంలోని ఏఎస్ఆర్‌తండా శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. రూ.8వేల నగదు పట్టుబడగా, 14 మందిపై కేసు నమోదు చేశారు.

మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించాలి

- స్టేట్ ఆడిట్ రాష్ట్ర సంచాలకులు వెంకటేశ్వర్‌రావు


సాయికిరణ్‌ను సన్మానించిన వెంకటేశ్వర్‌రావు

కరీంనగర్‌అర్బన్: మరుగున పడిపోతున్న మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వచ్చేలా ప్రోత్సాహం అవసరమని స్టేట్ ఆడిట్ రాష్ట్ర సంచాలకులు మార్తినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం కరీంనగర్ టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సివిల్స్ విజేత సాయికిరణ్‌ను ఘనంగా సన్మానించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించడం యువతకు ఆదర్శమని పొగడ్తలతో ముంచెత్తారు. అనంతరం వెంకటేశ్వర్‌రావును టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి పూలబొకె, శాలువాతో ఘనంగా సన్మానించారు. స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, శరత్‌చంద్ర, నూతనకంటి వెంకట్, టీఎన్జీవోల నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్వరరావు, సీహెచ్ జోయల్, అల్లె శ్రీనివాస్, లక్ష్మీకాంతయ్య, పవన్‌కుమార్, రవిబాబు, వంశీ, శంకర్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలించినా.. విక్రయించినా పీడీ యాక్ట్

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్
- 5 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: గంజాయి తరలించినా.. విక్రయించినా పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ ప్రాంతంలో యువతరాన్ని టార్గెట్ చేసుకొని అక్రమంగా గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ల ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి 5 కిలోల గంజాయిని తెప్పించి జగదల్పూర్‌లో కలుసుకున్నారన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్మి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో జగదల్పూర్ నుంచి ట్రావెల్స్ బస్సు ద్వారా కరీంనగర్‌కు వచ్చారని పేర్కొన్నారు. అక్కడ్నుంచి బస్సులో వేములవాడకు చేరుకొని చింతల్‌ఠానా గ్రామ శివారుకు వస్తున్నారనే సమాచారం మేరకు ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు చింతల్‌ఠానా శివారులోని ఆర్టీసీ బస్‌డిపో దగ్గర ముగ్గురిని వేములవాడ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు చెప్పారు. వికాస్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ వ్యక్తుల ద్వారా గంజాయిని జగదల్పూర్‌కు తెప్పించి అక్కడ్నుంచి ముగ్గురు కలిసి వేములవాడ వచ్చి ఇక్కడ వివిధ ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు చెప్పారన్నారు. వారి వద్ద నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సమీ, గోపాల్, శ్రీనివాస్, ఎస్సై అంజయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని, ఈ సంవత్సరం జిల్లాలో అక్రమ గంజాయికి సంబంధించిన 14 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్ట్ చేశామన్నారు. మెసేజ్ యువర్ ఎస్పీ నెంబర్ 630-392-2572కు లేదా డయల్-100కి సమాచారమందించి గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య తదితరులున్నారు.

చికిత్స పొందుతూ ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మృతి


రవీందర్(ఫైల్)

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు మడిపల్లి రవీందర్(53) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 16న అన్నపూర్ణకాలనీలోని నివాసం నుంచి సైకిల్‌పై విధులకు వెళ్తున్న రవీందర్ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి క్రాస్ చేస్తున్న సమయంలో.. గోదావరిఖని వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన రవీందర్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సూచన మేరకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య అరుణ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరీంనగర్‌లో బాలుడు..

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన ఐదు సంవత్సరాల కీర్తి చైత్రిక్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండడంతో.. కుటుంబ సభ్యులు ఈనెల 19న నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతడికి ఈనెల 20న ఆపరేషన్ చేశారు. అదే రోజు రాత్రి బాలుడు మృతిచెందాడు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఆపరేషన్ వికటించడంతోనే తమ బాబు మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెగడపల్లిలో యువకుడు..


చంద్రశేఖర్(ఫైల్)

పెగడపల్లి: మండలంలోని నందగిరి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంకటి చంద్రశేఖర్(31) అనే యువకుడు ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం ఇబ్రాజీపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, బీమ్‌రాజ్‌పల్లికి చెందిన రెవెల్లి స్వామి అనే ఇద్దరు వ్యక్తులు శనివారం మధ్యాహ్నం గంగాధర మండల కేంద్రంలోని సంతకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. పెగడపల్లి మండలం నందగిరి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏసీ వాహనం వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న చంద్రశేఖర్, స్వామి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతిచెందగా.. స్వామికి కాలు విరిగినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..


రాయమల్లమ్మ(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లాసుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన పోగుల రాయమల్లమ్మ(57) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్సై శ్రావణ్‌కుమార్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రాయమల్లమ్మ అదే గ్రామానికి చెందిన సంపత్ వద్ద రూ.1.30లక్షలను 5 సంవత్సరాల క్రితం అప్పు తీసుకోగా.. రూ.లక్ష చెల్లించింది. మిగతా రూ.30వేలు చెల్లించాలని శనివారం ఇంటి వద్ద గొడవకు దిగడంతో.. మనస్తాపం చెందిన రాయమల్లమ్మ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కొడుకు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తూకంలో చేతివాటం.. గుర్తించిన రైతులు


40 కిలోలకు గాను 44.350 కిలోలు తూకం వేసిన దృశ్యం

పెగడపల్లి(ధర్మపురి): వ్యయప్రయాసలకోర్చి పంట పండిస్తే తీరా ధాన్యం అమ్ముకునే సమయంలో కొనుగోలుదారులు చేతివాటం ప్రదర్శిస్తూ రైతులను మోసం చేసి అడ్డంగా దొరికారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలో యాసంగి సీజన్ వరిధాన్యం కొనుగోలు చేసేందుకు పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రం నిర్వహణకు గ్రామానికి చెందిన అజ్మీరా ఇందిరానాయక్ అనే ప్రైవేటు వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ నాలుగైదు రోజులుగా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతులు గుంటి అంజయ్య, గుంటి గంగాధర్, పెంటల మల్లేశంకు చెందిన ధాన్యాన్ని శనివారం సాయంత్రం తూకం వేశారు. తర్వాత రైతులకు అనుమానం వచ్చి సహకార సంఘం సీఈవో గోపాల్‌రెడ్డి సమక్షంలో తిరిగి కొన్ని బస్తాలను తూకం వేయించగా, సంచిలో 40 కిలోలు ఉండాల్సిన ధాన్యం 42 నుంచి 44 కిలోల వరకు అంటే ఒక్కో సంచిలో 2 నుంచి 4 కిలోల వరకు అధికంగా ధాన్యం తూకం వేసినట్లు గుర్తించారు. తూకం వేసేందుకు వాడిన తూనికల రాళ్లను పరిశీలించగా, 20 కిలోలు ఉండాల్సిన ఒక్కో తూనిక రాయి 20.700 కిలోల బరువు ఉన్నట్లు గుర్తించారు. జరిగిన మోసంపై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఇందిరానాయక్‌ను నిలదీశారు. అతడిపై తగిన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఆదివారం ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని బలిగొన్న కారు

- అమెరికాలో రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ విద్యార్థి దుర్మరణం


డాక్టర్ కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుద్దామని అమెరికాకు వెళ్లిన విద్యార్థిని ఓ కారు పొట్టనపెట్టుకోగా.. హుజూరాబాద్‌లో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ముక్క కృష్ణమూర్తి మనువడు ముక్క నివేష్(20) ఆదివారం మృతిచెందారు. మృతుడి తండ్రి ముక్క నవీన్, తల్లి స్వాతి సైతం వైద్య వృత్తిలోనే కొనసాగుతుండగా.. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు ముక్క నివేష్ గత సంవత్సరం జనవరిలో ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ చేయడానికి అమెరికా ఆరిజోనా రాష్ట్రంలోని ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీలో జాయిన య్యాడు. ప్రస్తుతం నివేశ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా కళాశాలకు సెలవు కావడంతో నలుగురు స్నేహితులు కలసి వాటర్ ఫాల్స్ చూసేందుకు వెళ్లి తిరిగి కారులో వస్తున్న క్రమంలో.. ఓ కారు అతివేగంగా వచ్చి కారును వెనక నుంచి ఢీకొట్టింది. ముక్క నివేష్‌తోపాటు తన సహచర విద్యార్థి హన్మకొండకు చెందిన గౌతమ్ సైతం మృతిచెందాడు. ఈ ఘటనపై ఆరిజోనా పోలీసులు సమాచారమందించడంతోపాటు అక్కడి పోలీసులు 00026879/2024 ద్వారా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుదీర్‌కుమార్ తదితరులు పరామర్శించారు.

పాండిచ్చేరిలో కోరుట్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..

కోరుట్ల: ఆదివారం ఉదయం 9 గంటలకు పాండిచ్చేరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుట్ల మున్సిపల్ పరిధిలో ఎకీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందాడు. ఎకీన్‌పూర్‌లో కిరాణ దుకాణం నడుపుకునే చాడ కిషన్–మంజుల దంపతుల కుమారుడు చాడ మణి(24) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. కంపెనీ పని మీద పాండిచ్చేరి వెళ్లిన చాడ మణి స్నేహితులతో కారులో వెళ్తుండగా.. దిండివనం సమీపంలో మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణి మృతిచెందడంతో.. ఎకీన్‌పూర్‌లో విషాదం నెలకొంది.

సైబర్ మోసగాళ్ల అరెస్టు

- దుబాయ్ కేంద్రంగా సైబర్ చీటింగ్ దందా
- కోరుట్ల వాసికి రూ.4.23 కోట్ల మోసం
- నాలుగు నెలల క్రితం కేసు నమోదు
- కేరళలో నిందితుల ఆచూకీ..
- ఐదుగురి అరెస్టు చూపిన పోలీసులు

కోరుట్ల: నాలుగు నెలల క్రితం కోరుట్లకు చెందిన బాసెట్టి శంకరయ్య అనే ఓ విశ్రాంత ఇంజినీర్‌ను సీబీఐ కేసు పే రిట బెదిరించి రూ.4.23 కోట్లు ఆన్‌లైన్‌లో కాజేసిన ఉదంతంలో కేరళకు చెందిన ఐదుగురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల కోర్టులో హాజరుపర్చారు.

సీబీఐ కేసు పేరిట మోసం

కోరుట్లకు చెందిన బాసెట్టి శంకరయ్య తిరుపతిలో నివాసముంటున్నాడు. ఏడాది క్రితం కొందరు వ్యక్తులు అతడికి ఫోన్ చేసి తనపై సీబీఐ కేసు నమోదు అయిందని దాన్ని కొట్టేయాలంటే అధికారులను మేనేజ్ చేయాల్సి ఉంటుందని చెప్పి విడతల వారీగా సుమారు రూ.4.23 కోట్లు కాజేశారు. సదరు డబ్బులను ఆన్‌లైన్‌లో తాము చెప్పిన అకౌంట్లలోకి మళ్లించాలని నిందితులు సూచించిన మేర బాధితుడు అకౌంట్లకు పంపించాడు. అనంతరం సీబీఐ పేరిట తనను మోసం చేశారని తెలుసుకున్న బాధితుడు గతేడాది డిసెంబర్ 27న కోరుట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారీ సైబర్ చీటింగ్

జిల్లాలో భారీ సైబర్ చీటింగ్ కేసుగా గుర్తింపు పొందిన ఈ ఘటనలో అసలు నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. దుబాయ్ కేంద్రంగా తెలంగాణ, ఉత్తరాఖండ్, రాజస్తాన్, కేరళ రాష్ట్రాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని పక్కాగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న కేరళకు చెందిన ముఠా సభ్యులు షౌకత్ అలీ, అబ్దుల్ బాసిత్ మున్నాలీ, సిద్దిఖీ అన్వర్, అజ్మల్, కమ్రోద్దీన్‌లను కోరుట్ల పోలీసులు వారం రోజుల పాటు శ్రమించి పట్టుకున్నారు. కొంత డబ్బు ఆశచూపి అనామకుల ఆధార్‌కార్డులతో బ్యాంక్ అకౌంట్లు తీసి వారి ఖాతాల్లోని డబ్బులు మళ్లించి వాటిని కాజేసినట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో జరిగిన ఈ సైబర్ చీటింగ్ కేసును జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదుగురు నిందితులను పట్టుకోవడం విశేషం.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగుపల్లి సమీపంలో ఆదివారం కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దకల్వలకు చెందిన ఉప్పు సాగర్, ఉప్పు శ్రీనివాస్‌తోపాటు డ్రైవర్ అనిల్‌కుమార్ కారులో ప్రయాణిస్తున్నారు. వీరంతా బసంత్‌నగర్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ సాగర్, శ్రీనివాస్‌ను వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆసుపత్రిలో కోలుకుంటున్నారని తెలిపారు.

న్యాయం చేయాలని మహిళ నిరసన


పిల్లలతో దీక్ష చేస్తున్న ఇస్రత్ సుల్తానా


పెద్దపల్లిరూరల్: తమ ఇంటిని అక్రమంగా ఆక్రమించుకొని తమకు అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని తన ఇంటిని తనకు ఇప్పించాలంటూ ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని నల్లపోచమ్మవాడకు చెందిన ఇస్రత్ సుల్తానా తన ఇద్దరు పిల్లలతో కలిసి నిరసన దీక్షకు దిగింది. ఇస్రత్ సుల్తానా వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణపేటకు చెందిన ఇస్రత్ సుల్తానాకు పెద్దపల్లి పట్టణానికి చెందిన ఖాజా అలీతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. ఖాజా అలీ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏడాదిన్నర క్రితం సౌదీలోనే గుండెపోటుకు గురై మరణించాడు. కొంతకాలం తర్వాత ఇస్రత్ సుల్తానా తమ పుట్టింటికి వెళ్లి ఉండగా.. ఖాజా అలీ సోదరుడు సాజిద్ అలీ తమ్ముడి ఇంటిని ఆక్రమించుకున్నాడు. తమ ఇంటిని ఖాళీ చేయాలంటూ ఇస్రత్ సుల్తానా మజీద్ కమిటీ, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 20న ఇల్లు ఖాళీ చేసి అప్పగిస్తానంటూ చెప్పిన సాజిద్ అలీ ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడని, అందుకే తను వచ్చేదాకా ఇంటిముందే టెంట్ వేసుకొని నిరసనకు దిగానని ఇస్రత్ సుల్తానా తెలిపింది. తనకు దక్కాల్సిన ఇంటిని అన్యాయంగా ఆక్రమించుకొని తమను ఇబ్బంది పెడుతున్న సాజిద్ అలీపై చర్యలు తీసుకొని తనకు ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంటోంది.

గుండెపోటుతో తెలుగు ఉపాధ్యాయుడి దుర్మరణం


వేణుగోపాలస్వామి(ఫైల్)

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో 40 ఏళ్ల నుంచి అనేక ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేసి తను కూడా ఒక పాఠశాల వెంకటేశ్వర హైస్కూల్‌కు యజమానిగా 10 ఏళ్లపాటు విధులు నిర్వహించిన స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన పి.వేణుగోపాలస్వామి ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఖనిలోని ప్రముఖులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక చౌరస్తా అడ్డా టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ ఎండీ అమర్ సిద్దీకి అలీయస్ బాబర్ తన గురుభక్తిని చాటుకున్నాడు. మృతుడి చివరి మజిలీకయ్యే ఖర్చు తనే భరించడంతోపాటు గురువుకు సొంత ఇల్లు లేకపోవడంతో బాబర్ తన ఇంట్లోనే పెద్దకర్మ అయ్యేవరకు ఆశ్రయం కల్పించనున్నాడు.

వడదెబ్బతో ఒకరు..


నర్సయ్య (ఫైల్)

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బుద్దార్థి నర్సయ్య(70) వడదెబ్బతో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంటి నుంచి గ్రామంలో పని నిమిత్తం వచ్చిన నర్సయ్య శుక్రవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో.. కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుల సూచన మేరకు శనివారం రాత్రి ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం ఇంటి ముందుకొచ్చిన నర్సయ్య కుప్పకూలిపోయాడు. ఆదివారం ఎండ తీవ్రత మూలంగా మరణించారని గ్రామస్తులు తెలిపారు.

పారిశుధ్యంపై పట్టింపేది?

- తిరుమల్‌నగర్‌లో అస్తవ్యస్తం
- మండుటెండల్లోనూ మురికికూపాలు
- డ్రైనేజీ కనెక్టివిటీ లేక కాలనీవాసుల అవస్థలు


కరీంనగర్ కార్పొరేషన్: అధికారుల నిర్లక్ష్యం ఆ కాలనీవాసులకు శాపంగా మారింది. పారిశుధ్య నిర్వహణపై పట్టింపు లేకపోవడంతో నెలల తరబడి డ్రైనేజీ నీటితో సావాసం తప్పడం లేదు. మండుటెండల్లోనూ నివాసాల నడుమ మురుగునీరు నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తుండగా, పశువులు వీటిని ఆవాసంగా మార్చుకుంటున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా షరామాములుగానే స్పందన మాత్రం కనిపించడం లేదు.

నగరంలోని 10వ డివిజన్ పరిధిలోని తిరుమల్‌నగర్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా రోడ్ నం.5 ప్రాంతంలో డ్రైనేజీ కనెక్టివిటీ సరిగా లేకపోవడం ఆ ప్రాంతానికి ఇబ్బందిగా పరిణమిస్తోంది. భగత్‌నగర్, కట్టరాంపూర్ లాంటి ఎగువ ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీళ్లు తిరుమల్‌నగర్ చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి ముందుకు వెళ్లేందుకు సక్రమంగా డ్రైనేజీ లేకపోవడంతో, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరంతా అక్కడే నిలిచిపోతుంది. డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిలిచి ముందుకు కదలకపోవడంతో ఆ నీరంతా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి చేరుతున్నాయి. దీంతో మండుటెండలోనూ అక్కడ పెద్ద మురుగునీటి గుంత ఏర్పడింది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న డ్రైనేజీ నీళ్లన్నీ ఇందులో చేరుతుండడంతో అది చిన్నపాటి కుంటను తలపిస్తోంది. మండువేసవిలో చల్లదనం కోసం పశువులు కూడా దీనిని ఆవాసంగా మార్చుకున్నాయి. ఫలితంగా దోమలు విపరీతంగా పెరిగిపోయి ఈ ప్రాంత వాసులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సీజన్ కానప్పటికీ దోమల కారణంగా ఈ ప్రాంతంలో జ్వరాలు పెరుగుతున్నాయి. మండుటెండల్లోనే ఈ పరిస్థితి ఉంటే, వర్షాకాలం నాటికి పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.


తిరుమల్‌నగర్‌లో అపార్ట్‌మెంట్‌ను ఆనుకొని ఏర్పడిన మురుగునీటి గుంత

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సమస్య తీవ్రత దృష్ట్యా ఈ ప్రాంత వాసులు నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. డ్రైనేజీల్లో సిల్ట్ తీయకపోవడం, కనెక్టివిటీ లేకపోవడం కారణంగా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. పారిశుధ్య నిర్వహణాలోపంతో చెత్తాచెదారాన్ని కూడా పరిసర ప్రాంత వాసులు ఇందులోనే వేస్తున్నారు. ఇదిలాఉంటే కనెక్టివిటీ కొరవడిన డ్రైనేజీల స్థాయిల్లోనూ తేడా ఉండడం కూడా సమస్యగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి డ్రైనేజీ నీటిని సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


కదలని డ్రైనేజీ నీరు

రోగాల బారిన పడుతున్నాం



నెలల తరబడి మురుగునీరు నిలిచి ఉండడంతో దోమలు బాగా పెరిగి రోగాల బారిన పడుతున్నాం. మా వీధిలో ముందు వెనుకా ఇదే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లలేక ఇక్కడే నిలిచిపోతున్నాయి. నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి. వెంటనే డ్రైనేజీ నీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సత్యం, తిరుమల్‌నగర్

శాశ్వత పరిష్కారం చూపాలి



తిరుమల్‌నగర్ రోడ్ నం.5 ప్రాంతంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి. ఇక్కడ అపార్ట్‌మెంట్‌లు ఎక్కువగా ఉన్నాయి. ఎగువ భాగం నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు, మా వీధిలోని మురుగునీరు ముందుకు పోవడం లేదు. మురుగునీళ్లంతా ఇక్కడే నిలిచిపోతున్నాయి. దోమలబెడద తీవ్రంగా ఉంది. సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– రాజు, తిరుమల్‌నగర్


చామనపల్లిలో రోడ్డుపై ధాన్యం కుప్పలు

రహదారులే కల్లాలు

- రోడ్లపై ధాన్యం కుప్పలు

కరీంనగర్‌రూరల్: యాసంగిలో సాగు చేసిన వరిపంట చేతికొస్తోంది. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యాన్ని ఆరపెట్టేందుకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల సమీపంలోని రహదారులపై ధాన్యం ఆరపెడుతున్నారు. ఉపాధిహామీ పథకం కింద కల్లాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ రైతులు ఆసక్తి చూపించలేదు. కల్లాలు లేకపోవడంతో చివరకు ధాన్యాన్ని ఆరపెట్టేందుకు రహదారులే దిక్కయ్యాయి. కరీంనగర్ మండలం చామనపల్లి, ఇరుకుల్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే స్థలం లేకపోవడంతో రైతుల రహదారులపైనే ధాన్యం ఆరపోస్తున్నారు. నాలుగైదు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులుపట్టడంతో ధాన్యం కొనుగోళ్లు మరింత ఆలస్యమవుతున్నాయి. రోడ్లను సగానికిపైగా ధాన్యం కుప్పలతో నింపేయడంతో పాటు చుట్టూ బండరాళ్లను ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతుండటంతో ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఆయా గ్రామాల్లో అనుకూలమైన ప్రైవేట్ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలు గుర్తించి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మాంసం విక్రేతలకు రూ.10వేలు జరిమానా


నగరంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాస్


కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో మాంసం విక్రయిస్తున్న పలు దుకాణాలపై నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. మహావీర్ జయంతి సందర్భంగా నిబంధనల ప్రకారం ఆదివారం మాంసం విక్రయాలపై బల్దియా నిషేధం విధించింది. మాంసం విక్రయించే వ్యాపారులకు ముందుగానే అధికారులు నోటీసులు పంపించారు. నిషేధాన్ని అమలు చేసే క్రమంలో నగరపాలక కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, పర్యావరణ ఇంజనీర్ స్వామి, డీఆర్ఎస్ సిబ్బంది, శానిటేషన్ జవాన్లు బృందాలుగా నగరంలో తిరుగుతూ తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో తొమ్మిది చికెన్, మటన్ సెంటర్లు మాంసం విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఆ దుకాణాలకు రూ.10వేలు జరిమానా విధించారు.

కిమ్స్ ఫుడ్ సైన్స్ విద్యార్థుల క్షేత్ర సందర్శన



కరీంనగర్: కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ, ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని జిందాతిలిస్మాత్, పార్లే–జీ బిస్కెట్ పరిశ్రమలను సందర్శించారు. విద్యార్థులు మొక్కల నుంచి తీసిన వివిధ పదార్థాల ద్వారా జిందాతిలిస్మాత్ తయారీ, పార్లే కంపెనీ తయారీ చేస్తున్న వివిధ రకాల బిస్కెట్‌ల తయారీని, నాణ్యత గురించి ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ పెరియాల సాకేత్ రామారావు మాట్లాడుతూ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ విద్యార్థులకు పరిశ్రమలను, పరిశోధన కేంద్రాలను సందర్శింపజేస్తూ, ప్రయోగాత్మక విద్యను అందించటమే కిమ్స్ విద్యాసంస్థల ధ్యేయమని అన్నారు. కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్, సందర్శనలు ఉద్యోగాల దృష్ట్యా కిమ్స్ కళాశాలకు ఫుడ్ సైన్స్ కి సంబంధించిన అన్ని పరిశ్రమలతో పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్శనలో విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు అంజలి, మహేశ్వరి,ప్రణయ, తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం



మానకొండూర్: మండలంలోని అన్నారం, చెంజర్ల గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం పీడబ్ల్యూఎస్ కింద మంజూరైన పైపులైన్ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. అన్నారంలో మూడు, చెంజర్లలో నాలుగు లక్షలతో పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దయాకర్‌రావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రరంగంలో రాణించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యువత, సినీ కళాకారులందరూ తెలుగు సినీ రంగంలో రాణించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో 'పైలం పిల్లగా' చిత్రంలోని పాటను విడుదల చేసి మాట్లాడారు. తెలంగాణ యాస భాష, సంస్కృతి తెలుగు సినిమాకు ట్రెండ్‌గా మారిందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ సత్తా చాటాలని తెలిపారు. పైలం పిలగా సినిమా వందశాతం కరీంనగర్‌లోనే షూటింగ్ జరుపుకోవడం, ఈ చిత్ర నిర్మాత, దర్శకుడు, హీరో కరీంనగర్ వాసులే కావడం సంతోషకర విషయమన్నారు. హ్యాపీ హార్స్ ఫిలిమ్స్ నిర్మాణంలో రామకృష్ణ బొద్దుల, ఎస్‌కే శ్రీనివాస్ నిర్మాతలుగా, ఆనంద్ గుర్రం దర్శకత్వం వహించిన ఈ చిత్రం సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్‌లు సాయి తేజ, పరేషాన్ ఫేమ్ పావని, మ్యూజిక్ యశ్వంత్ నాగ్,, కెమెరామెన్ సందీప్ బద్దుల, ఎడిటింగ్ రవితేజ కూర్మన, స్టైలిష్ హారిక పొట్ట, లిరిక్స్ ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

బీసీ–ఏలో చేర్చితే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

కరీంనగర్: ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చితే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా ఎదిగిన కులాల వారు బీసీ–ఏ లోని రిజర్వేషన్లను అనుభవించాలనుకోవడం సరైనది కాదని అన్నారు. రజకుల భావితరాల భవిష్యత్‌ను రాష్ట్రప్రభుత్వం దెబ్బతీయొద్దని తెలిపారు. గతంలో డీగ్రూప్‌లో ఉన్న ముదిరాజులను అప్పటి కాంగ్రెస్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం బీసీఏలో చేరిస్తే రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి అప్పటి జీవో 15 రద్దు చేయించానని తెలిపారు. ఈ విషయాన్ని జాతీయ బీసీ కమిషన్‌కు కూడా విన్నవించామని, రాష్ట్ర ప్రభుత్వం వీరి చేరిక ప్రయత్నాలు విరమించుకోవాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెనక్కి తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో వనపర్తి శంకర్, జంపాల నర్సయ్య, మల్లుగారి నర్సింహ, గంగం రవి, నర్సయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పూసాల సంపత్

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

కరీంనగర్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాటఆలడారు. ప్రభుత్వాలు మారినా పంచాయతీ కార్మికుల బ్రతుకులు మారడం లేదన్నారు. జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో రెండు నెలల నుంచి 10 నెలల వరకు వేతన బకాయిలు పెండింగ్‌లు ఉన్నాయని తెలిపారు. దీంతో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, ఉపాధ్యక్షుడు కాశిపాక శంకర్, జిల్లా కోశాధికారి ఎండీగా రవీందర్‌రావు, కమిటీ సభ్యులు సదయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ, మహంకాళి కొమురయ్య, సారయ్య, మధు, కొమురయ్య, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

నకిలీ పత్రాలతో భూవిక్రయం

- నలుగురిపై కేసు

కరీంనగర్‌రూరల్: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాకుండా ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించిన వ్యవహారంలో నలుగురు వ్యక్తులపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు పరారీలో ఉండగా.. మరో ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల మేరకు.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య(54) పవర్‌లూమ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. తీగలగుట్టపల్లిలోని సర్వే నంబరు –233/ఈలో ప్లాట్ నంబరు 16లోని 293.33 చదరపు గజాల స్థలాన్ని 2003 సంవత్సరంలో మూల గౌరారెడ్డి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం గౌరారెడ్డి మృతిచెందడంతో కొడుకు మూల తిరుమలరెడ్డి గతంలో విక్రయించిన ప్లాట్లకు సంబంధించి 50 అడుగుల రోడ్డును ఆక్రమించి రెండు ప్లాట్లుగా విభజించి తన తల్లి మూల వీరమ్మ పేరిట తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మూల సూర్యప్రకాశ్‌రెడ్డి, లంక శేఖర్‌కు విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు విచారణ చేపట్టి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఇద్దరు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.


నిందితులతో మాట్లాడుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

ఊరూరా ఉపాధి జాతర

- పెరిగిన క్యూబిక్ మీటరు రేటు
- కూలి పెంపుతో ప్రయోజనం
- వేసవిలో పెరుగుతున్న కూలీల సంఖ్య

కరీంనగర్‌రూరల్:గ్రామాల్లో వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. గత నెలలో కూలీల సంఖ్య తగ్గిపోగా ఏప్రిల్ నెల ప్రారంభంతో కూలీల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కూలీల సంఖ్య పెరిగితేనే అభివృద్ధి పనులు జరుగుతాయని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ప్రత్యామ్నాయంగా ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 6వేల మంది కూలీలుండగా వీరిలో 4,353 మంది పనిచేసే కూలీలున్నారు. రోజుకు సుమారుగా 1,700 మంది పనులకు హాజరవుతున్నారు. గతంలో రోజు కూలి రూ.272 ఉండగా ఈనెల నుంచి రూ.28 కలిపి మొత్తం రూ.300 చెల్లిస్తున్నారు. వేతనాలు నేరుగా కూలీల బ్యాంకుఖాతాల్లో జమవుతున్నాయి.

చెరువుల్లో పూడికతీత

కరీంనగర్ మండలంలో ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో చెరువుల పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. చేగుర్తి, చామనపల్లి, చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, దుబ్బపల్లి, నగునూరు, గోపాల్‌పూర్, బొమ్మకల్, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, మందులపల్లి గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు జరుగుతున్నాయి. చెరువుల్లో కందకాలు తవ్వుతున్నారు. అదేవిధంగా ఎలబోతారం, మొగ్దుంపూర్, జూబ్లీనగర్, ఫకీర్‌పేట గ్రామాల్లో ఫీడర్ చానెల్స్ పనులు, నల్లగుంటపల్లిలో రోడ్డు ఫార్మేషన్, దుర్శేడ్‌లో పాంపాండ్ నిర్మాణపు పనులు నడుస్తున్నాయి. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూలీలు పెద్దసంఖ్యలో హాజరవుతుండటంతో పనులు జరిగే ప్రాంతాలు జాతరను తలపిస్తున్నాయి. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పని ప్రదేశాల్లో గ్రీన్ నెట్‌లతో నీడ సౌకర్యం, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

పెరిగిన క్యూబిక్‌మీటర్ రేటు

2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి కొలతల రేట్లను ప్రభుత్వం పెంచింది. క్యూబిక్‌మీటరు రేటు పెంచడంతో కూలీలకు రోజువారీ కూలి గిట్టుబాటవుతోంది. గతంలో పూడిక తీత పనుల్లో క్యూబిక్ మీటరుకు రూ.176 ఉండగా ప్రస్తుతం రూ.195 పెంచారు. అదే విధంగా పాంపాండ్ క్యూబిక్ మీటరుకు రూ.274 ఉంటే రూ.333, ఫీడర్‌చానెల్ పనులకు రూ.170 నుంచి రూ.195 పెంచారు. క్యూబిక్ మీటరుకు 30శాతం రేటు పెంచడంతో కూలీలకు ప్రయోజనం కలుగుతోంది.


మొగ్దుంపూర్‌లో పంట కాలువ తవ్వుతున్న కూలీలు


ఇరుకుల్లలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కూలీలందరికీ పని

గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. పది రోజుల నుంచి కూలీల సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజూ సుమారుగా 1,700 మంది పనులకు హాజరవుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం పూటే పనులు నడుస్తున్నాయి. పనిప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాం.

– సంజీవరావు, ఎంపీడీవో, కరీంనగర్ మండలం

మోడల్ పరీక్షలతో మానసిక స్థైర్యం


మోడల్ పరీక్ష పత్రాలు ఆవిష్కరిస్తున్న మణికంఠరెడ్డి

కరీంనగర్: మోడల్ పరీక్షలు విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచుతాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. నగరంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మోడల్ ఎఫ్‌సెట్, నీట్ పరీక్ష పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ రాజేశంతో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థులు చదువులతో పాటు సమాజాన్ని కూడా చదవాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎప్‌సెట్, నీట్‌లలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా నిర్వహిస్తున్న మోడల్ పరీక్షలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కనకం సాగర్, కేశబోయిన రాము యాదవ్, అలువాల విష్ణు, నగర నాయకులు వినయ్‌రెడ్డి, మచ్చ పవన్, బీరం అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కల రక్షణకు పచ్చని పందిరి

హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం ఊరూరా నర్సరీలు ఏర్పాటు చేశారు. వేసవికాలంలో ఎండల తీవ్రత పెరగడంతో కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల రక్షణకు పచ్చని పందిళ్లు (గ్రీన్‌షెడ్‌నెట్) ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– కరీంనగర్‌రూరల్

కార్పొరేట్ శక్తులకు దాసోహమైన బీజేపీని ఓడించండి

కరీంనగర్: దేశభక్తి ముసుగులో ప్రజలను మభ్యపెడుతూ దేశసంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. ఆదివారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ సమగ్రతకు, సమైక్యతకు విఘాతం కలిగించే విధంగా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని అన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఎంపీగా గెలిచి ఏం అభివృద్ధి సాధించారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సంపత్, రమేశ్, నరేశ్ పటేల్, మక్కపల్లి పూజ, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి



మూటలు మోసి.. దోశలు వేసి..

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఆదివారం ఉదయం మార్నింగ్‌వాక్ చేపట్టిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మినీ స్టేడియం నుంచి ప్రధాన రహదారుల వెంట నడుస్తూ స్థానికులను పలకరించారు. అలాగే ఓ దుకాణంలో ఇస్త్రీ చేసి.. ఆ పక్కనే ఉన్న హోటల్‌లో దోశలు వేశారు. ఆర్టీసీ కార్మికులు, ఆటోడ్రైవర్లు, కోళ్లు విక్రయించే వ్యాపారులతో ముచ్చటించారు. హమాలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకొని మూటలు మోశారు. సంతబజారులో కలియదిరిగి వ్యాపారుల ఇక్కట్లు తెలుసుకున్నారు.
– కొల్లాపూర్

హామీలిచ్చి మర్చిపోవడం కాంగ్రెస్‌కు అలవాటే

తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్ సీట్లు: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు హామీలు ఇచ్చి మర్చిపోవడం, వాటిని అమలు చేయకుండా కాలయాపన చేయడం కాంగ్రెస్‌కు అలవాటేనని బీజేపీ సీనియర్ నాయకుడు, మెదక్ పార్లమెంటు అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం ఓ హోటల్‌లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన 'క్రాస్ టాక్ విత్ రఘునందన్ రావు'కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజలతో బ్యాంకు ఖాతాలు తెరిపించి పారదర్శకతను పెంచిందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఉపాధి హామీ కూలీలకు సకాలంలో నిధులు అందుతున్నాయని, ఈ ఘనత కేవలం మోదీకి మాత్రమే దక్కుతుందన్నారు. ఇప్పుడు దేశంలో కూరగాయలు అమ్మే వ్యాపారులు సైతం డిజిటల్ పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకున్నారన్నారు. హామీలు ఇవ్వడం కాంగ్రెస్ వంతయితే అమలు చేయడం మా వంతు అయ్యిందని, 1980లో మెదక్‌కు రైల్ ఇస్తానని ఇందిరా గాంధీ హామీ ఇస్తే... చివరకు మోదీ హయాంలో అమలయ్యిందన్నారు. దేశంలో మోదీ పాలన చూసి ప్రజలు ఓట్లు వేయాలని, ఏ సర్వేలు చూసినా మోదీ మూడోసారి ప్రధాని అవుతారని స్పష్టమవుతోందని తెలిపారు. దేశంలో పరిష్కరించాల్సినవి ఇంకొన్ని అంశాలు మిగిలిపోయాయని, అందుకే 400 సీట్లు లక్ష్యంగా ముందుకి వెళ్తున్నట్లు వివరించారు. దుబ్బాకకి ఏం చేశానో ఒక పుస్తకం తయారు చేసి.. తన నియోజకవర్గంలో 75 వేల మందికి పంపిణీ చేస్తానని రఘునందన్ చెప్పారు.

కేసీఆర్, రేవంత్ ఓడిపోలేదా?

దుబ్బాకలో ఓడిపోయిన రఘునందన్‌రావు మెదక్‌లో పనికి వస్తారా అంటూ హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కామారెడ్డిలో ఓడిపోయిన కేసీఆర్ రేపటి నుంచి బస్సు యాత్ర ఎలా చేపడతారని ప్రశ్నించారు. 2018లో కొడంగల్‌లో ఓడిన రేవంత్ మల్కాజిగిరి నుంచి పోటీ చేయలేదా అని ప్రస్తావించారు. తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్ సీట్లు వస్తాయని, ఆ తర్వాత రాష్ట్రంలో పరిణామాలు ఏ విధంగా ఉంటాయో రేవంత్‌కి బాగా తెలుసని, అందుకే సానుభూతి కోసం కన్నీరు పెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే కేసీఆర్‌కు– రేవంత్‌రెడ్డికీ పెద్ద తేడా ఏమీ కనపడట్లేదని ఆయన చెప్పారు.

ప్రతి ఓటూ ముఖ్యమైందే..!

- మే 13న ఓటర్లు పోటెత్తండి
- పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేశాం
- ఎక్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో



సాక్షి, హైదరాబాద్: 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ముఖ్యమైందే. చాలాచోట్ల ఒక ఓటు గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. అలాంటప్పుడు ప్రతి ఓటరు తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నాయనే బెంగవద్దు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, కుర్చీలు తదితర ప్రాథమిక ఏర్పాట్లన్నీ చేశాం. ప్రతి పోలింగ్ కేంద్రంలో పారామెడికల్ స్టాఫ్ కూడా అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో 3.31కోట్ల ఓటర్లున్నారు. వారి కోసం 3లక్షల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ధీమాగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తాలి. ఐపీఎల్ మ్యాచ్‌లను తిలకించేందుకు ప్రేక్షకులు స్టేడియం వద్దకు చేరుకుని హౌస్‌ఫుల్ అయినప్పటికీ ఆసక్తిగా ప్రయత్నిస్తున్న సమయంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు ఎందుకు పరుగులు పెట్టరు.' అంటూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ వీడియో ఇప్పుడు ఎక్స్ వేదికగా ట్రెండింగ్‌లో ఉంది.

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదు



అబిడ్స్ (హైదరాబాద్): హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతపై బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న శ్రీరామ నవమి రోజు సిద్దిఅంబర్‌బజార్ చౌరస్తా వద్ద మతవిద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాధవీలత ప్రవర్తించారన్నారు. షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవీలతపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెపుతాం



సాక్షి, హైదరాబాద్: మోసానికి బ్రాండ్ అంబాసిడర్లు బీజేపీ, బీఆర్‌ఎస్‌లని రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలోని మత్స్యకారులను పట్టించుకోకుండా, కనీసం వారికి సంక్షేమ పథకాలను కూడా అమలు చేయకుండా ఆ రెండు పార్టీలు కాలయాపన చేశాయని ఆరోపించారు. మత్స్యకారులను మోసగించిన ఆ రెండు పార్టీలకు తమ ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని చెప్పారు. ఆ రెండు పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు తెలంగాణ మత్స్యకార సమాజం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మత్స్యకారులకు కాంగ్రెస్ మేనిఫెస్టో కొండంత బలాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఈ బలం కొనసాగాలంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మత్స్యకారులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని సాయికుమార్ విజ్ఞప్తి చేశారు.

సీఎం స్థాయి మరిచి రేవంత్ తిట్లు

ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి తాను ముఖ్యమంత్రినని మరిచిపోయి తిట్ల పురాణం మాట్లాడుతున్నా రని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే రేవంత్‌రెడ్డి ప్రజల విశ్వాసం కోల్పోయారని ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో అభ్యంతరకర భాషను వాడుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ స్థానాలు గెలవకపోతే సీఎం కుర్చీ పోతుందని రేవంత్ రెడ్డి భయపడుతున్నారని పేర్కొన్నారు. ఆగస్టు నెలలో రైతు రుణమాఫీ చేస్తామని మహబూబాబాద్, మెదక్ సభల్లో రేవంత్ రెడ్డి దేవుడిపై ప్రమాణం చేశారని మండిపడ్డారు. దేవుడిపై ప్రమాణం చేసి ఓట్లు అడగడం అంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని స్పష్టం చేశారు. 420 హామీలు నెరవేర్చడానికి ఎంత మంది దేవుళ్లపై ప్రమాణం చేస్తారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ బస్సు యాత్రతో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నల్లనేలలో నెగ్గేదెవరు?

బొగ్గుగనులతో గోదావరినదికి ఇరువైపులా విస్తరించి ఉన్న పెద్దపల్లి(ఎస్సీ) లోక్‌సభ సెగ్మెంట్‌లో ఈసారి పోరు ఆసక్తికరంగా మారింది. సింగరేణి కార్మికుల ఓట్లే అభ్యర్థుల తలరాతలు మారుస్తూ వస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం –1, 2, 3 డివిజన్లు, మంచిర్యాల జిల్లాలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లిలో పనిచేసే కార్మికులు 27,784మంది ఉన్నారు. వీరు కాకుండా కాంట్రాక్టు కార్మికులు సుమారు 25వేల మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారి కుటుంబాల్లో ఒక్కో ఇంట్లో సగటున నాలుగు ఓట్ల చొప్పున పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ లెక్కన సుమారు రెండులక్షలకుపైగా ఓట్లు కీలకంగా మారనున్నాయి. వీరితో పాటు రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబీకుల ఓట్లు మరో 50వేల వరకు ఉంటాయని అంచనా.1962 ఎన్నికల నుంచి ఈ సెగ్మెంట్‌లో స్థానికేతరుల హవానే కొనసాగుతోంది. అత్యధికంగా కాంగ్రెస్ 9 సార్లు, 3 సార్లు టీడీపీ, రెండుసార్లు బీఆర్‌ఎస్, ఒకసారి తెలంగాణ ప్రజాసమితి పార్టీలు గెలిచాయి. ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/పెద్దపల్లి



పెద్దపల్లి లోక్‌సభ స్థానంపై మూడు పార్టీల గురి • శ్రామిక ఓటర్లే కీలకం

సిట్టింగ్ సీటు కాపాడుకునే దిశగా బీఆర్‌ఎస్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014, 2019లలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచింది. హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకునే దిశంగా బీఆర్‌ఎస్ ఈసారి సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అభ్యర్థిగా బరిలోకి దింపింది. సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేతతోపాటు, కొందరు నాయకులు పార్టీ మారడంతో కొంత ప్రతికూలత పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కార్మిక నేతగా, సామ్యుడి పేరున్న 'కొప్పుల'కు ప్రత్యర్థులతో పోలిస్తే స్థానికంగా ఉన్న పట్టు, రాజకీయ అనుభవం తమకు కలసి వస్తుందనే భావనలో బీఆర్‌ఎస్ ఉంది.


కొప్పుల ఈశ్వర్

బోణీ కొట్టేందుకు బీజేపీ

పెద్దపల్లిలో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ నుంచి వచ్చిన గోమాస శ్రీనివాస్‌కు టికెట్ ఖరారు చేసి, పోటీలో నిలిపింది. గత ఎన్నికల నుంచే ఈ పార్టీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. సంస్థాగతం బలోపేతం కాకపోవడం, గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల మినహా ఎక్కడా ఆశించిన ఓట్లు రాలేదు. అయితే ప్రధాని మోదీ చరిష్మా, కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృత ప్రచారం చేస్తున్న కమలం పార్టీ నాయకులు ఈసారి గెలుస్తామనే నమ్మకంతో ఉన్నారు.


గడ్డం వంశీ


గోమాస శ్రీనివాస్

'కాకా' వారసత్వ బలం

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా)కి అడ్డాగా ఉన్న ఈ సెగ్మెంట్ ప్రస్తుతం ఆయన మనవడు గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు. రాజకీయఅనుభవం లేకున్నా, తాత వెంకటస్వామి, తండ్రి వివేక్ అండతో తమ 'కుటుంబ' సీటును కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఒకే కుటుంబం నుంచి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, తాజాగా వంశీకి టికెట్ ఇవ్వడంతో కేడర్‌లోనే అసంతృప్తి ఉంది. మరోవైపు మాలలకే ప్రాధాన్యం ఇవ్వడంపై మాదిగలు గుర్రుగా ఉన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు స్థానాల్లోనూ 'హస్తం'పార్టీ హవా కొనసాగడం వంశీకి కలిసొచ్చే అంశం.

శ్రామిక, రైతాంగం ప్రసన్నమైతేనే...

- బొగ్గు, విద్యుత్, సిమెంట్, ఎరువులు, సిరామిక్స్ తదితర పరిశ్రమలతో విరాజిల్లుతున్న ఈ ప్రాంతంలో శ్రామిక ఓటర్లే కీలకంగా ఉన్నాయి.
- కొన్నేళ్లుగా కొత్త బొగ్గులు గనులు రాకపోగా, భూగర్భ గనుల మూసివేత, ప్రైవేటీకరణతో యువతకు ఉపాధి కరువవుతోంది.
- రైతులకు సాగునీటి లేమి, 'కాళేశ్వరం' ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారాజ్, 'ఎల్లంపల్లి'దాక గోదావరి, ప్రాణహిత తీర రైతుల పంటలు బ్యాక్ వాటర్‌తో నీట మునగడం, మంచిర్యాల పట్టణంతోపాటు నది తీర ప్రాంత గ్రామాలకు ముంపు పెరగడం ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.
- ఉత్తర, దక్షిణ భారతదేశానికి కలిపేలా స్థానిక రైల్వే స్టేషన్లలో సూపర్ ఫాస్టు రైళ్ల నిలపుదల, కొత్త ట్రైన్లు, జాతీయ రహదారుల నిర్మాణం కూడా ముఖ్యమైనవే.
- సామాజికపరంగా ఎస్సీవర్గంలో మాదిగ, నేతకాని, మాల, బీసీల ఓట్లు కీలకం. మాలలకే టికెట్లు దక్కడంతో మాదిగల అసంతృప్తి ఎటు వైపుదారి తీస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు ఇలా

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు
పెద్దపల్లి	1,26,404	1,29,965	7
రామగుండం	1,10,255	1,09,970	26
మంథని	1,17,271	1,21,820	17
ధర్మపురి	1,11,962	1,17,647	6
మంచిర్యాల	1,38,472	1,40,559	25
చెన్నూరు	95,974	97,264	7
బెల్లంపల్లి	86,802	88,530	13

2019 ఎన్నికల్లో ఓట్లు ఇలా...

అభ్యర్థి	పార్టీ	ఓట్లు	శాతం
బొర్లకుంట వెంకటేశ్‌నేత	టీఆర్‌ఎస్	4,41,321	45.49
ఆగం చంద్రశేఖర్	కాంగ్రెస్	3,46,141	35.68
సోగాల కుమార్	బీజేపీ	92,606	9.55

పెళ్లి పత్రికపై రఘునందన్‌రావు ఫొటో

కేసు నమోదు చేసిన పోలీసులు


పెళ్లి పత్రికపై ముద్రించిన రఘునందన్ ఫొటో

కౌడిపల్లి(నర్సాపూర్): 'మా తమ్ముడి పెళ్లికి మీరు ఇచ్చే బహుమతి రఘునందన్‌రావు గారికి మీరు వేసే ఓటు' అంటూ పెళ్లి పత్రికపై మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫొటో ప్రింట్ చేసి కాప్షన్ రాసినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండా పంచాయతీ మహ్మద్‌నగర్‌గేట్ తండాకు చెందిన నునావత్ సురేష్ నాయక్ తమ్ముడు మదన్ పెళ్లి ఈ నెల 28న జరగనుంది. పెళ్లి పత్రికపై రఘునందన్‌రావు ఫొటో పెట్టి పెళ్లికి బహుమతిగా ఓటు వేయాలని ప్రింట్ చేయించి బంధువులు, స్నేహితులకు సురేష్ నాయక్ పంచాడు. అయితే అనుమతి లేకుండా ఎన్నికల సమయంలో ఎంపీ అభ్యర్థి ఫొటోతోపాటు ఓటు వేయాలని ముద్రించడంపై కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి చంద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోదీ ఉల్లంఘనలపై ఈసీ చర్యలేవి?

- మతపరమైన వ్యాఖ్యలు చేస్తున్నా మౌనమెందుకు?
- ఎలక్టోరల్ బాండ్లు అనైతికం
- సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల నియమావళిని ఉల్లఘిస్తున్నా, ఎన్నికల సంఘం స్పందించకపోవడాన్ని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆక్షేపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఉల్లంఘనలతో సాగుతోందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్లపై అన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వస్తున్నా, ముందుకెళ్లడం మోదీ మార్కు వ్యవహారశైలికి నిదర్శనమన్నారు. ఆదివారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, భారత్ జోడో అభియాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో 'ఎన్నికలు 2024, ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం' అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. హిందూ, ముస్లిం పేరుతో సమాజాన్ని విభజించే దిశగా మోదీ ప్రసంగాలున్నాయని, అయినా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. భారత వైమానిక దళానికి చెందిన విమానాలను ప్రధాని మోదీ ఉపయోగిస్తున్నారని, ఎన్నికల నియమావళి దీనిని అనుమతించదని తెలిపారు. అధికార పార్టీ ప్రభుత్వ అధికారులను కూడా ఉపయోగించుకోవడాన్ని భూషణ్ తప్పుబట్టారు. ఏప్రిల్ 7న బిహార్‌లో మోదీ చేసిన ప్రసంగంపై సీపీఎం నేత సీతారాం ఏచూరీ, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఫిర్యాదు చేసినా ఎన్నికల కమిషన్ స్పందించలేదన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంపై దర్యాప్తు జరపాలి

ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొందని, అయినప్పటికీ ఓ ఇంటర్వ్యూలో మోదీ.. ఇదో పారదర్శక వ్యవస్థగా పేర్కొన్నారని భూషణ్ తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిరిగి వాటిని ప్రవేశపెడతామనడాన్ని తప్పుబట్టారు. ఎలక్టోరల్ బాండ్లపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందన్నారు. దేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్, సీబీఐ అధికారులు లంచాల సంస్కృతికి తెర తీసిన పరిస్థితి ఉందని, ఎన్నికల బాండ్లను మోదీ ఎలా సమర్థిస్తారని ఆర్‌టీఐ కార్యకర్త అంజలీ భరద్వాజ్ అన్నారు.

నన్ను ఓడించేందుకు కుమ్మక్కు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై బండి సంజయ్ ఆరోపణ

- అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించలేదు
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత బీఆర్‌ఎస్ సర్కారే కారణం
- రూ. 270 కోట్ల బకాయిలుంటే రూ. 50 కోట్లే ప్రభుత్వం విడుదల చేసింది
- మంత్రి పొన్నంకు చిత్తశుద్ధి ఉంటే నూలు కొనుగోలులో అవినీతిపై విచారణ చేపట్టాలి
- సిరిసిల్ల సభలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్


వీర్నపల్లి మండల కేంద్రంలో తడిసిన వడ్లను పరిశీలిస్తున్న బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల: కరీంనగర్‌లో తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని, అందుకే ఇప్పటికీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఆరోపించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే బాధ్యతని బండి విమర్శించారు. తాము చెప్పిన మూడు కంపెనీల వద్దే నూలు కొనాలనే షరతులు పెట్టి అధిక ధరకు కొనుగోలు చేయించిందని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా నూలు కొనుగోలులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెసోళ్లకు రాముడి పేరు వింటేనే భయం పట్టుకుందన్న బండి సంజయ్.. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అంటున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. మహిళలకు రూ. 2,500 ఇవ్వట్లేదని, పెన్షన్లు రూ. 4 వేలకు పెంచలేదన్నారు. బీఆర్‌ఎస్ గుడిని మింగితే.. కాంగ్రెస్ గుడిలో లింగాన్ని కూడా మింగే రకమని ఆరోపించారు. సిరిసిల్ల నేతన్నలకు రూ. 270 కోట్ల బకాయిలుంటే కంటితుడుపు చర్యగా రూ. 50 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

తడిసిన వడ్లన్నీ కొనాల్సిందే..

వీర్నపల్లి మండల కేంద్రంలో తడిసిన వడ్లను బండి సంజయ్ పరిశీలించారు. తడిసిన వడ్లను కొనాల్సిందేనని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాల్లేవని, మద్దతు ధర కంటే తక్కువకే దళారులకు అమ్ముకొనే దుస్థితి ఏర్పడిందన్నారు. 15 రోజులుగా వడ్ల రాశులు పోసినా ఎవరూ కొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌లో ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయిన తాటి, ఈత చెట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నష్టపోయిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈత మొక్కల పెంపకానికి బిందు సేద్యంపై 90 శాతం సబ్సిడీ, ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమి కొని ఈతవనాలు పెంచుతామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాటతప్పాయని విమర్శించారు. కాంగ్రెస్ హామీ మేరకు జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాణీ రుద్రమదేవి, ప్రతాప రామకృష్ణ, రెడ్డబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లోని రాజీవ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు.

క్రికెట్ టీంలాగా ముందుకెళ్తున్నాం

రాష్ట్రానికి మేలు చేసేందుకు కలసి పనిచేస్తున్నాం • నల్లగొండ ప్రచార సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

హుజూర్‌నగర్: రాష్ట్రాభివృద్ధి కోసం మంత్రివర్గం టీం వర్క్‌తో పనిచేస్తోందని.. ప్రజలకు మేలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులమంతా ఒక క్రికెట్ టీంలాగా ముందుకెళ్తున్నామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రాజీవ్ ప్రాంగణంలో నల్లగొండ లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో ఉత్తమ్ ప్రసంగించారు. తామంతా కలసి కష్టపడి పనిచేస్తున్నా బీఆర్‌ఎస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా నదీ జలాల విషయంలో తామేమీ చేయలేదని బీఆర్‌ఎస్ నేతలు రోజుకోరకంగా మాట్లాడుతున్నారని, అలా మాట్లాడే వారికి సిగ్గుండాలని ఆయన మండిపడ్డారు.

సాగర్ చెక్కుచెదరలేదు.. కాళేశ్వరం కుప్పకూలింది

సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రజల జీవితాలను తాకట్టు పెట్టి రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కుప్పకూలిపోయిందని ఉత్తమ్ ఆరోపించారు. 60 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు చెక్కు చెదరలేదని.. కానీ కేసీఆర్ నాలుగేళ్ల క్రితం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిందని ఎద్దేవా చేశారు. సాగు, తాగునీరు, విద్యుత్ విషయంలో రాష్ట్రాన్ని చాలా సమర్థంగా ముందుకు తీసుకెళ్తామని.. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నేతలు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ ఉండదని ఉత్తమ్ జోస్యం చెప్పారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం..

ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని ఉత్తమ్ పేర్కొన్నారు. పార్లమెంటులో అధికార పక్షం ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి కీలకమైన నాలుగు స్తంభాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆయన చెప్పారు. ఈ పరిస్థితుల్లో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని.. ఇండియా కూటమి ఆధిక్యం సాధిస్తుందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని.. రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ స్కాన్



యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ కూటములకు బ్రేక్ పడితేనే రాష్ట్రంలో అభివృద్ధి మొదలవుతుంది. వాటి అసమర్థ పాలనలో కేరళ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. జాతీయ రహదారుల ప్రాజెక్టులను అడ్డుకోవడమే కాకుండా కేంద్ర నిధులను లెఫ్ట్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తోంది. శాంతిభద్రతలను గాలికొదిలేసింది. ఇక్కడి కాలేజీలు కమ్యూనిస్ట్ గూండాలకు అడ్డాలుగా మారాయి.

- పత్తనంతిట్ట సభలో ప్రధాని మోదీ



బీజేపీ మతతత్వ, విభజన రాజకీయాలను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది. పౌరసత్వ సవరణ చట్టాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మాత్రం ఆ ఊసే లేదు. సంఘ్ విధానాలనే అనుసరిస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలకు ఏ ప్రయోజనం ఉండదు.

- అలప్పుజ ర్యాలీలో సీఎం పినరయి విజయన్



మోదీ హయాంలో నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పరాకాష్టకు చేరాయి. బీజేపీ విధానాలు దేశానికే శాపంగా మారాయి. ఆ పార్టీ దేశంలో నిత్య అలజడిని, తీవ్ర అశాంతిని వ్యాప్తి చేస్తోంది. పాగా వేసిన చోటల్లా ప్రజల మధ్య విభజన తెస్తున్న కాషాయ పార్టీ కేరళలోనూ అవే ప్రయత్నాలకు తెగబడుతోంది.

- కన్నూర్ సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



మలబార్ వార్

కేరళలో టఫ్ ఫైట్ | యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ పోరు | పాగాకు బీజేపీ యత్నం

పచ్చని ప్రకృతి సోయగాలతో పర్యాటకులకు కనువిందు చేసే కేరళలో రాజకీయాలు మాత్రం భగభగలాడుతుంటాయి. గాడ్స్ ఓన్ కంట్రీలో లోక్‌సభ ఎన్నికల పోరు దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈసారి కూడా కేరళ బరిలో ఉన్నారు. పోటీ ప్రధానంగా కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) మధ్యే సాగుతోంది. ఈసారైనా రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తోంది. దాంతో మలబార్ తీరంలో ట్రయాంగిల్ వార్‌కు తెర లేచింది...

అక్షరాస్యతలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్న కేరళలో ఓటర్ల చైతన్యం ఎక్కువ. ఇక్కడి 20 లోక్‌సభ స్థానాల్లో గత ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి 19 సీట్లు గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. కాంగ్రెస్ 16 చోట్ల పోటీ చేసి 15 హస్తగతం చేసుకోగా కూటమిలోని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు 2, కేరళ కాంగ్రెస్ (ఎం), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పీ)కు చెరో స్థానం దక్కాయి. మోదీ వేవ్‌లో ఘోరంగా దెబ్బతిన్న యూపీఏ కూటమికి అత్యంత విజయవంతమైన రాష్ట్రంగా కేరళ నిలిచింది. అధికార ఎల్‌డీఎఫ్ నుంచి సీపీఎం మాత్రమే ఖాతా తెరవగలిగింది. 16 చోట్ల పోటీ చేస్తే ఒకే ఒక్క స్థానంలో గెలిచింది. సీపీఐ సున్నా చుట్టింది. యూపీలోని గాంధీల కంచుకోట అమేథీలో ఘోర ఓటమి చవిచూసిన రాహుల్‌ను ఇక్కడి వయనాడ్ ఓటర్లు మాత్రం భారీ మెజారిటీతో గెలిపించారు. ఇక బీజేపీ 15 చోట్ల పోటీ చేస్తే ఒక్క సీటూ దక్కలేదు.



ఎవరెన్ని చోట్ల...

2019 మాదిరిగానే ఈసారి కూడా ఇండియా కూటమిలో కాంగ్రెస్ 16, ఐయూఎంఎల్ 2, కేఈసీ(ఎం), ఆరెస్పీ చెరో స్థానంలో పోటీ చేస్తున్నాయి. ఎల్‌డీఎఫ్‌లో సీపీఎం 16, సీపీఐ 4 సీట్లలో తలపడుతున్నాయి. బీజేపీ 16 స్థానాల్లో అదృష్టం పరీక్షించుకుంటోంది. మిత్రపక్షం బీడీజేఎస్‌కు 4 సీట్లిచ్చింది.

ఆంటోనీ వెర్సస్ ఆంటోనీ


అనిల్ ఆంటోనీ

దక్షిణ కేరళలోని పత్తనంతిట్ట లోక్‌సభ స్థానం ఈసారి కాకరేపుతోంది. కాంగ్రెస్ వెటరన్ ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ ఆంటోనీ ఇక్కడ బరిలో ఉన్నారు. గతేడాది కాషాయ తీర్థం పుచ్చుకున్న అతన్ని ఓడించాలని తండ్రే పిలుపునివ్వడంతో ఇది హాట్ సీట్‌గా మారింది. అనిల్‌ను ఎలాగైనా గెలిపించుకునేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. అనిల్ వంటి నాయకులు యువతకు ప్రతిరూపమని, కేరళకు ఇలాంటి వారి అవసరముందని మోదీ కొనియాడారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున హ్యాట్రిక్ వీరుడు ఆంటో ఆంటోనీ బరిలో ఉన్నారు. సీపీఎం నుంచి థామస్ ఐజాక్ పోటీ చేస్తున్నారు. హిందూ క్షేత్రం శబరిమల ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఇక్కడ తలపడుతున్న ప్రధాన అభ్యర్థులు ముగ్గురూ క్రైస్తవులే కావడం విశేషం!

కూటముల కొట్లాట

కేరళలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అధికారం యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ కూటముల మధ్యే మారుతూ వస్తోంది. 2018లో కేరళను కుదిపేసిన శబరిమల సంక్షోభం నేపథ్యంలో 2019 లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్‌కు కలిసొచ్చాయి. కానీ వాటిలో మట్టికరిచిన అధికార ఎల్‌డీఎఫ్ కూటమి రెండేళ్లకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఏకంగా 99 స్థానాలు నెగ్గింది. సీపీఎం నేత పినరయి విజయన్ సీఎం పీఠాన్ని తిరిగి చేజిక్కించుకున్నారు. ఈసారి యూడీఎఫ్ పక్షాలు 'ఇండియా' కూటమి పతాకం కింద పోటీ పడుతున్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కార్పొరేట్లతో మోదీ సర్కారు కుమ్మక్కు వంటి అంశాలను ఇండియా కూటమి ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. విజయన్ ప్రభుత్వ వైఫల్యాలనూ ఎండగడుతోంది. 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో విడుదల చేసిన జాతీయ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అధికార ఎల్‌డీఎఫ్ కూడా మోదీ ప్రభుత్వం కేరళపై వివక్ష చూపుతోందంటూ విరుచుకుపడుతోంది. రాష్ట్ర సమస్యలపై పోరాడటంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, దానికి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనంటూ విజయన్ ప్రచారం చేస్తున్నారు.

సర్వేలు
అటూ ఇటూ...

కేరళలో ఈసారి సర్వేల అంచనాలు రకరకాలుగా ఉన్నాయి. బీజేపీకి 3 సీట్లు రావచ్చని, యూడీఎఫ్ 11, ఎల్‌డీఎఫ్ 6 సీట్లను దక్కించుకోవచ్చని తాజాగా ఒక సర్వే పేర్కొంది. బీజేపీకి ఈసారీ బోణీ దక్కకపోవచ్చని మరో సర్వే అంటోంది. ఓట్ల శాతం మాత్రం ప్రస్తుత 15 శాతం నుంచి 17కు పెరగవచ్చని పేర్కొంది. మొత్తం 20 సీట్లనూ యూడీఎఫ్ ఎగరేసుకుపోతుందనే లెక్కలూ ఉన్నాయి.

బీజేపీ ఆపసోపాలు...

కేరళలో పాగా వేయాలని కమలనాథులు చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా కాలం కలిసి రావడం లేదు. కాంగ్రెస్, లెఫ్ట్ హిందూ వ్యతిరేకులంటూ ఎంతగా ఎండగడుతున్నా ఎన్నికల్లో మాత్రం ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. 2018 శబరిమల సంక్షోభ సమయంలో హిందువుల పక్షాన పోరాడినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదు. ఓట్ల శాతం 12 నుంచి 15కు పెరగడం ఒక్కటే ఊరట. దాంతో ఈసారి బీజేపీ రూటు మార్చింది. పలువురు కొత్తవారికి అవకాశమిచ్చింది. ప్రముఖ సినీ నటుడు సురేశ్ గోపీకి త్రిసూర్ టికెటిచ్చింది. కీలకమైన తిరువనంతపురంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ శశిథరూర్‌పై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బరిలో దింపింది. మరో కేంద్ర మంత్రి వి.మురళీధరన్ కూడా అట్టింగల్ నుంచి పోటీ చేస్తున్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం హిందూ ఓట్లను తనకు అనుకూలంగా మరింతగా సంఘటితం చేస్తుందని బీజేపీ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలో 55 శాతం హిందూ జనాభా కాగా 26 శాతం ముస్లింలు, 18 శాతం క్రైస్తవులున్నారు. కేరళపై మోదీ కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉధృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు. అభివృద్ధి నినాదంతో పాటు లెఫ్ట్ పాలనలో హింస, అవినీతిని ఎండగడుతూ కేరళలో ఈసారి ఎలాగైనా బోణీ కొట్టాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గెండూ.. బఘూ...!

- ఓటర్లను ఆకర్షించేందుకు మస్కట్లు
- బెంగాల్లో ఈసీ వినూత్న యత్నం



గెండూ, బఘూ, మోహన్‌బావో... ఇవేమిటో తెలుసా? వివిధ జంతువులకు ఈసీ పెట్టిన పేర్లు! ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పశ్చిమబెంగాల్లో ఎన్నికల అధికారులు చేస్తున్న వినూత్న ప్రయత్నాలివి! జిల్లాకు ఒక జంతువు చొప్పున ఎంపిక చేసుకుని వాటితో కూడిన మస్కట్లను పోలింగ్ బూత్‌ల దగ్గర ప్రదర్శనగా పెట్టాలని నిర్ణయించారు. ఓటింగ్ శాతం పెంచడానికి ఎంతగా కృషి చేస్తున్నా పెద్దగా ఫలితాలు లేని నేపథ్యంలో కనీసం ఈ మస్కట్లను చూసేందుకైనా ఓటర్లు మరింతగా పోలింగ్ బూత్‌లకు తరలివస్తారని అధికారులు ఆశిస్తున్నారు. తప్పకుండా వచ్చి ఓటేయాల్సిందిగా వాటి పేరిట ప్రజలకు పిలుపులు కూడా వెళ్తున్నాయి! అలీపుర్‌దార్ జిల్లాలో 'గెండు' (ఖడ్గమృగం), కూచ్‌బెహార్ జిల్లాలో మోహన్‌బావో (తాబేలు) పేర్లతో ఆకర్షణీయమైన మస్కట్లు ఓటర్లకు ఆహ్వానం పలుకుతాయి. 24 దక్షిణ పరగణాల జిల్లాలో బాఘు పేరిట రాయల్ బెంగాల్ టైగర్ మస్కట్ దర్శనమిస్తోంది. డార్జిలింగ్ పర్వత ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద పాండా మస్కట్‌లు ఆకట్టుకుంటున్నాయి. జల్పాయ్‌గురి జిల్లాలో స్థానికులకు జీవనాధారమైన తీస్తా నది పేరుతో మస్కట్ వెలిసింది. ప్రజలకు సుపరిచితమైన జానపద గాథల్లోని కల్పిత పాత్ర తెనిద మస్కట్ కోల్‌కతా ఉత్తర నియోజకవర్గంలో ఓటర్లను ఆకర్షిస్తోంది. నాదియా జిల్లాలో 'హాట్ గోపాల్', హౌరాలో కామిక్ పాత్ర 'బతుల్ ద గ్రేట్' పేరుతో మస్కట్లను ఏర్పాటు చేశారు. పూర్వ మేదినీపూర్‌లో పీతల ఆధారిత మస్కట్, హూగ్లీలో జగన్నాథ్ రథ మస్కట్లు ఓటేసేందుకు రమ్మంటూ పిలుస్తున్నాయి.

ప్రేరణ కల్పించేందుకే

మస్కట్ల ప్రచారం ద్వారా బెంగాల్ సాంస్కృతిక వైవిధ్యాన్ని కూడా గుర్తు చేస్తున్నట్టు ఎన్నికల అధికారి ఒకరు తెలిపారు. ఓటర్ల మనసులకు దగ్గరైన పాత్రలతో వారికి సందేశమివ్వడమే దీని ఉద్దేశమన్నారు.

– న్యూఢిల్లీ

తెలుగువారి ఠీవి


మైనారిటీ సర్కారుతోనే పీవీ ఇంద్రజాలం

- దేశాన్ని ప్రగతిపథాన నడిపిన దార్శనికుడు
- మరింత బలం పుంజుకున్న బీజేపీ
- పలు విశేషాల పదో లోక్‌సభ

ఉగ్ర కల్లోలం కారణంగా జమ్మూ కశ్మీర్, పంజాబ్‌లోని 19 స్థానాలు మినహా 523 లోక్‌సభ స్థానాలకు 1991లో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 36.26 శాతం ఓట్లతో 232 స్థానాలు దక్కించుకుంది (తర్వాత 252కు పెరిగింది). బీజేపీకి 120, వీపీ సింగ్ నాయకత్వంలోని జనతాదళ్‌కు 59, సీపీఎంకు 35 సీట్లు దక్కాయి.

రాజీవ్ హత్యకు ముందు, తర్వాత! 1991లో జరిగిన పదో లోక్‌సభ ఎన్నికలను ఇలా రెండు భాగాలుగా చూస్తుంటారు. మే 20న 211 లోక్‌సభ స్థానాలకు జరిగిన తొలి దశ పోలింగ్‌లో కాంగ్రెస్ ప్రభావం అంతంతే. కానీ మర్నాడు మే 21న రాజీవ్ దారుణ హత్యతో వీచిన సానుభూతి పవనాలు రెండు, మూడో విడత పోలింగ్‌లో పార్టీకి బాగా కలిసొచ్చాయి. అయినా మెజారిటీకి కాంగ్రెస్‌కు కూతవేటు దూరంలోనే నిలిచింది. అనూహ్య పరిణామాల నడుమ తెలుగుతేజం పీవీ గద్దెనెక్కడం, మైనారిటీ సర్కారును ఐదేళ్లూ విజయవంతంగా నడిపి ఔరా అనిపించడం, దివాలా దశ నుంచి దేశాన్ని గట్టెక్కించి ప్రగతిపథంలో పరుగులు పెట్టించడం... ఇదంతా చరిత్ర!

- సాక్షి, నేషనల్ డెస్క్



పీవీ చాణక్యం...

సంస్కరణలతో దేశానికి నూతన దిశానిర్దేశం చేసిన దార్శనికుడు, తెలుగుతేజం పీవీ నిజానికి 1991 ఎన్నికల్లో పోటీయే చేయలేదు. రాజకీయాలకు శాశ్వతంగా గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. కానీ రాజీవ్ దూరమైన డీలా పడ్డ కాంగ్రెస్‌కు ఆయనే పెద్ద దిక్కుగా మారారు. గాంధీ కుటుంబానికి నమ్మకస్థుడు కావడం, రాజకీయాలు, పాలనలోనూ లోతైన అనుభవం కలిసొచ్చింది. పార్టీ కోరిక మేరకు ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. అనంతరం నంద్యాల ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి బంగారు లక్ష్మణ్‌పై ఏకంగా ఐదు లక్షల ఓట్లకు పైగా మెజారిటీతో నెగ్గారు. సభలో పూర్తి బలం లేకపోయినా మైనారిటీ సర్కారును ఐదేళ్లూ అద్భుతంగా నడిపారు. అన్నాడీఎంకే, ఆరెల్డీ, జేఎంఎం ఫిరాయింపుదారుల మద్దతుతో 1993లో అవిశ్వాస గండం గట్టెక్కారు. సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలతో దేశ బంగారు భవితకు పటిష్ట పునాదులు వేసి చిరస్మరణీయునిగా నిలిచిపోయారు.

గతం

కీలక నిర్ణయాలు

పీవీ ప్రధాని అయ్యేనాటికి దేశం దివాలా అంచుల్లో ఉంది. చంద్రశేఖర్ సర్కారు దిగిపోవడానికి ముందే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ వద్ద 67 టన్నుల బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన దుస్థితి! మూడు వారాల దిగుమతుల అవసరాలకు మించి చాలని విదేశీమారక నిల్వలు! ఇలాంటి దుస్థితి నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు పీవీ సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. అన్నింటికంటే ముఖ్యమైనది బ్యూరోక్రాట్ అయిన మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిని చేయడం! విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచి సంస్కరణలతో మార్కెట్లో పోటీతత్వాన్ని ప్రోత్సహించారు. లైసెన్స్‌రాజ్‌కు చమరగీతం పాడారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం దిశగా కీలక చర్యలు తీసుకున్నారు. విమర్శకులు సైతం పీవీ నిర్ణయాలను ప్రస్తుతించేలా ఆయన పాలన సాగింది! అణ్వస్త్ర ప్రయోగానికి కూడా పీవీ హయాంలోనే సర్వం సిద్ధమైంది.

బాబ్రీ మరక

1992 డిసెంబర్ 6న జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేత మాత్రం పీవీని బాగా అప్రతిష్టపాలు చేసింది. తదనంతర మత ఘర్షణల్లో వేలమంది మరణించారు. అలాగే జేఎంఎం ఎంపీలకు ముడుపులిచ్చారన్న ఆరోపణలు కూడా పీవీని చాలాకాలం పాటు వెంటాడాయి.

పదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం స్థానాలు 542)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	252
బీజేపీ	121
జనతాదళ్	63
సీపీఎం	36
సీపీఐ	14
ఇతరులు	55
స్వతంత్రులు	1

రథయాత్రతో మొదలైన బీజేపీ జైత్రయాత్ర

1991 ఎన్నికలతో బీజేపీ మరింత బలపడింది. 1984లో 2, 1989లో 85 స్థానాల నుంచి 120 సీట్లకు ఎదిగింది. ఓట్ల శాతాన్ని కూడా 7.74, 11.36 నుంచి 20.11కి పెంచుకుంది. అయోధ్య రామమందిర నిర్మాణం అంశం 1991 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బాగా కలిసొచ్చింది. ఎన్నికలకు సరిగ్గా ఆర్నెల్ల ముందు అద్వానీ చేపట్టిన రథయాత్ర, దాన్ని బిహార్లో లాలూ సర్కారు అడ్డుకోవడం బీజేపీ గ్రాఫ్‌ను బాగా పెంచింది. యూపీలోని 85 సీట్లలో కాంగ్రెస్‌కు కేవలం 5 రాగా బీజేపీ ఏకంగా 51 స్థానాలను గెలుచుకోవడం విశేషం!

రాజీవ్‌ను బలి తీసుకున్న ఎల్టీటీఈ

ప్రధానిగా శ్రీలంకకు సైన్యాన్ని పంపి ఎల్టీటీఈపై ప్రత్యక్ష పోరుకు దిగడం రాజీవ్ ప్రాణాలనే బలిగొంది. 1991 మే 21న చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ ఎన్నికల ర్యాలీలో థాను అనే ఎల్టీటీఈ ఆత్మాహుతి బాంబు నడుం చుట్టూ పేలుడు పదార్థాలతో రాజీవ్‌ను సమీపించి తనను తాను పేల్చేసుకుంది. అలా దేశం మరో మాజీ ప్రధానిని కోల్పోయింది.

హ్యాట్రిక్ వీరుడు శశి థరూర్, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తలపడుతున్న తిరువనంతపురం లోక్‌సభ స్థానం దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఇద్దరు హై ప్రొఫైల్ నేతలే కావడంతో పోటీ ప్రతిష్టాత్మకంగా మారింది. చారిత్రక ప్రాధాన్యమున్న కేరళలోని ఈ కీలక నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోట. ఈసారి దాన్నెలాగైనా బద్దలు కొట్టేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సీపీఐ కూడా రంగంలో ఉన్నా ప్రధాన పోటీ థరూర్, రాజీవ్ మధ్యే నెలకొని ఉంది...

తిరువనంతపురం బడా నేతల లడాయి

హ్యాట్రిక్ వీరుడు థరూర్‌తో కేంద్ర మంత్రి రాజీవ్ అమీతుమీ

- నిర్ణాయకంగా పట్టణ ఓటర్లు
- సీపీఐ చీల్చే ఓట్లే కీలకం!

రక్షణ మంత్రిగా చేసిన వీకే మీనన్ వంటి ప్రముఖులు గెలిచిన సీటు తిరువనంతపురం. 2009 నుంచి శశి థరూర్ వరుసగా మూడుసార్లు గెలిచారు. ఇక్కడ కాంగ్రెస్ తొమ్మిదిసార్లు నెగ్గింది. గత ఎన్నికల్లో శశిథరూర్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి భాగస్వామిగా ఉన్న సీపీఐ ఇక్కడ మాత్రం ఎల్‌డీఎఫ్ తరఫున కాంగ్రెస్‌కు ప్రత్యర్థిగా రంగంలో ఉంది. ఆ పార్టీ తరఫున అగ్ర నేత పన్నియన్ రవీంద్రన్ బరిలో ఉన్నారు. థరూర్, రాజీవ్‌లలో ఆయన ఎవరి ఓట్లను చీలుస్తారన్న దాన్ని బట్టి విజేత ఎవరో తేలవచ్చంటున్నారు.

పవర్‌ఫుల్ బిజినెస్‌మేన్ రాజీవ్



రాజీవ్ చంద్రశేఖర్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మలయాళీ తల్లిదండ్రులకు జన్మించారు. త్రిసూర్ జిల్లా కొండయూర్‌లో ఆయన పూర్వీకుల ఇల్లుంది. షికాగోలోని ఇల్లినాయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసిన ఆయన ఇంటెల్‌లో పని చేశారు. 1991లో ఇండియా తిరిగొచ్చి మామగారి కంపెనీ బీపీఎల్ గ్రూప్‌లో చేరారు. 2005లో బీపీఎల్‌లో తన వాటాను విక్రయించి జూపిటర్ క్యాపిటల్‌ను స్థాపించారు. 2006లో కర్ణాటక నుంచి స్వతంత్ర సభ్యునిగా రాజ్యసభకు ఎన్నికై రాజకీయ అరంగేట్రం చేశారు. బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. 2018లో మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. మోదీ ప్రభుత్వంలో ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయన లోక్‌సభకు తొలిసారి పోటీ చేస్తున్నారు. దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై తనతో బహిరంగ చర్చకు రావాలంటూ థరూర్‌కు సవాలు కూడా విసిరారు.

హ్యాట్రిక్ వీరుడు థరూర్

మలయాళీ దంపతులైన చంద్రన్ థరూర్, సులేఖా మీనన్‌కు శశి థరూర్ లండన్‌లో జన్మించారు. తమిళనాడులో సేలం సమీపంలోని మోంట్‌ఫోర్ట్ స్కూల్, ముంబైలోని క్యాంపియన్ స్కూల్లో చదివారు. న్యూఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి చరిత్రలో బ్యాచిలర్స్, అమెరికాలో మెడ్‌ఫోర్డ్‌లోని టఫ్ట్స్ వర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్, అఫైర్స్‌లో పీహెచ్‌డీ చేశారు. ఐక్యరాజ్యసమితిలో హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీస్‌గా 1978లో థరూర్ కెరీర్ మొదలైంది. 2006లో ఐరాస ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ పడ్డారు. 2009లో తిరువనంతపురం నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014, 2019ల్లో వరుసగా నెగ్గి హ్యాట్రిక్ కొట్టారు. యూపీఏ హయాంలో విదేశాంగ, మానవ వనరుల శాఖల సహాయ మంత్రిగా చేశారు. రాజీవ్‌తో చర్చకు సిద్ధమని ప్రకటించి రాజకీయ వేడిని మరింతగా పెంచారు.




- సాక్షి, నేషనల్ డెస్క్

మహిళా ఓటర్లే ఎక్కువ!

తిరువనంతపురం నిజయోకవర్గంలో పట్టణ జనాభా ఏకంగా 74 శాతం! గెలుపును నిర్ణయించేది పట్టణ ఓటర్లే. ఇక్కడ హిందువులు 65 శాతం, క్రైస్తవులు 25 శాతమున్నారు. ఇక్కడ మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ కావడం విశేషం! కేరళలో ఏప్రిల్ 26న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. దాంతో థరూర్, రాజీవ్ కాలికి బలపం కట్టుకుని సుడిగాలి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

మీ ఆరోగ్యానికి మాదీ భరోసా



రూ.5 లక్షల్లోపు వార్షికాదాయ వర్గాల వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపు

- ఏకంగా రూ.25 లక్షల విలువ చేసే వైద్య సేవలు ఉచితం
- వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఈ పథకం పరిధిలోకే..
- ప్రజారోగ్యానికి భరోసానిస్తూ ఆచరణలో చేసి చూపించిన జగన్
- దేశంలో ఎక్కడా లేనట్టుగా రాష్ట్రంలో 95 శాతం కుటుంబాలకు లబ్ధి
- గత ప్రభుత్వ హయాంలో 1,059 ప్రొసీజర్లతో అరకొరగా అమలు
- నేడు ఏకంగా 3,257 ప్రొసీజర్లతో బలోపేతం
- చికిత్స అనంతరం కోలుకునే వరకు 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా'తో ఆర్థిక తోడ్పాటు
- ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచిత వైద్యం
- ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం రూ.14,887 కోట్లు ఖర్చు

వైద్యం కోసం ఎక్కువగా పేదలు అప్పులపాలవుతుంటారు. ఆస్తులు అమ్ముకుంటుంటారు. ఆస్తులు లేని వారి పరిస్థితి ఏమిటి? ఏదైనా పెద్ద జబ్బు చేస్తే వాళ్లకు దిక్కెవరు? ఈ పరిస్థితి మన రాష్ట్రంలో ఎక్కడా ఉండకూడదు. వైద్యం అందక ఈ లోకాన్ని వీడారనే పరిస్థితి ఎక్కడా ఉండకూడదు. ఎంత డబ్బు ఖర్చు అయినా సరే మీ బిడ్డ ప్రభుత్వం భరిస్తుంది. పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందినా, ఒక్క రూపాయి ఖర్చు కాకుండా క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యతను మీ ప్రభుత్వమే తీసుకుంది. ఆస్పత్రులకు వచ్చే రోగుల విషయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వెనువెంటనే స్పందించాలి. మన ఇంట్లో వ్యక్తికి ఏదైనా జబ్బు చేస్తే ఎలాంటి చికిత్స అందాలని కోరుకుంటామో అలానే అందరికీ సేవలందించాలి. అందుకోసం ఈ ఐదేళ్లలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏకంగా 54 వేల మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాం.

ఇదీ ప్రజల ఆరోగ్యం పట్ల సీఎం వైఎస్ జగన్ తపన, తాపత్రయం

"రూ.5 లక్షల్లోపు వార్షికాదాయ వర్గాల వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపు. వైద్యం ఖర్చు రూ.1,000 దాటితే ఆరోగ్య శ్రీ కింద ఉచిత వైద్యం. హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, వంటి నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ పథకం కింద ఉచిత చికిత్సలు" అంటూ 2019 ఎన్నికల సమయంలో మేనిఫెస్టో ద్వారా చెప్పిన మాటను గత ఐదేళ్లుగా ఆచరణలో చేసి చూపించారు. వైద్యానికి డబ్బులు వెచ్చించే స్తోమత లేని లక్షలాది కుటుంబాలను 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం ద్వారా ఆదుకున్నారు. ఏకంగా రూ.25 లక్షల విలువ చేసే వైద్య సేవలను పథకం కింద పూర్తి ఉచితంగా అందించారు. గుండె, కిడ్నీ, న్యూరో, క్యాన్సర్ లాంటి ఎంత పెద్ద జబ్బులకైనా చేతి నుంచి చిల్లి గవ్వ ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖరీదైన చికిత్సలు అందించారు. కేవలం ఉచిత చికిత్సలు అందించడమే కాకుండా చికిత్సానంతరం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద విశ్రాంత సమయానికి భృతి ఇవ్వడం ద్వారా చేయూతనిచ్చారు. -వడ్డే బాలశేఖర్, సాక్షి ప్రతినిధి



దటీజ్ జగన్..

చిన్నారి వైద్యం కోసం రూ.కోటి

ఈ పాప పేరు హనీ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం నక్కా రామేశ్వరం. కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి దంపతుల కుమార్తె. కాలేయ సంబంధిత గాసెర్స్ (జన్యుపరమైన వ్యాధి) అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. ఎన్నో ఆస్పత్రులు తిరిగారు. ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చవుతుంది. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. ఓ దశలో పాప ప్రాణాలపై ఆశలు వదిలేశారు. ఆ పరిస్థితిలో.. సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తే పాప బతికేలా చర్యలు తీసుకుంటారని చుట్టుపక్కల వాళ్లు చెప్పారు. అది 2022 జూలై 26వ తేదీ. కోనసీమలోని వరద బాధిత ప్రాంతాలైన పి.గన్నవరం మండలంలోని ముంపు లంక గ్రామాల పర్యటనకు ముఖ్యమంత్రి జగన్ వచ్చారు. పర్యటన ముగించుకుని జి.పెదపూడిలోని హెలిప్యాడ్‌కు బయలుదేరారు. ఆ సమయంలో 'సీఎం గారూ.. మా పాపను కాపాడండి' అనే ప్లకార్డు పట్టుకుని చిన్నారి హనీని ఎత్తుకుని ఉన్న తండ్రి రాంబాబును వైఎస్ జగన్ చూసి స్పందించారు. వారిని దగ్గరకు పిలిచి ఆరా తీశారు. 'ప్రతి నెలా అత్యవసరంగా మూడు, నాలుగు ఇంజక్షన్లు చేయాలట. ఒక్కో ఇంజక్షన్ రూ.1.25 లక్షలవుతుంది. ఎలాగైనా మీరే ఆదుకోవాలి' అని రాంబాబు విన్నవించారు. అధైర్య పడొద్దని పాపకు వైద్యం చేయిస్తామని ధైర్యం చెప్పారు. రూ.కోటి మంజూరు చేశారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ద్వారా హనీకి ప్రత్యేక వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. సబ్సిడీతో ఇతర దేశాల నుంచి ఒక్కో ఇంజక్షన్‌ను రూ.75 వేలకు తెప్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నెలకు మూడు, నాలుగు చొప్పున ఇంజక్షన్లు చేస్తున్నారు. ఇప్పుడు ఆ చిన్నారి బరువు పెరిగి, క్రమేపీ సంపూర్ణ ఆరోగ్యం దిశగా కోలుకుంటోంది. ఇప్పుడు ఆ చిన్నారికి ఐదేళ్లు. ఆ చిన్నారి కోసం నెలకు రూ.10 వేలు పింఛన్ కూడా మంజూరు చేశారు. వీరికి ఇంకో అబ్బాయి ఉన్నాడు. పిల్లలిద్దరినీ ప్రభుత్వమే చదివిస్తోంది. - అమలాపురం టౌన్



గుసగుస

టన్నుల్లో భయం



'మొదటిసారి నాకు భయమేస్తోంది మామయ్యా.. జీవితంలో ఎమ్మెల్యే అవ్వకుండానే.. చచ్చిపోతానేమోనని'.. పవన్‌కల్యాణ్ గబ్బర్ సింగ్ సినిమాలోనిదే ఈ డైలాగ్. గత ఎన్నికల్లో పోటీ చేసిన రెండు చోట్ల పురుష అభ్యర్థుల చేతుల్లో ఓటమి చెందారు. పిఠాపురంలో ఆయనకు గెలుపుపై నమ్మకంల్లేవట. పైపెచ్చు మహిళా అభ్యర్థి చేతిలో ఓడిపోతే తలెత్తుకోగలనా? అంటూ సన్నిహితుల వద్ద వాపోయారట. తక్కువ (21) సీట్లకే లాలూచీ పడటంతో కాపుకాస్తారనుకున్న సొంత సామాజిక వర్గమే ఎదురు తిరుగుతోంది. దీంతో పిఠా పురంలో పవన్‌కు టన్నుల్లో ఓటమి భయం పట్టుకుందని స్థానికులు చెప్పుకుంటున్నారు.

గ'లాస్'



గాజువాక నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి గ్లాస్ గుర్తు షాకిచ్చేలా ఉంది. ఇక్కడ జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పల్లి శ్రీనివాసరావు బరిలో నిలుస్తున్నారు. తనకు గ్లాస్ గుర్తు కేటాయించాల్సిందిగా ఎన్నికల సంఘానికి విన్నవించుకున్నారు. పొత్తులో భాగంగా గాజువాకను టీడీపీ (పల్లా శ్రీనివాసరావు)కి జనసేన వదిలేసింది. జాతీయ జనసేన పార్టీ గత ఏడాది జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కూకట్‌పల్లిలో బకెట్ గుర్తుతో బరిలో నిలిచింది. బ్యాలెట్ పేపర్‌పై గ్లాస్, బకెట్ దగ్గర పోలికలతో ఉన్నాయి. గాజువాకలో ఇరు పార్టీల అభ్యర్థుల పేర్లు ఒకటే. దీంతో గ్లాసైనా, బకెట్ అయినా టీడీపీకి షాక్ తప్పదని గుసగుస.

ఈ ఐదూ పాయే..!



'నా బతుకు రోడ్డు వైడెనింగ్‌లో సగం కొట్టేసిన బిల్డింగ్‌లాగైపోయిందిరా.. ఉండడానికి పనికిరాదు.. వదలడానికి మనసురాదు'.. రావు రమేశ్ డైలాగ్‌ను చంద్రబాబు పదేపదే వల్లెవేస్తున్నారట. తాజాగా చేసిన ఉండి, పాడేరు, మాడుగుల, మడకశిర, వెంకటగిరి నియోజకవర్గాల మార్పులతో ఎలాంటి ఉపయోగం లేదని పార్టీ శ్రేణులు బాహాటంగానే పెదవి విరుస్తున్నాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గాల్లో గెలుపుపై ఆశలు వదిలేసుకున్నారు. తాజా మార్పుల వల్ల అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల రూపంలో పార్టీ నుంచి పైసా ఇవ్వక్కర్లేదని, అవకాశం ఉంటే వారి నుంచే ఎంతో కొంత పార్టీ ఫండ్‌గా వసూలు చేయొచ్చన్నదే అధినేత అభిప్రాయమట. దీంతో ముందస్తు ఓటమిలో జనసేన, బీజేపీలకు కేటాయించిన 31 సీట్లకు మరో ఐదు కలిశాయని చెప్పుకుంటున్నారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రెండుసార్లు ఉచితంగా శస్త్రచికిత్స


ముత్యాలపల్లి మణి

ఈమె పేరు ముత్యాలపల్లి మణి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం. చిన్నపాటి ఫ్యాన్సీ షాపు నడుపుకొంటూ జీవించే ఈమెకు చిన్న వయస్సులోనే గుండెకు సంబంధించి అనారోగ్య సమస్య ఏర్పడింది. 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డి దయతో ఆరోగ్యశ్రీ ద్వారా హైదరాబాద్ నిమ్స్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. 15 ఏళ్ల తర్వాత మళ్లీ గుండెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. తీవ్ర ఆందోళన చెందుతున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బలోపేతం చేసిన ఆరోగ్య శ్రీ ఈమెను మరోసారి బతికించింది. 2021లో హైదరాబాద్ సన్‌షైన్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతంగా చేశారు. ఈ ఆపరేషన్‌కు రూ.8 లక్షలు ఖర్చు అయింది. మొత్తం ఖర్చు ప్రభుత్వమే భరించింది. ఈమె ఆరోగ్యం ఇప్పుడు పూర్తిగా కుదుట పడింది.

(నాడు - నేడు ఆరోగ్య సేవలు ఇలా)


అంశం	టీడీపీ హయాంలో	ప్రస్తుతం
పరిధిలోకి వచ్చే లబ్ధిదారులు	కేవలం తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు	తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలతోపాటు, రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలు (1.42 కోట్లకు పైగా కుటుంబాలకు ప్రస్తుతం వర్తింపు)
హెల్త్ కార్డు జారీకి టైమ్‌లైన్	ఉండేది కాదు	దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లో వారి గుమ్మం వద్దకే స్మార్ట్ హెల్త్ కార్డు
ప్రొసీజర్స్	1,059	3,257
నెట్‌వర్క్ ఆస్పత్రులు	919	2371
ఇతర రాష్ట్రాల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులు	72	204
ప్రీ ఆథరైజేషన్‌కు సగటు సమయం	మూడు రోజుల వరకూ	24 గంటలలోపు
క్లైమ్ ప్రాసెసింగ్‌కు సగటు సమయం	60 రోజుల పైనే	21 రోజుల లోపు
ఖరీదైన ప్రొసీజర్స్	ఒక చెవికి కాక్లియర్, గుండె మార్పిడి	రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటి ఖరీదైన ప్రొసీజర్స్, వైద్య ఖర్చుతో సంబంధం లేకుండా క్యాన్సర్ రోగులకు కాంప్రహెన్సివ్ కేర్ సేవలు





45.10 లక్షల మంది ఆరోగ్యానికి అభయం

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ పథకం కింద 45,10,645 మందికి సీఎం జగన్ ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యాలకు అండగా నిలిచింది. ఇందుకోసం ఏకంగా రూ.13,421.43 కోట్లు పైగా ఖర్చు చేసింది. మరోవైపు చికిత్స పొందిన రోగులకు ఆరోగ్య ఆసరా కింద రూ.1,465.67 కోట్లు వెచ్చించారు. ఇలా ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం ఏకంగా రూ. 14,887 కోట్లకు పైగా ఖర్చు చేసి రికార్డు సృష్టించారు. అదే బాబు హయాంలో 2014-19 మధ్య అరకొర ప్రొసీజర్లతో రూ.5,177.38 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2020, 2021లో ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేసింది. ఈ వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా కరోనాకు సంబంధించిన 10 రకాల చికిత్సలను 2021 మే, జూన్ నెలల్లో ఆరోగ్యశ్రీలోకి చేర్చింది. రాష్ట్రంలో వైరస్ బారిన పడ్డ రెండు లక్షల మందికిపైగా బాధితులకు ఉచితంగా చికిత్స అందించింది. కోవిడ్ బాధితుల చికిత్స కోసం రూ.744 కోట్ల మేర ఖర్చు చేసింది.



ఇలాంటి సేవలు మరెక్కడా లేవు..


దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనట్టుగా ఒక్క ఏపీలోనే వైద్య ఖర్చులతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఆరోగ్య రక్షణ కల్పిస్తోంది. గత ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలు ఆరోగ్యశ్రీ తరహాలో ఉచిత వైద్యానికి హామీలు ఇచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, బీఆర్ఎస్ పార్టీ రూ.15 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని, బీజేపీ రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లోని పార్టీలు కూడా ఇలాంటి హామీలనే ఇచ్చాయి. అయితే దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.25 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకం కింద సీఎం జగన్ ప్రభుత్వం వైద్యం అందిస్తోంది. క్యాన్సర్ వంటి పెద్ద జబ్బులతో బాధపడే వారికి రూ.25 లక్షలు ఖర్చు అయినా సరే చికిత్సల భారాన్ని మొత్తంగా స్వీకరించింది. గతంలో క్యాన్సర్ చికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే డబ్బుపై రూ.5 లక్షల పరిమితి ఉండేది. ఆ తర్వాత ఎంత ఖర్చు అయినా రోగులే వైద్య ఖర్చులు భరించాల్సి ఉండేది.

ఆరోగ్యశ్రీతో ఉచితంగా ఖరీదైన శస్త్ర చికిత్సలు

ప్రొసీజర్	ఖర్చు	ఐదేళ్లలో చేపట్టిన మొత్తం కేసులు	చేసిన ఖర్చు (రూ.కోట్లలో)
బైలాట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్	రూ. 11,97,248	179	12.69
అల్లోజెనిక్ బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (14 ఏళ్లపైన)	రూ.11 లక్షలు	118	12.77
అల్లోజెనిక్ బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్(14 ఏళ్ల లోపు)	రూ.10 లక్షలు	110	10.88
గుండె మార్పిడి	రూ.10,77,510	13	1.38
ఆటో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఫర్ లింఫోమాస్	రూ.9,35,000	101	9.25
ఒక చెవికి కాక్లియర్ ఇంప్లాంట్	రూ.6,63,624	476	20.42
మైలోమా ఆటోలోగస్ హెచ్ఎస్‌సీటీ	రూ. 6.50 లక్షలు	125	7.95
ట్రాన్స్‌ప్లాంట్ ఫర్ పీడియాట్రిక్ సాలిడ్ క్యాన్సర్	రూ.6.50 లక్షలు	15	0.94

చికిత్స అనంతరం అండగా..

అనారోగ్యం కారణంగా ఏదైనా శస్త్ర చికిత్స చేయించుకున్న వారు కొద్ది కాలం బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో పౌష్టికాహారం తీసుకుంటే త్వరగా కోలుకుని తిరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారు. ఈ క్రమంలో రైతు, ఆటోవాలా, రోజువారీ కార్మిక కుటుంబంలో ఇంటి పెద్ద అనారోగ్యం బారినపడి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సి వస్తే ఆ ఇల్లు గడవడం కష్టంతో కూడుకుని ఉంటుంది. దీంతో ఇంటి అవసరాల రీత్యా వారు పూర్తిగా కోలుకోకుండానే తిరిగి పనుల్లో నిమగ్నం అయ్యే పరిస్థితులు ఉంటాయి. ఈ నేపథ్యంలో అనారోగ్య సమస్యలు భవిష్యత్‌లో మళ్లీ తిరగబడే అవకాశాలుంటాయి. దీన్ని గుర్తించిన సీఎం జగన్ ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు విశ్రాంత సమయంలో అండగా నిలిచేలా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1519 ప్రొసీజర్స్‌లో వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి రోజుకు రూ.225 చొప్పున, లేదా నెలకు గరిష్టంగా రూ.ఐదు వేలు చొప్పున ప్రభుత్వం జీవన భృతి అందిస్తోంది. రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజున బ్యాంక్ ఖాతాలో ఆసరా మొత్తాన్ని జమ చేస్తున్నారు. 2019 డిసెంబర్ 12వ తేదీ నుంచి ఇప్పటి వరకు 24,59,090 మందికి రూ.1,465.75 కోట్ల మేర సాయం అందించారు. అంతకు ముందు బాబు జమానాలో ఈ తరహాలో నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఏనాడు అండగా నిలవలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



కొత్తగా 2,198 ప్రొసీజర్స్

సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రూ.వెయ్యి వైద్యం ఖర్చు దాటిన చికిత్సలన్నింటినీ ఆరోగ్య శ్రీ పథకం పరిధిలోకి తెచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా 95 శాతం (1.49 కోట్ల కుటుంబాలకు) ఆరోగ్య భద్రత కల్పించారు. బాబు పాలనలో 1059గా ఉన్న ప్రొసీజర్‌లను 2020 జనవరిలో తొలుత 2059కి పెంచారు. అనంతరం అదే ఏడాది జూలైలో 2,200కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీనిద్వారా 54 క్యాన్సర్ చికిత్సలు పథకంలో అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు 2020 నవంబర్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటి పలు పెద్ద చికిత్సలతో ప్రొసీజర్ల సంఖ్యను 2,436కు పెంచారు. పది రకాల కరోనా చికిత్సలను పథకంలోకి చేర్చడంతో ప్రొసీజర్లు 2,446కు చేరాయి. 2022లో మరో 811 చికిత్సలను చేర్చడంతో ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్ల సంఖ్య 3,257కు చేరింది. ఇలా ఏకంగా 2,198 ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీలో చేర్చి మొత్తం 3,257 ప్రొసీజర్లతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.

ఆ రోజులకు చెల్లు...

కనుమరుగైన జేసీ, పరిటాల కుటుంబాల ప్రాభవం

- ఫ్యాక్షన్ రాజకీయాలను పెంచి పోషించినందుకు ప్రజల నుంచి నిరసన
- మూడు దశాబ్దాలుగా గ్రామాల్లో చిచ్చుపెట్టి హత్యలను ప్రోత్సహించిన జేసీ సోదరులు
- పరిటాల రవి హయాంలో ఫ్యాక్షన్ మంటల్లో ఎందరో అమాయకులు బలి
- జిల్లాను శాసించిన ఈ రెండు కుటుంబాలకూ ఇప్పుడు గడ్డు కాలం
- సీట్లు ఇప్పించే స్థాయి నుంచి ఇచ్చిన సీటు గెలవలేని దుస్థితి
- తాడిపత్రి, రాప్తాడులో ఏటికి ఎదురీదుతున్న వైనం.. అనంతపురం టీడీపీ ఎంపీ టికెట్ కోసం జేసీ పవన్ విఫలయత్నం
- ఈసారి రాప్తాడు టీడీపీ టికెట్ సునీతకు కాదు ఆమె కుమారుడికంటూ ప్రచారం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకుంటున్న పరిస్థితి ఇప్పుడు రివర్స్ అయింది. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాను శాసించిన రెండు కుటుంబాలు ఇప్పుడు ప్రాభవం కోల్పోయి ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కొంటున్నాయి. తమ రాజకీయ స్వలాభం కోసం ఎన్నో కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి చలి కాచుకున్న వీళ్లు ఇప్పుడు రాజకీయంగా దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ కుటుంబాలు ప్రజల్లోకి వెళుతూంటే ఛీత్కారాలు ఎదురవుతున్నాయి. ఈ రెండు కుటుంబాలు ఎవరో కాదు.. తాడిపత్రిలో జేసీ దివాకర్‌రెడ్డి సోదరులు, రాప్తాడులో పరిటాల సునీత కుటుంబం. ప్రాభవం గతం..వర్తమానం అంధకారం అన్నరీతిలో వీళ్ల పరిస్థితి ఉంది.

30 ఏళ్లుగా పెత్తనం చేసి...

జేసీ సోదరులు 30 ఏళ్లు రాజకీయాలను శాసించారు. ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. ఎదురొచ్చిన వారిని చేతికి మట్టి అంటకుండా ఆ గ్రామంలోనే మరో వర్గాన్ని ఎగదోసి చేయాల్సింది చేయించారు. బస్సుల పేరుతో కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారు. ఒక బస్సుకు అనుమతి ఉంటే ఎనిమిది బస్సులు తిప్పారు. మైనింగ్‌ను, ఇసుకను చేతుల్లో పెట్టుకున్నారు. 2014 దాకా కాంగ్రెస్‌లో.. ఆ తర్వాత టీడీపీలోకి ఫిరాయించి దౌర్జన్యాలు చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులను బెదిరించారు. అప్పట్లో ఆర్డీవో స్థాయి వ్యక్తి సైతం ఇంటి వద్దకే ఫైళ్లు తీసుకొని వెళ్లే దుస్థితి ఉండేదని అధికారులు చెబుతున్నారు. తమకు ఎదురే లేదనుకున్నారు. కానీ 2019లో జేసీ సోదరులు దారుణంగా ఓడిపోవడం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జేసీ సోదరుల అక్రమాలు బయటకు వచ్చా యి. ఒకప్పుడు ప్రచారానికి వెళ్లకపోయినా గెలుస్తామన్న అహంకారంతో ఉండేవారు. ఇప్పుడు తండ్రీ కొడుకులు (జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి) కాలికి బలపం కట్టుకుని ప్రతి ఇల్లూ తిరుగుతూ ఓట్లు అడుక్కుంటున్నారు. అయినా సరే ఇక్కడ వారికి గెలుపు ఎండమావిలానే కనిపిస్తోంది. జేసీ దివాకర్ రెడ్డి చాలా రోజులుగా సైలెంట్ అయ్యారు. విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన కుమారుడు జేసీ పవన్ అనంతపురం టీడీపీ ఎంపీ టికెట్ కోసం ఇప్పటికీ విఫలయత్నాలు చేస్తూనే ఉన్నారు.



ఆ మారణ హోమం మాకొద్దు

పరిటాల రవి..ఈ పేరు చెబితేనే అనంతపురం జిల్లాలో హత్యారాజకీయాలు గుర్తుకొస్తాయి. వందల మంది కనిపించకుండా పోయారు. వారి కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం. జిల్లాలో తనకు రాజకీయంగా, ఆర్థికంగా ఎవరు అడ్డొచ్చినా వారిని నిర్దాక్షిణ్యంగా ఊచకోతలు కోశారన్న విమర్శలు వినిపిస్తాయి. పరిటాల రవి హయాంలో ఆర్‌ఓసీ పేరుతో ఊచకోతలు ఎన్నో జరిగాయి. రమారమి 700కు పైగా మిస్సింగ్ కేసులు ఉన్నాయి. వీళ్ల పదిహేనేళ్లుగా లేరు. ఎక్కడికెళ్లారో, ఉన్నారో లేదో తెలియదు. పరిటాల మరణానంతరం రాప్తాడులో ఆయన భార్య సునీత గెలిచారు. మంత్రి అయ్యారు. 2019లో ఓడిపోయారు. ఈ కుటుంబం అంటేనే ఇక్కడి ప్రజలు భయపడుతున్నారు. పాత రోజులు మాకొద్దు అంటున్నారు. గడిచిన ఐదేళ్లుగా రాప్తాడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, పరిటాల కుటుంబం గెలిస్తే మళ్లీ హత్యారాజకీయాలు మొదలవుతాయని ప్రజలు భయపడుతున్నారు. ప్రధానంగా పరిటాల శ్రీరామ్ వ్యవహార శైలిని రాప్తాడు ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. జిల్లాలో పరిటాల రవి హయాంలో ఎవరికి ఎమ్మెల్యే సీటు చెబితే వారికే ఇవ్వాలి...కానీ ఇప్పుడు ఇచ్చిన సీటు గెలవడమే గగనమైంది. పరిటాల పేరు చెబితే ఓట్లు వేసే రోజులు లేవు. మాకు మంచి ప్రభుత్వం కావాలి, మా బాగోగులు చూసే ప్రభుత్వం కావాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈసారి రాప్తాడు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పరిటాల సునీత పేరును పార్టీ ప్రకటించినప్పటికీ, రేపో మాపో ఆమె స్థానంలో ఆమె కుమారుడు పోటీ చేస్తారనే ప్రకటన వస్తుందని ప్రచారం జరుగుతోంది.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 22-4-2024



మంచిమాట

శరీరమాద్యమ్ ఖలు ధర్మసాధనం

ధర్మాచరణానికి శరీరమే మొదటి సాధనం. శరీరం లేకపోతే ఏమీ చేయటం కుదరదు. అది వ్యక్తిగత ధర్మం కాని, ఉద్యోగ ధర్మం కాని, కర్తవ్య నిర్వహణ కాని ఏది నిర్వర్తించటానికైనా శరీరం అన్నది ఉండాలి కదా! శరీరం వదిలిన తరువాత ఏం చేయగలరు? ఎట్లా చేయగలరు?

శరీరం కదలలేని పరిస్థితిలో ఉంటేనే చేయాలనుకున్నది చేయలేరు. శరీరమే లేకుంటే ఎట్లా? ఈ సత్యాన్నే శివుడు తీవ్రంగా తపస్సు చేస్తున్న పార్వతితో తపస్సు విరమించమంటూ చెప్పిన మాట – ''శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం'' అని. కఠినమైన తపోనిష్ఠకి నియమాలకి తట్టుకోలేక శరీరం రాలి పడిపోతే తపస్సు చేయటానికి అవకాశమే లేదు కదా! ఇక సాధించేది ఏముంది? ఒకవేళ తరవాత ఫలితం వచ్చినా ఎవరు అనుభవిస్తారు? ఏదైనా సాధించాలన్నా, సిద్ధించిన దానిని అనుభవించాలన్నా భౌతిక శరీరం ఉండాలి.

ఇదే మాటని సీతాన్వేషణ ఫలించలేదు, అనుకున్నది సాధించకుండా తిరిగి వెళ్ళటం కన్న ప్రాణాలు వదలటం మంచిది అనుకున్న హనుమ, పునరాలోచన చేసి ఈ విధంగా నిశ్చయించుకుంటాడు.

ప్రాణములను విడువ
బహుదోషములు గల్గు
బ్రదికి యున్న గాదె
పడయు శుభము గాన
దాల్చువాడ మేన ప్రాణంబులు
బ్రదికి యున్న భద్ర మొదవు నిజము.
– (మందరం – వావిలికొలను సుబ్బారావు గారి రామాయణం – సుందర కాండం)

కాలు లేనివాడు కదల లేడు. నోరు లేనివాడు పలక లేడు. కన్ను లేనివాడు చూడ లేడు. పాప కార్యం జరుగుతుంటే ఆపటానికి పరుగు పెట్టాలంటే - కాళ్ళు ఉండాలి. మందలించటానికి నోరు ఉండాలి. లేనివాడు అది అధర్మం అని తెలిసినా చేయగలిగింది ఏమీ ఉండదు. ఆలోచనకి మనసు ఎంత ముఖ్యమో, ఆచరణకి శరీరం అనే పరికరం అంత ముఖ్యం.

హనుమ నిస్పృహలో శరీరం వదిలేస్తే సీతని చూడటం, రావణ సంహారం జరిగేవా? అందుకే ''జీవితం మరణాచ్ఛ్రేయో జీవన్ ధర్మ మవాప్నుయాత్'' (మరణం కన్న జీవితం మేలైనది. బ్రతికి ఉంటే ధర్మాన్ని ఆచరించవచ్చు) అంటుంది మహాభారతం – విశ్వామిత్ర చండాల సంవాదంలో. అంతే కాదు ''బ్రదికి యుండిన శుభముల బడయ వచ్చునని కూడా ఉపదేశిస్తుంది. నిజానికి చచ్చి సాధించేది ఏముంది?

''శరీరం ధర్మ సర్వస్వం, రక్షణీయం ప్రయత్నతః శరీరాత్ ప్రవతే ధర్మః పర్వతాత్ సలిలం యథా'' అంటాడు శంఖుడు. (శరీరమే ధర్మసర్వస్వం, కనుక ప్రయత్నపూర్వకంగా కాపాడుకో తగినది అంటే తప్పక కాపాడుకొని తీరాలి. పర్వతం నుండి నీరు జాలువారిన విధంగా శరీరం నుండి ధర్మం ప్రవహిస్తుంది) అంటే ధర్మాచరణ కోసం శరీరాన్ని తప్పక జాగ్రత్తగా కాపాడుకోవాలి.


ధర్మం అన్న ప్రాతిపదిక మీద మిగిలిన పురుషార్థాలు వర్తించి నప్పుడే కదా చివరి పురుషార్థమైన మోక్షం సిద్ధించేది. ధర్మాచరణకి పనిముట్టు అయిన శరీరాన్ని రక్షించటానికి ద్రష్టలు మనకి అందించినదే వైద్య శాస్త్రం. దీనినే భారతీయులు ఆయుర్వేదం అన్నారు. ''హృదయం యంత్ర సంకాశం, ఆత్మా విద్యుత్ సమొ మతః
ఆత్మనో హృదయే చేష్టా,
యంత్రే చేష్టా చ విద్యుతః'' –
కావ్యకంఠ గణపతి ముని

కావ్యకంఠ గణపతి ముని హృదయాన్ని యంత్రంతో పోల్చారు. ఆత్మ దానిని నడిపే విద్యుత్తు. గుండె మొదలు అన్ని అవయవాలు శరీరం అనే యంత్రంలో భాగాలు, వాటిని నడిపే విద్యుచ్ఛక్తి ఆత్మ అని ఎంత బాగా చెప్పారో కదా! ఈ యంత్రాన్ని జాగ్రత్తగా కాపాడుకుందాం!

– డా. ఎన్. అనంతలక్ష్మి

తాత్త్వికకథ

ఎగిరిపోవడం చిలుక నైజం



తనకి వృద్ధాప్యం సమీపిస్తున్నదని గుర్తించాడు ఓ రాజు. అప్పటినుంచీ అతడికి మరణం గురించి దిగులు పట్టుకుంది. వెళ్ళి ఓ ఆధ్యాత్మిక గురువును కలిశాడు.

చిన్ననవ్వు నవ్విన గురువు ''మీ ప్రాణభయం దిగులు పోయే చిన్న సలహా ఇస్తాను. పాటించండి. మీ సేవకులను పంపి అడవిలో ఒక అందమైన చిలుకను పట్టుకు రమ్మనండి. దాన్ని పంజరంలో పెట్టి బాగా చూసుకోండి'' అని చెప్పి పంపాడు. మూడు నెలల తర్వాత రాజు, ఫల పుష్పాదులతో గురువును కలిశాడు.

''ఎలా ఉంది మీ చిలుక?'' అని ప్రశ్నించాడు గురువు. రాజు ఎంతో గొప్పగా ''మా అదృష్టం కొద్దీ చక్కటి చిలుక దొరికింది. ఆ చిలుకకు అందమైన బంగారు పంజరం చేయించాము. మంచి గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో దాన్ని ఉంచాము. అతి మధురమైన ఫలాలు, శ్రేష్ఠమైన తృణధాన్యాలూ పెడుతున్నాము. అది మమ్మల్ని చాలా ఇష్టపడుతుంది. ఎంతో గౌరవాభిమానాలు ప్రదర్శిస్తుంది. దానికి మాపైన ఎంత ప్రేమంటే ఇక ఎప్పటికీ అది మమ్మల్ని విడిచిపోదు. మా మీద దానికి, దానిమీద మాకు ఎంతో నమ్మకం కలిగింది'' అని చెప్పాడు.

''చాలా సంతోషం. ఇకపై ప్రతి ఆదివారం దాని పంజరం తెరిచి ఉంచండి. ఎందుకంటే అది మిమ్మల్ని, దాన్ని మీరు నమ్మారు కాబట్టి అది ఎక్కడికీ ఎగిరి వెళ్ళకపోవచ్చు'' అని చెప్పాడు. మరుసటి ఆదివారం సాయంత్రమే రాజు ఆఘమేఘాల మీద గురువు దగ్గరకు వచ్చాడు. చిలుక ఎగిరిపోయిందని బాధగా చెప్పాడు.

గురువు చిన్న నవ్వు నవ్వి ''ఎగిరిపోవడం దాని నైజం. ఎంత మంచి చిలుకైనా, మనం పంజరంలో దానికి ఎన్ని సౌకర్యాలు కల్పించినా అది ఎప్పటికైనా అడవిలోకి ఎగిరిపోయేదే. దాన్ని బంగారు పంజరంలో ఉంచినా, మంచి సదుపాయాలు, ఆహారం ఏర్పాటు చేసినా వెళ్ళేటప్పుడు ఎవ్వరికీ చెప్పదు. ఏమీ తీసుకెళ్ళదు కూడాను.

అలాగే ఈ దేహమనే పంజరం నుంచి జీవమనే చిలుక కూడా... ఎప్పుడైనా ఎగిరిపోతుంది. ఈ దేహం అశాశ్వతమని తెలిసి కూడా ఎందుకు బాధపడుతావు. బాధపడటం మానేయ్. ఈ ప్రపంచంలో అందరూ పంజరంలోని చిలుకలే. చెప్పాపెట్టకుండా పంజరాన్ని వీడి వెళ్ళే వాళ్ళే'' అని హితోపదేశం చేశాడు.

మన జీవం, ఈ దేహంలో ఉండేది తాత్కాలికమేనని, ఏ క్షణమైనా వీడి వెళ్తుందని, దానికోసం చింతించాల్సిన అవసరం లేదనీ గుర్తించాడు రాజు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి పత్రికలో...!!!






సమాజంలో ఎంత కీర్తి ప్రతిష్ఠలున్నాయి, వారు ఎంత డబ్బు సంపాదించారు, విధి నిర్వహణలో ఎంత అద్భుతంగా రాణించారు... వంటి విషయాలకన్నా... ఎక్కువ విలువ దేనికిస్తారు.. అంటే... వాళ్ళది ఎంత అన్యోన్య దాంపత్యం! వారు సంతానంతో కలిసి ఎంత బాగా బతకగలిగారు! వాళ్ళు సమాజానికి ఎంత సేవ చేసారు! ఎంత త్యాగం చేసారు! కుటుంబాన్ని నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి ఎంత శ్రమించారు! అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ బాధ్యతలను నెరవేరుస్తూ వారిని ఎంత ప్రేమగా చూసుకున్నారు! తల్లిదండ్రులను ఎంత గౌరవించారు! గురువులంటే వారికి ఎంత అభిమానం!... వంటి అంశాలనుబట్టి వారికి సమాజం విలువ కడుతుంటుంది. దానికి గుర్తు..''మా అబ్బాయిని పెళ్ళి కొడుకును చేస్తున్నాం. మీరు వచ్చి తలమీద చమురు పెట్టాలమ్మా... మీ దంపతులు వచ్చి వారి తలమీద నాలుగు అక్షింతలు వేసి ఆశీర్వదించాలమ్మా !'' అని అడగడం. ఎవరిని అడుగుతారు అలా... గృహస్థాశ్రమాన్ని పండించుకున్న వాళ్ళను మాత్రమే అడుగుతారు. కొత్తగా గృహస్థాశ్రమ స్వీకారం చేస్తున్నవారికి వారు మార్గదర్శకులవుతారు. అలాకాక సమాజంలో ఉంటూ దాంపత్య జీవితాన్ని పాడుచేసుకున్న కొందరుంటారు. వారి ప్రభావం పిల్లల మీద పడిపోతుందని నలుగురు భయపడుతుంటారు. అది సమాజం భ్రష్టం కావడానికి కారణం అవుతుంది.

అందుకే గృహస్థాశ్రమ పరిసరాల్లో ఇంకా పరిపక్వత రాని పిల్లల మధ్య .. ఒక స్త్రీపురుషుల జంట భౌతికంగా ఒకరిమీద మరొకరు ఇష్టపడి దాంపత్య జీవితం గడపవచ్చు.. అని పెద్దలు చెప్పలేదు. ప్రాతఃస్మరణీయులు, కంచి కామకోటి పీఠానికి ఆధిపత్యం వహించిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు తరచుగా ఒక మాట అంటూండే వారు...'' నిజానికి దేముడొక్కడే. కానీ ఆదర్శంగా నిలబడడానికి దంపతులుగా దర్శనం ఇస్తాడు. మనం కూడా 'దంపతులు'గానే ఆవాహన చేస్తాం. అసలు గృహస్థాశ్రమ ప్రవేశం చేయించే ముందు.. సీతారాముల ధ్యానశ్లోకం లేకుండా 'శుభలేఖ' రాయవద్దు.. అని చెబుతుండేవారు. గృహస్థాశ్రమం అంటే సీతారాములే. ''సీతారాములనుంచి పిల్లలు బాగా తెలుసుకునేటట్లు చూడండి. వాళ్ళకు జీవితం మీద మంచి అవగాహన కలుగుతుంది'' అని కూడా చెబుతుండేవారు.

గృహస్థాశ్రమ ప్రవేశం చేయడానికి ఒక పిల్లవాడికి, ఒక పిల్లకు ఉండవలసిన సాధారణ లక్షణాలు ఐదింటిని శ్రీ రామాయణంలోనే నిర్దేశించారు. ఈ ఐదూ కలిస్తే తప్ప పెళ్ళి ప్రయత్నం చేయకు, వాళ్ళు ఇబ్బంది పడతారు.... అని ఉద్బోధించారు. పెళ్ళి పత్రికలో– ఫలానా వారి అబ్బాయికి ఫలానా వారి అమ్మాయినిచ్చి వివాహం జరిపించడానికి ''పెద్దలు నిర్ణయించారు. కావున...'' అని ఉంటుంది. ఎవరీ పెద్దలు? వాళ్ళు నిర్ణయించేదేమిటి.. అంటే... పెద్దలు అంటే శాస్త్రం తెలిసిన వారు. శాస్త్రం చెప్పిన ఐదు అర్హతలు ఆ ఇద్దరిలో సమతూకంలో ఉన్నాయా లేదా... అనేది వారు చూస్తారు. వధూవరులు, వారి కుటుంబీకులు, పూర్వీకులు, పుట్టబోయే సంతానం అందరూ సంతోషించేలా వారు ఆదర్శంగా బతకాలని కోరుతూ పదిమంది వచ్చి ఆశీర్వదించాలంటే ఈ ఐదు అర్హతలు ఉండేలా పెద్దలు చూసి నిర్ణయిస్తారు... అని దాని అర్థం.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

మ..మ.. మాస్


● అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'పుష్ప'. ఈ మూవీ తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం 'పుష్ప' మలిభాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ సినిమా చిత్రీకరణ కూడా తుది దశకు చేరుకుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. మైత్రీమూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న థియేటర్స్‌లో విడుదల కానుంది. అయితే ఈ నెల 8న అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే ఇప్పుడు మే మొదటి వారంలో ఈ సినిమా నుంచి ఓ మాస్ పాటను రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట చిత్రయూనిట్. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్, సునీల్, జగపతి బాబు, అనసూయ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్‌తో స్టార్ట్


● సూర్య

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సూర్య కెరీర్‌లో ఇది 44వ చిత్రం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ పనులను ఈ వేసవిలోపు పూర్తి చేసి, జూన్ నుంచి సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలని కార్తీక్ సుబ్బరాజ్ అండ్ టీమ్ సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం. ప్రేమ, నవ్వు, యుద్ధం.. అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగనుంది. తొలుత యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించాలని కార్తీక్ సుబ్బరాజ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిలింస్ నిర్మించనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల కానుందట. ఇక సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'కంగువ' ఈ ఏడాది విడుదలకు రెడీ అవుతోంది. అలాగే దర్శకులు వెట్రిమారన్, సుధా కొంగరలతో సినిమాలు చేసేందుకు సూర్య గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం కూడా తెలిసిందే. అయితే ఈ సినిమాల చిత్రీకరణలు కొన్ని కారణాల వల్ల ఆలస్యంగా ప్రారంభంకానున్నాయి.

అశ్వత్థామ


● అమితాబ్ బచ్చన్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపిక పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కథాంశంతో వైజయంతీ మూవీస్‌పై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రం నుంచి అమితాబ్ బచ్చన్ పాత్ర అశ్వత్థామకు సంబంధించిన వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. గుబురు గడ్డం.. పాత దుస్తులు.. మొహం కనిపించకుండా కళ్లు మాత్రమే కనిపిస్తున్న అమితాబ్ లుక్ బాగుంది. కాగా మహా శివరాత్రి సందర్భంగా ఈ మూవీలో ప్రభాస్ నటిస్తున్న భైరవ పాత్రని పరిచయం చేస్తూ టీమ్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా అమితాబ్ అశ్వత్థామ వీడియోకి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమాని జూన్‌లో విడుదల చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్.

మళ్లీ షురూ


● వెట్రిమారన్, లారెన్స్

హీరో రాఘవా లారెన్స్ ఫుల్‌జోష్‌లో ఉన్నారు. ఇటీవల తమిళ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 'బెంజ్','హంటర్' సినిమాలకు పచ్చజెండా ఊపినట్లు ప్రకటించారు లారెన్స్. తాజాగా 'అధిగారం' (తెలుగులో 'అధికారం') సినిమా షూటింగ్‌ను మళ్లీ షురూ చేయనున్నట్లు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు లారెన్స్. ''అధికారం' షూటింగ్ స్క్రిప్ట్‌ను వెట్రిమారన్ సార్ వినిపించారు. ఈ అద్భుతమైన స్క్రిప్ట్‌తో సినిమాను మొదలు పెట్టడానికి ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నాను. ఇటీవల నేను ప్రకటించిన రెండు సినిమాలు ('బెంజ్', 'హంటర్'లను ఉద్దేశిస్తూ..) పూర్తికాగానే 'అధికారం' షూటింగ్‌లో పాల్గొంటాను'' అంటూ పోస్ట్ చేశారు లారెన్స్. అయితే వెట్రిమారన్ కథతో ఆర్‌ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో 'అధికారం' సినిమాని లారెన్స్ గతంలోనే ప్రారంభించారని, కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ అప్పట్లో ఆగిపోయిందని కోలీవుడ్ టాక్. తాజాగా మళ్లీ షురూ కానుంది. అయితే ఈ సినిమాకు ఆర్‌ఎస్ దురై సెంథిల్ కుమారే దర్శకత్వం వహిస్తారా? లేదా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

వీర ధీర శూరన్‌లో..


● సిద్ధిఖీ

విక్రమ్ హీరోగా ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో 'వీర ధీర శూరన్: పార్ట్ 2' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కాళి పాత్రలో విక్రమ్ నటిస్తున్న ఈ సినిమాలో ఎస్‌జే సూర్య, దుషార విజయన్ లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. ఈ సినిమాలో మలయాళ విలక్షణ నటుడు సిద్ధిఖీ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రయూనిట్ ఆదివారం ప్రకటించింది. మలయాళం, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో సిద్ధిఖీ దాదాపు 350పైగా సినిమాల్లో నటించారు. తెలుగులో 'అంతిమతీర్పు', 'నా బంగారు తల్లి' వంటి సినిమాల్లో నటించి, ప్రేక్షకుల్ని మెప్పించారాయన. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

అలాంటి పాత్రలంటే ఇష్టం

– మానుషీ చిల్లర్



''**ఓ** నటిగా అన్ని పాత్రలు చేయాలనుంది.. ప్రత్యేకించి 'యానిమల్' సినిమాలో రష్మిక నటించిన గీతాంజలి వంటి క్యారెక్టర్స్, నన్ను సవాల్ చేసే పాత్రలు చేయాలని ఉంది'' అని హీరోయిన్ మానుషీ చిల్లర్ అన్నారు. అక్షయ్ కుమార్, పృథ్వీరాజ్ సుకుమారన్, టైగర్ ష్రాఫ్, మానుషీ చిల్లర్, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'బడే మియాన్ ఛోటే మియాన్'. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మానుషీ చిల్లర్ మాట్లాడుతూ–''డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సినిమాలంటే చాలా ఇష్టం. అవకాశం వస్తే ఆయన చిత్రాల్లో నటించాలనుంది. ఇటీవల 'యానిమల్' సినిమా చూశా. కుటుంబంలో కలతలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడే గీతాంజలి పాత్రలో రష్మిక నటన అద్భుతం. నటిగా నన్ను సవాల్ చేసే అలాంటి పాత్రలు చేయాలని ఉంది. అదేవిధంగా 'కబీర్ సింగ్'లో ('అర్జున్ రెడ్డి' మూవీ హిందీ రీమేక్) హీరోయిన్ పాత్ర కోసం మేకర్స్ తొలుత నన్నే సంప్రదించారు. షాహిద్ కపూర్ మూవీలో అవకాశం వచ్చిందని తెలియక తిరస్కరించాను. పైగా అదే సమయంలో నేను ప్రపంచ సుందరి కిరీటం అందుకున్నా. ఆ కారణంతో కూడా 'కబీర్ సింగ్' లో నటించలేకపోయాను'' అన్నారు.

రహస్యం ఏంటి?

'హ్యాపీ డేస్', 'కొత్త బంగారులోకం' చిత్రాల ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అన్నది ఉపశీర్షిక. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్, 'ఛత్రపతి' శేఖర్, శ్రేయా రాణిరెడ్డి, దుర్గా అభిషేక్ కీలక పాత్రల్లో నటించారు. ది ఫర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్‌పై రాజేష్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను నటుడు తనికెళ్ల భరణి రిలీజ్ చేసి, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ జగన్నాథం మాట్లాడుతూ– ''మంచి కథ, కొత్త కథాంశంతో రూపొందిన చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. అలాంటి ఓ కొత్త కాన్సెప్ట్‌తో వాస్తవ ఘటనల ఆధారంగా 'నింద' రూపొందించాం. మా మూవీ ఫైనల్‌కాపీ సిద్ధమైంది. ఇప్పటికే ఇండస్ట్రీలోని ప్రముఖులకు సినిమా చూపించగా మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కించారని ప్రశంసించారు. త్వరలోనే మా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, కెమెరా: రమీజ్ నవీత్.


● తనికెళ్ల భరణి, వరుణ్ సందేశ్

నేను హీరో కాదు.. కథే హీరో

– అజయ్ ఘోష్


● అజయ్ ఘోష్, చాందినీ చౌదరి

''మ్యూజిక్ షాప్ మూర్తి' సినిమా నాతోనే చేయాలని డైరెక్టర్ శివ మూడేళ్లు తిరిగాడు. నేను హీరో ఏంటి? అన్నాను. కానీ కథ విన్నాక, మూవీ సెట్స్ మీదకు వచ్చాక ఈ సినిమా గొప్పదనం తెలిసింది. ఇందులో ఒక జీవితం కనిపిస్తుంది. ఈ మూవీలో నేను హీరో కాదు. కథే హీరో. మేం మా పాత్రలు పోషించామంతే'' అని నటుడు అజయ్ ఘోష్ అన్నారు. శివ పాలడుగు దర్శకత్వంలో అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో భానుచందర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఫ్లై హై సినిమాస్‌పై హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ అజయ్ భూపతి విడుదల చేసి, మాట్లాడుతూ–''అజయ్ ఘోష్‌గారు కోటా శ్రీనివాసరావుగారి స్థాయికి ఎదిగే సత్తా ఉన్న నటుడు'' అన్నారు. ''ఈ మూవీలో హీరోయిన్ తండ్రిగా చేశాను'' అన్నారు భానుచందర్. ''మా సినిమా ప్రేక్షకుల్ని నిరాశపరచదు'' అన్నారు చాందినీ చౌదరి. ''ఓ మంచి చిత్రం తీయాలనే ఈ కథను ఎంచుకున్నాం'' అన్నారు హర్ష గారపాటి. ''నన్ను నమ్మి ఈ సినిమా నిర్మించిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు శివ పాలడుగు.

వాస్తవ ఘటనలతో...

''**జార్జ్** రెడ్డి' మూవీ ఫేం డైరెక్టర్ జీవన్ రెడ్డి అందించిన కథతో 'సింగరేణి జంగ్ సైరెన్' అనే సినిమా తెరకెక్కనుంది. 'ది అండర్ గ్రౌండ్ లైవ్స్' అనేది ట్యాగ్ లైన్. ఈ మూవీ ద్వారా వివేక్ ఇనుగుర్తి దర్శకునిగా పరిచయం కానున్నారు. ధూమ్ర వారాహి బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందనుంది. ''1999లో సింగరేణిలో జరిగిన ఒక వాస్తవ ఘటన ఆధారంగా 'ది అండర్ గ్రౌండ్ లైవ్స్' సినిమా తెరకెక్కనుంది. ఈ సర్వైవల్ డ్రామా మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే సినిమాని సెట్స్ పైకి తీసుకెళతాం. ఈ చిత్రంలోని నటీనటులు, ఇతర వివరాలు ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడే(మే 1)న ప్రకటించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రాకీ వనమాలి, సంగీతం: సురేష్ బొబ్బిలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: లలన్ మహేంద్ర, టి.మురళి రఘువరన్.

సాక్షి
సోమవారం
22-4-2024

స్పోర్ట్స్



పారిస్ ఒలింపిక్స్‌కు రోయర్ బల్‌రాజ్ అర్హత

పారిస్ ఒలింపిక్స్ రోయింగ్ క్రీడాంశంలో భారత్‌కు తొలి బెర్త్ లభించింది. దక్షిణ కొరియాలో ఆదివారం జరిగిన వరల్డ్ ఆసియా ఓసియానియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఇండియన్ ఆర్మీకి చెందిన 25 ఏళ్ల బల్‌రాజ్ పన్వర్ మూడో స్థానంలో నిలిచాడు. పురుషుల సింగిల్ స్కల్ 2000 మీటర్ల రేసును హరియాణాకు చెందిన బల్‌రాజ్ 7ని:01.27 సెకన్లలో ముగించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు.

చైనా గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్‌దే విజయం



ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ తన జోరు కొనసాగిస్తూ నాలుగో విజయాన్ని సొంతం చేసుకున్నాడు. షాంఘైలో ఆదివారం జరిగిన సీజన్ ఐదో రేసు చైనా గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 56 ల్యాప్‌లను ఒక గంటా 40 నిమిషాల 52.554 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, పెరెజ్ (రెడ్‌బుల్) మూడో స్థానంలో నిలిచారు. తదుపరి రేసు మయామి గ్రాండ్‌ప్రి మే 5న జరుగుతుంది.

ఆధిక్యంలో గుకేశ్



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో 13వ రౌండ్ తర్వాత భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 8.5 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉన్నాడు. అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన 13వ రౌండ్ గేమ్‌లో తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల గుకేశ్ 63 ఎత్తుల్లో గెలిచాడు. నిపోమ్‌నిషి (రష్యా), నకమురా, కరువానా (అమెరికా) 8 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. 13వ రౌండ్‌లో భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద 89 ఎత్తుల్లో కరువానా చేతిలో ఓడగా... అబసోవ్ (అజర్‌బైజాన్)తో జరిగిన గేమ్‌ను విదిత్ 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. మహిళల విభాగంలో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ హంపి 45 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... వైశాలి 67 ఎత్తుల్లో టింగ్‌జిలె (చైనా)పై గెలిచింది.

రిత్విక్-నిక్కీ జోడీకి టైటిల్



అకాపుల్కో (మెక్సికో): జీఎన్‌పీ సెగురోస్ ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పురుషుల డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో రిత్విక్-నిక్కీ పునాచా (భారత్) ద్వయం 7-6 (7/4), 7-5తో టాప్ సీడ్ ల్యూక్ జాన్సన్ (బ్రిటన్)-మన్సూరి (ట్యునీషియా) జంటను బోల్తా కొట్టించి విజేతగా నిలిచింది. రిత్విక్-నిక్కీ జోడీకి 9,350 డాలర్ల (రూ. 7 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీ, 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రిత్విక్ కెరీర్‌లో ఇది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. గత ఏడాది అక్టోబర్‌లో ఇటలీలో జరిగిన ఒల్‌బ్లా ఓపెన్‌లో అర్జున్ ఖడేతో కలిసి తొలి టైటిల్ నెగ్గిన రిత్విక్ గత నెలలో మెక్సికో జరిగిన సాన్ లూయిస్ ఓపెన్‌లో నిక్కీతో కలిసి రెండో టైటిల్ సాధించాడు.



బెంగళూరు రనౌట్

- ఆఖరి బంతికి ఓడిన ఆర్‌సీబీ
- ఏడో ఓటమితో ప్లే ఆఫ్స్ ఆశలు ఆవిరి!
- కోల్‌కతా ఖాతాలో ఐదో విజయం
- మెరిపించిన సాల్ట్, శ్రేయస్
- మలుపు తిప్పిన రసెల్ బౌలింగ్

కోల్‌కతా: చేతిలో 2 వికెట్లున్న బెంగళూరు ఆఖరి ఓవర్లో గెలవాలంటే 21 పరుగులు చేయాలి. దినేశ్ కార్తీక్ సహా బ్యాటర్లంతా అవుటవడంతో కోల్‌కతా గెలుపు దాదాపు ఖాయమైంది. క్రీజులో ఉన్నది కరణ్ శర్మ, సిరాజ్‌లాంటి బౌలర్లే! స్టార్క్ వేసిన ఈ ఓవర్లో తొలి నాలుగు బంతుల్లో కరణ్ 3 సిక్స్‌లు బాదడంతో 2 బంతుల్లో 3 పరుగుల సమీకరణం అనూహ్యంగా బెంగళూరువైపు మొగ్గేలా చేసింది. ఒక్కసారిగా నరాలు తెగే ఉత్కంఠ... ఐదో బంతికి కరణ్ రిటర్న్ క్యాచ్‌తో స్టార్క్‌కు చిక్కాడు. 1 బంతికి 3 పరుగులు చేయాల్సి ఉండగా ఫెర్గూసన్ రెండో పరుగు తీసేలోపే సాల్ట్ మెరుపు వేగంతో వికెట్లను పడేశాడు. అంతే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పరుగు తేడాతో ఓటమి పాలైంది. కోల్‌కతా ఖాతాలో ఐదో విజయం చేరింది. ఆదివారం జరిగిన ఈ ఐపీఎల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 48; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు వేగంతో బ్యాటింగ్ చేయగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్స్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. రింకూ సింగ్ (16 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రసెల్ (20 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు), రమణ్‌దీప్ (9 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు.


రసెల్

జాక్స్, పటిదార్ మెరుపులతో...

కోహ్లి (7 బంతుల్లో 18; 1 ఫోర్, 2 సిక్స్‌లు), డుప్లెసిస్ (7) అవుటయ్యాక కూడా ఆర్‌సీబీ... జాక్స్ (32 బంతుల్లో 55; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), రజత్ పటిదార్ (23 బంతుల్లో 52; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు)ల సిక్సర్లతో గెలుపు దారిలో కనిపించింది. 11 ఓవర్లలో ఆర్‌సీబీ 137/2 స్కోరు చేసింది. 12వ ఓవర్ వేసిన రసెల్ జోరు మీదున్న జాక్స్, పటిదార్‌లను అవుట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. 13వ ఓవర్ వేసిన నరైన్ కూడా గ్రీన్ (6), మహిపాల్ (4)లను అవుట్ చేయడంతో బెంగళూరు కష్టాల్లో పడింది. తర్వాత ప్రభుదేశాయ్ (24), దినేశ్ కార్తీక్ (25) కీలకదశలో నిష్క్రమించారు. చివరి ఓవర్లో కరణ్ ఆశలు రేకెత్తించినా బెంగళూరు విజయానికి చేరువై దూరమైంది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) పటిదార్ (బి) సిరాజ్ 48; నరైన్ (సి) కోహ్లి (బి) యశ్ 10; రఘువంశీ (సి) గ్రీన్ (బి) యశ్ 3; వెంకటేశ్ (సి) మహిపాల్ (బి) గ్రీన్ 16; శ్రేయస్ (సి) డుప్లెసిస్ (బి) గ్రీన్ 50; రింకూ సింగ్ (సి) యశ్ (బి) ఫెర్గూసన్ 24; రసెల్ (నాటౌట్) 27; రమణ్‌దీప్ (నాటౌట్) 24; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 222. వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-75, 4-97, 5-137, 6-179. **బౌలింగ్:** సిరాజ్ 4-0-40-1, యశ్ దయాళ్ 4-0-56-2, ఫెర్గూసన్ 4-0-47-1, కరణ్ శర్మ 4-0-33-0, గ్రీన్ 4-0-35-2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి అండ్ బి) హర్షిత్ రాణా 18; డుప్లెసిస్ (సి) వెంకటేశ్ (బి) వరుణ్ 7; జాక్స్ (సి) రఘువంశీ (బి) రసెల్ 55; పటిదార్ (సి) హర్షిత్ రాణా (బి) రసెల్ 52; గ్రీన్ (సి) రమణ్ దీప్ (బి) నరైన్ 6; ప్రభుదేశాయ్ (సి) రఘువంశీ (బి) హర్షిత్ రాణా 24; మహిపాల్ (సి అండ్ బి) నరైన్ 4; దినేశ్ కార్తీక్ (సి) సాల్ట్ (బి) రసెల్ 25; కరణ్ శర్మ (సి అండ్ బి) స్టార్క్ 20; సిరాజ్ (నాటౌట్) 0; ఫెర్గూసన్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 221. వికెట్ల పతనం:** 1-27, 2-35, 3- 137, 4-138, 5-151, 6-155, 7-187, 8-202, 9-220, 10-221. **బౌలింగ్:** హర్షిత్ 4-0-33-2, స్టార్క్ 3-0-55-1, వరుణ్ 4-0-36-1, నరైన్ 4-0-34-2, సుయశ్ 2-0-33-0, రసెల్ 3-0-25-3.

విజేత యూకీ-అల్బానో జోడీ



మ్యూనిక్: భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో రెండో ఏటీపీ-250 టోర్నీ డబుల్స్ టైటిల్ సాధించాడు. బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)తో కలిసి యూకీ విజేతగా నిలిచాడు. ఫైనల్లో యూకీ-ఒలివెట్టి జంట 7-6 (8/6), 7-6 (7/5)తో ఆండ్రియా మీస్-లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) జోడీపై గెలిచింది. టైటిల్ నెగ్గిన యూకీ జోడీకి 30,610 యూరోల (రూ. 27 లక్షల 16 వేలు) ప్రైజ్‌మనీ, 250 పాయింట్లు లభించాయి. గత ఏడాది యూకీ మలోర్కా ఓపెన్‌లో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో కలిసి తొలి ఏటీపీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

సాయికిశోర్ మాయాజాలం

పంజాబ్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ విజయం


సాయికిశోర్

ముల్లాన్‌పూర్: అహ్మదాబాద్ గడ్డపై 200 లక్ష్యం విధించినా ఛేదించి గెలిచిన పంజాబ్ కింగ్స్‌ను వారి సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ ఓడించి బదులు తీర్చుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయికిశోర్ (4/33) స్పిన్ మాయాజాలం... రాహుల్ తెవాటియా (18 బంతుల్లో 36 నాటౌట్; 7 ఫోర్లు) మెరుపు బ్యాటింగ్‌తో టైటాన్స్ 3 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. తొలుత పంజాబ్ కింగ్స్ సరిగ్గా 20 ఓవర్లలో 142 పరుగులు చేసి ఆలౌటైంది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (21 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆఖర్లో హర్‌ప్రీత్ బ్రార్ (12 బంతుల్లో 29; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. ఈ టోర్నీలో నిలకడగా రాణిస్తున్న శశాంక్ సింగ్, అశుతోష్ శర్మ ఈసారి విఫలమయ్యారు. కెప్టెన్ స్యామ్ కరన్ (19 బంతుల్లో 20; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. స్పిన్నర్ సాయికిశోర్ పంజాబ్‌ను అదేపనిగా దెబ్బమీద దెబ్బ తీశాడు. నూర్ అహ్మద్, మోహిత్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ టైటాన్స్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (29 బంతుల్లో 35; 5 ఫోర్లు), సాయి సుదర్శన్ (34 బంతుల్లో 31; 3 ఫోర్లు) రాణించారు. ఒకదశలో జట్టు స్కోరు 97 పరుగుల వద్ద నాలుగో వికెట్‌గా సుదర్శన్, 103 పరుగుల వద్ద ఒమర్జాయ్ (13) అవుట్ కావడంతో 28 బంతుల్లో 40 పరుగుల సమీకరణం వద్ద పంజాబ్ ఆశలు పెంచుకోగా తెవాటియా ధాటైన ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థికి ఆ అవకాశం ఇవ్వలేదు. హర్షల్ పటేల్ 3, లివింగ్‌స్టోన్ 2 వికెట్లు తీశారు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: స్యామ్ కరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ ఖాన్ 20; ప్రభ్‌సిమ్రన్ (సి) సాహా (బి) మోహిత్ 35; రోసో (ఎల్బీడబ్ల్యూ) (బి) నూర్ అహ్మద్ 9; జితేశ్ (బి) సాయికిశోర్ 13; లివింగ్‌స్టోన్ (సి) తెవాటియా (బి) నూర్ అహ్మద్ 6; శశాంక్ (సి అండ్ బి) సాయికిశోర్ 8; అశుతోష్ (సి) మోహిత్ (బి) సాయికిశోర్ 3; హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) 14; హర్‌ప్రీత్ బ్రార్ (సి) షారుఖ్ ఖాన్ (బి) సాయికిశోర్ 29; హర్షల్ (సి) షారుఖ్ ఖాన్ (బి) మోహిత్ 0; రబడ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 142. వికెట్ల పతనం:** 1-52, 2-63, 3-67, 4-78, 5-86, 6-92, 7-99, 8-139, 9-140, 10-142. **బౌలింగ్:** ఒమర్జాయ్ 2-0-13-0, సందీప్ 1-0-21-0, మోహిత్ శర్మ 4-0-32-2, రషీద్ ఖాన్ 4-0-15-1, నూర్ అహ్మద్ 4-0-20-2, సాయికిశోర్ 4-0-33-4, షారుఖ్ 1-0-7-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) అశుతోష్ (బి) అర్ష్‌దీప్ 13; గిల్ (సి) రబడ (బి) లివింగ్‌స్టోన్ 35; సుదర్శన్ (బి) స్యామ్ కరన్ 31; మిల్లర్ (బి) లివింగ్‌స్టోన్ 4; ఒమర్జాయ్ (సి) జితేశ్ (బి) హర్షల్ 13; తెవాటియా (నాటౌట్) 36; షారుఖ్ ఖాన్ (బి) హర్షల్ 8; రషీద్ ఖాన్ (సి) రోసో (బి) హర్షల్ 3; సాయికిశోర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (19.1 ఓవర్లలో 7 వికెట్లకు) 146. వికెట్ల పతనం:** 1-25, 2-66, 3-77, 4-97, 5-103, 6-138, 7-142. **బౌలింగ్:** రబడ 4-0-40-0, అర్ష్‌దీప్ 2.1-0-17-1, హర్షల్ 3-0-15-3, స్యామ్ కరన్ 2-0-18-1, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-35-0, లివింగ్‌స్టోన్ 4-0-19-2.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × ముంబై
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
చెన్నై	7	4	3	8	0.529
లక్నో	7	4	3	8	0.123
గుజరాత్	8	4	4	8	-1.055
ముంబై	7	3	4	6	-0.133
ఢిల్లీ	8	3	5	6	-0.477
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

నీట్ పీజీ-2024

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ)లో ప్రవేశాలకు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2024 పరీక్ష నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ద్వారా ఎండీ/ఎంఎస్/పీజీ డిప్లొమా తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **అర్హత:** ఎంబీబీఎస్ డిగ్రీ/ప్రొవిజనల్ ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మొత్తం 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. దీనికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం 3 గంటల 30 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.05.2024
» **పరీక్ష తేది:** 23.06.2024.
» **ఫలితాల వెల్లడి:** 15.07.2024.
» **వెబ్‌సైట్:** https://natboard.edu.in

ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, కడలూరు జిల్లాలో 34 పోస్టులు

కడలూరు జిల్లా(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన తలబిరా ప్రాజెక్ట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 34
» **పోస్టుల వివరాలు:** ఇండస్ట్రియల్ వర్కర్(డ్రాఫ్ట్స్‌మ్యాన్)-01, ఇండస్ట్రియల్ వర్కర్(ఎలక్ట్రీషియన్)-03, ఇండస్ట్రియల్ వర్కర్(ఫిట్టర్)-02, ఇండస్ట్రియల్ వర్కర్ (మెకానిక్-మోటార్ వెహికల్)-02, ఇండస్ట్రియల్ వర్కర్ (వైర్‌మ్యాన్)-01, క్లరికల్ అసిస్టెంట్-17, జూనియర్ ఇంజనీర్(సివిల్)-05, జూనియర్ ఇంజనీర్ (మెకానికల్) -02, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, ఐటీఐ, డిప్లొమా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 01.03.2024 నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.38,000, క్లరికల్ అసిస్టెంట్, ఇండస్ట్రియల్ వర్కర్ పోస్టులకు రూ.30,000 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2024
» **వెబ్‌సైట్:** https://www.nlcindia.in

హాల్ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

హైదరాబాద్‌లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్), ఏవియోనిక్స్ డివిజన్‌లో పనిచేసేందుకు అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-03, అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)-03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి 1,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది మేనేజర్(హెచ్‌ఆర్) రిక్రూట్‌మెంట్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియోనిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.hal-india.co.in

ఎంఎస్‌ఎంఈలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ).. సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమ(మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) వివిధ విభాగాల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం); డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ); డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ); డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ).
» **అర్హత:** జనరల్ అభ్యర్థులు 50 శాతం,ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. **గరిష్ఠ వయసు:** 19 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** సీఐటీడీ ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది ప్రిన్సిపల్ డైరెక్టర్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024.
» **ప్రవేశ పరీక్షతేది:** 26.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.citdindia.org

» యూపీఎస్సీ సీఎంఎస్ఈ-2024 నోటిఫికేషన్ విడుదల
» కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు
» మొత్తం నాలుగు విభాగాల్లో 827 ఉద్యోగాల భర్తీ
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100-రూ.1,77,500

కేంద్రంలో మెడికల్ ఆఫీసర్

ఎంబీబీఎస్ అర్హతతో కేంద్రంలో ఉన్నత స్థాయి కొలువు స్వాగతం పలుకుతోంది. యూపీఎస్సీ.. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎంఎస్ఈ)-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని పలు విభాగాల్లో.. మెడికల్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. రాత పరీక్ష, పర్సనాలిటీ టెస్టు ద్వారా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో.. సీఎంఎస్ఈ-2024 వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ప్రస్తుత పరిస్థితుల్లో ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు.. ఆ తర్వాత పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేస్తేనే.. కెరీర్‌లో నిలదొక్కుకునే పరిస్థితి ఉంది. కాని సీఎంఎస్ఈ ద్వారా ఎంబీబీఎస్‌తోనే సుస్థిర కెరీర్ సొంతం చేసుకోవచ్చు.

మొత్తం 827 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన సీఎంఎస్ఈ-2024 నోటిఫికేషన్ ప్రకారం- కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని నాలుగు విభాగాల్లో మొత్తం 827 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులను రెండు కేటగిరీలుగా వర్గీకరించారు. ఇందులో కేటగిరీ-1లో సెంట్రల్ హెల్త్ సర్వీస్ సబ్ కేడర్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్-163 పోస్టులు ఉన్నాయి. అదేవిధంగా కేటగిరీ-2లో.. రైల్వేలో అసిస్టెంట్ డివిజనల్ మెడికల ఆఫీసర్ పోస్టులు 450; న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 14, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 200 పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హతలు

ఎంబీబీఎస్ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. అదే విధంగా.. కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరికి ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాకే అపాయింట్‌మెంట్ ఖరారు చేస్తారు.

వయసు

ఆగస్ట్1, 2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. సెంట్రల్ హెల్త్ సర్వీస్‌లో సబ్‌కేడర్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు 2024, ఆగస్ట్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆకర్షణీయ వేతనాలు

ఎంపికై కొలువులో చేరిన వారికి పే లెవల్-10తో ప్రారంభ వేతనం ఉంటుంది. వేతన శ్రేణి రూ.56,100 - రూ.1,77,500 లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

సీఎంఎస్ఈ ద్వారా మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలిదశలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ ఆధారంగా మలిదశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

తొలి దశ రాత పరీక్ష

- సీఎంఎస్ఈ ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష రెండు పేపర్లుగా 500 మార్కులకు ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు కేటాయించారు. అవి..
- **పేపర్-1:** జనరల్ మెడిసిన్ అండ్ పిడియాట్రిక్స్. ఈ పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పిడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి.
- పేపర్-2ను మూడు భాగాలుగా వర్గీకరించారు. అవి.. ఎ) సర్జరీ; బి) గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్; సి) ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్. ప్రతి విభాగం నుంచి 40 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లలోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.


సీఎంఎస్ఈ-2024

మలిదశలో పర్సనాలిటీ టెస్ట్

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలిదశలో పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ) ఉంటుంది. పోస్టుల సంఖ్యను అనుసరించి 1:2లేదా 1:2.5 నిష్పత్తిలో పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. పర్సనాలిటీ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. అభ్యర్థుల్లోని జనరల్ నాలెడ్జ్‌ను, వైద్య రంగం పట్ల వారికున్న సేవా దృక్పథాన్ని,వ్యక్తిత్వాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పరిశీలిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే తుది జాబితాలో చోటు సాధిస్తే.. కొలువు ఖరారైనట్లే!

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 30
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మే 1 నుంచి మే 7 వరకు
- **సీఎంఎస్ఈ పరీక్ష తేదీ:** 2024, జూలై 14
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించే మార్గం

- రెండు పేపర్లుగా నిర్వహించే తొలిదశ రాత పరీక్షలో రాణించేందుకు అభ్యర్థులు ఎంబీబీఎస్ అకడమిక్స్‌పై పట్టు సాధించాల్సి ఉంటుంది.
- పేపర్-1(జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్)లో కార్డియాలజీ, రెస్పిరేటరీ డిసీజెస్, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, జెనిటో యూరినరీ, న్యూరాలజీ, హెమటాలజీ, ఎండోక్రినాలజీ, మెటబాలిక్ డిసీజెస్, ఇన్ఫెక్షన్స్-కమ్యూనికబుల్ డిసీజెస్, న్యూట్రిషన్/గ్రోత్, డెర్మటాలజీ, మస్కులో-స్కెలిటల్ సిస్టమ్, సైకియాట్రీ, జనరల్ మెడిసిన్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.అదే విధంగా పిడియాట్రిక్స్‌కు సంబంధించి కామన్ చైల్డ్‌హుడ్ ఎమర్జెన్సీస్, న్యూబార్న్ కేర్, నార్మల్ డెవలప్‌మెంటల్ మైల్‌స్టోన్స్, ఇమ్యునైజేషన్ ఇన్ చిల్డ్రన్, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను గుర్తించడం, వారికి కల్పించే చికిత్స మార్గాలు, విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

పేపర్-2కు ఇలా

- పేపర్-2లోని మూడు విభాగాలకు సంబంధించి దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- **సర్జరీ:** జనరల్ సర్జరీకి సంబంధించి గాయాలు, కాలేయం, రక్త నాళాలు, పేగులు, కణితులు, ఉదర సంబంధ సమస్యలు తదితరాలకు సంబంధించిన శస్త్రచికిత్సల అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు యూరలాజికల్ సర్జరీ, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ సర్జరీ, థొరాసిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ఆప్తమాలజీ, అనస్థీసియాలజీ, ట్రామటాలజీ అంశాలను ఔపోసన పట్టాలి.
- **గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్:** ఈ విభాగానికి సంబంధించి గైనకాలజీలో అప్లయిడ్ అనాటమీ, అప్లయిడ్ ఫిజియాలజీ, జెనిటల్ ట్రాక్ట్‌లో ఇన్ఫెక్షన్లు, నియోప్లాస్మా, గర్భాశయం స్థానంలో మార్పులు, కన్వెన్షనల్ కాంట్రాసెప్టివ్స్, యూడీ, ఓరల్ పిల్స్, ఆపరేటివ్ ప్రొసీజర్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్:** ఈ విభాగంలో మంచి మార్కుల కోసం సోషల్ అండ్ కమ్యూనిటీ మెడిసిన్, కాన్సెప్ట్ ఆఫ్ హెల్త్, డిసీజ్, ప్రివెంటివ్ మెడిసిన్, హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్లానింగ్, డెమోగ్రఫీ అండ్ హెల్త్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ హెల్త్, న్యూట్రిషన్ అండ్ హెల్త్, ఆక్యుపేషనల్ హెల్త్, జెనిటిక్స్ అండ్ హెల్త్, ఇంటర్నేషనల్ హెల్త్, మెడికల్ సోషియాలజీ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, నేషనల్ ప్రోగ్రామ్స్ అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.

సమకాలీన సమస్యలపైనా

అభ్యర్థులు సమకాలీన ఆరోగ్య సమస్యలపైనా దృష్టిసారించాలి. ముఖ్యంగా కోవిడ్ పరిస్థితులు, వ్యాక్సిన్లు, వ్యాక్సిన్ ప్రయోగాలు తదితర అంశాల గురించి సమాచారం తెలుసుకోవాలి. అదే విధంగా అంతర్జాతీయంగా కోవిడ్ ప్రభావానికి గురైన దేశాలు, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాలు, నివేదికలు, యూఎన్‌ఓ నివేదికల్లోని ముఖ్యాంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

అకడెమిక్స్‌పై పట్టు

రాత పరీక్షలో మెరుగ్గా రాణించడానికి అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించాలి. ముందుగా పరీక్ష సిలబస్‌ను పరిశీలించి.. అకడమిక్స్‌లోని అంశాలతో బేరీజు వేసుకుంటూ అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదవాలి. అదే విధంగా పాత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపకరిస్తుంది.

ప్రొబేషన్ నిబంధన

ఇండియన్ రైల్వేస్‌లో ఒక ఏడాది, మిగిలిన విభాగాల్లో రెండేళ్ల ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. ఇండియన్ రైల్వేస్‌లో ప్రొబేషన్‌తో పాటు ఫౌండేషన్ కోర్సు విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారిని జూనియర్ టైం స్కేల్ ఆఫీసర్లుగా శాశ్వత ప్రాతిపదికగా విధుల్లోకి తీసుకుంటారు.

- సీఎంఎస్ఈ ద్వారా ఆయా విభాగాలకు ఎంపికైన వారు భవిష్యత్తులో పదోన్నతులతో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
559	151
73,088	22,147

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	15,282	▽	319
డోజోన్స్	37,986	▲	211
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,896	▲	19
డాక్స్	17,742	▲	95
షాంఘై	3,065	▽	9
నికాయ్	37,091	▽	964

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.67	105.22
€	యూరో	ఎస్‌బీఐ	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.62	54.82
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.20	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	12.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.39

రేట్ల కోతతో రాణించేవి ఏవి?


- బంగారానికి అనుకూలం
- ఈక్విటీలకు గణనీయ నష్టాలు
- డాలర్‌కు స్వల్ప బలహీనత
- బాండ్ ఈల్డ్స్‌కు కష్టమే
- సంక్షోభాల రిస్క్ కాదనలేం

యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ముఖ్యమైన ఘట్టాల్లో ఒకటి.. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఎప్పుడు మొదలు పెడుతుందా? అని. ప్రస్తుతానికి ఇది జవాబు లేని ప్రశ్నే. ఫెడ్ ఇప్పటికైతే ఈ దిశగా ఎలాంటి సంకేతాలను పంపలేదు. కానీ, అనలిస్టులు ఎవరికి తోచినట్టు వారు అంచనాలు వేసుకుంటున్నారు. 2024 చివరికి తమ మధ్యస్థ ఫండ్ రేటు 4.6 శాతంగా ఉండొచ్చని మార్చిలో విడుదల చేసిన అంచనాల్లో ఫెడ్ పేర్కొంది. ప్రస్తుతానికి ఇది 5.37 శాతంగా ఉంది. రేట్ల కోత ముహూర్తం ఇంకా ఖరారు కాకపోయినప్పటికీ, ఈ ఏడాది చివరికి 0.75 శాతం మేర ఫెడ్ రేటు తగ్గించడానికి అవకాశాలున్నట్టు స్పష్టమవుతోంది. ఈ పరిస్థితుల్లో రేట్ల కోత ఆరంభమైన తర్వాత ఈక్విటీలు, బంగారం, బాండ్ల చలనం ఎలా ఉంటుందన్న దానిపై విశ్లేషకుల అంచనాలు ఎలా ఉన్నాయో చూద్దాం.





ఈ ఏడాది ముగిసేసరికి మరో ఆరు సార్లు ఫెడ్ సమావేశం కానుంది. సీఎంఈ ఫెడ్‌వాచ్ టూల్ ప్రకారం జూన్‌లో ఫెడ్ రేట్ల కోత చేపడుతుందన్న అంచనాలు 51 శాతంగా ఉన్నాయి. కానీ, ఇది నిజం కావాలని లేదు. ఎందుకంటే ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య యుద్ధం తీవ్రతరం కావడం.. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఈ తరుణంలో ఫెడ్ రేట్ల కోత ఆలస్యం కావచ్చు. కనుక ఇప్పుడా, అప్పుడా అని కాకుండా.. గతంలో ఫెడ్ వడ్డీ రేట్లు గరిష్టానికి చేరి అక్కడే కొనసాగడం.. అక్కడి నుంచి తగ్గించడం మొదలు పెట్టిన తర్వాత వివిధ సాధనాల పనితీరు ఎలా ఉందో చారిత్రక గణాంకాల ఆధారంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



ఈక్విటీలు

వడ్డీ రేట్లు గరిష్టాలకు చేరి అక్కడే కొనసాగిన అన్ని సందర్భాల్లోనూ ఈక్విటీలు ర్యాలీ చేయడాన్ని గమనించొచ్చు. 1989 నుంచి నాలుగు రేట్ల కోత కాలాలను పరిశీలించినప్పుడు.. అన్నింటిలోకి 2006 జూన్ నుంచి 2007 ఆగస్ట్ మధ్య ఈక్విటీలు బంపర్ రాబడులను ఇచ్చాయి. ఈ కాలంలో డోజోన్స్ 20 శాతం ర్యాలీ చేస్తే, నిఫ్టీ 43 శాతం లాభపడింది. రేట్లను తగ్గించే తరుణంలో మాత్రం ఈక్విటీలు గణనీయంగా నష్టపోవడం కనిపించింది. డోజోన్స్‌తో పోలిస్తే నిఫ్టీలోనే నష్టాలు ఎక్కువగా వచ్చాయి. 2019 జూలై నుంచి 2020 మార్చి మధ్య ఫెడ్ వడ్డీ రేటును 2.25 శాతం నుంచి 0.25 శాతానికి తగ్గిస్తూ వచ్చింది. ఈ కాలలో డోజోన్స్ 12 శాతం నష్టపోయింది. కానీ, నిఫ్టీ 28 శాతం పతనాన్ని చూసింది. ఇక 1989 జూన్ నుంచి 1992 సెప్టెంబర్ కాలాన్ని ప్రత్యేకమైనదిగా చెప్పుకోవాలి. ఆ సమయంలో రేట్లు 9.75 శాతం నుంచి 3 శాతానికి దిగిరాగా.. ఈ కాలంలో డోజోన్స్ 32 శాతం లాభపడింది. చారిత్రక గణాంకాల ఆధారంగా చూస్తే.. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు సమయంలో ఈక్విటీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొనే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం డోజోన్స్, నిఫ్టీ రెండూ ఆల్‌టైమ్ గరిష్టాల్లోనే ఉన్నాయి. కనుక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండడం మంచిది. సాంకేతిక అనలిస్టుల విశ్లేషణ ప్రకారం.. రేట్ల కోత ఆరంభానికి ముందు నిఫ్టీ 23,650 వరకు ర్యాలీకి అవకాశం ఉంది. రేట్ల తగ్గింపు మొదలైన తర్వాత నిఫ్టీ 21,500–21,000 వరకు క్షీణించొచ్చని.. అమ్మకాలు మరింత తీవ్రమైతే 20,000–19,500 వరకు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదన్నది విశ్లేషణ.

బంగారం

1989–1992 కాలం మినహా, వడ్డీ రేట్లు గరిష్టాలకు చేరి అక్కడే కొనసాగిన కాలం, అక్కడి నుంచి వడ్డీ రేట్లు తగ్గిన అన్ని సందర్భాల్లో బంగారం ర్యాలీ చేయడం కనిపించింది. ఒక్క 1989–1992 మధ్య వడ్డీ రేట్లు గరిష్టాల్లో కొనసాగిన తరుణంలో బంగారం 6.5 శాతం క్షీణించింది. అంతే కాదు తర్వాత రేట్లు తగ్గించిన తరుణంలోనూ 3 శాతం నష్టపోయింది. మిగిలిన అన్ని సందర్భాల్లో రేట్ల కోత బంగారానికి అనుకూలించింది. సగటున 25 శాతం రాబడిని ఇచ్చింది. ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు తగ్గే దశ ఉంది. దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు ప్రతికూలంగా మారుతున్నాయి. కనుక ఇక్కడి నుంచి బంగారం ర్యాలీకే ఎక్కువ అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

కరెన్సీ

వడ్డీ రేట్లు గరిష్టాల్లో కొనసాగినప్పుడు.. అక్కడి నుంచి తగ్గించినప్పుడు డాలర్ ఇండెక్స్ పనితీరు మిశ్రమంగా ఉండడం కనిపించింది. కనుక రేట్ల కోత మొదలైన తర్వాత డాలర్ గమనం ఎంటన్నది అంచనా వేయడం కష్టమే. కాకపోతే రెండు దశల్లోనూ డాలర్ బలహీన పడే ధోరణే ఎక్కువగా కనిపించింది. కొన్ని సందర్భాల్లో డాలర్ సగటున 2 శాతం మేర లాభపడగా, అదే బలహీనపడిన సందర్భాల్లో అది 10 శాతంగా ఉంది. కానీ మన రూపాయి విషయంలో భిన్నంగా ఉంది. రేట్ల తగ్గింపు దశల్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి నష్టపోవడం కనిపించింది. 2001 జనవరి నుంచి 2003 మధ్య రేట్లు 6.5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించారు. ఈ ఒక్కటి మాత్రం మినహాయింపు. ఈ దశలో రూపాయి 0.4 శాతం లాభపడింది. వడ్డీ రేట్లు ప్రస్తుత గరిష్టాల్లోనే కొనసాగించినంత కాలం డాలర్ ఇండెక్స్‌లో ప్రస్తుత ధోరణే కొనసాగొచ్చు. రేట్ల కోత మొదలైన తర్వాత డాలర్ బలహీనపడేందుకే అవకాశాలు ఉన్నాయి. రూపాయి ఇటీవల డాలర్‌తో బలహీనపడడం మొదలైంది. రేట్ల కోతతో మరింత నష్టపోవచ్చని తెలుస్తోంది. గతేడాది సెప్టెంబర్ నుంచి డాలర్‌తో రూపాయి 82.50–83.50 మధ్యే చలిస్తోంది. ఫెడ్ రేట్ల తగ్గింపు తర్వాత 85.75–86.25 వరకు క్షీణించొచ్చని అనలిస్టులు భావిస్తున్నారు.



బాండ్ ఈల్డ్స్

బాండ్లపై రాబడి (ఈల్డ్స్) అమెరికాలో, మన దగ్గరా ఒకే తీరులో చలిస్తుంటాయి. యూఎస్ 10ఏళ్ల ట్రెజరీ, భారత ప్రభుత్వ పదేళ్ల బాండ్ ఈల్డ్స్ రెండూ కూడా అమెరికాలో వడ్డీ రేట్లు గరిష్టానికి చేరడానికి ముందు, లేదంటే రేట్లను గరిష్ట స్థాయిల్లో కొనసాగించినప్పుడు శిఖర స్థాయికి చేరడం గమనించొచ్చు. రేట్ల కోత సైకిల్ మాత్రం బాండ్ ఈల్డ్స్‌కు ప్రతికూలమే. అమెరికాలో వడ్డీ రేటు (2007 ఆగస్ట్ సమయంలో) 5.25 శాతం నుంచి 0.25 శాతానికి (2008 డిసెంబర్) చేరిన కాలంలో యూఎస్ 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్స్ 4.5 శాతం నుంచి 2.2 శాతానికి తగ్గాయి. భారత ప్రభుత్వ పదేళ్ల బాండ్ ఈల్డ్స్ 7.94 శాతం నుంచి 5.26 శాతానికి క్షీణించాయి. వడ్డీ రేట్లు ప్రస్తుతం గరిష్టానికి చేరి ఇక ఇక్కడి నుంచి తగ్గే అవకాశాలే ఉన్నందున.. బాండ్ ఈల్డ్స్ తగ్గుతాయనే చారిత్రక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక ఇన్వెస్టర్లు ఇక్కడి నుంచి బాండ్ ఈల్డ్స్ ర్యాలీ చేస్తాయనే అంచనాలపై బెట్టింగ్‌కు దూరంగా ఉంటే మంచిది.





వడ్డీ తగ్గింపు - సంక్షోభాలు

చారిత్రకంగా చూస్తే ఫెడ్ రేట్ల కోత చేపట్టిన రెండు సందర్భాల్లో సంక్షోభాలు చవిచూశాయి. 2000 సంవత్సరంలో యూఎస్‌లో వడ్డీ రేట్లు గరిష్టానికి చేరాయి. అదే ఏడాది మేలో 6.5 శాతానికి చేరింది. 2001 జనవరిలో ఒకసారి, మార్చిలో ఒకసారి రెండు విడతల్లో ఫెడ్ రేట్లు తగ్గించింది. అదే ఏడాది నవంబర్‌లో డాట్‌కామ్ బబుల్ ఏర్పడింది. 2006 జూన్‌లో ఫెడ్ రేటు 5.25 శాతం గరిష్టానికి చేరింది. 2007 సెప్టెంబర్‌లో మొదటిసారి ఫెడ్ రేటు తగ్గించింది. అదే ఏడాది డిసెంబర్‌లో ప్రపంచ ఆర్థిక మాంద్యం సంభవించింది. గతంలో మాదిరి ఈ విడత సంక్షోభం రావాలనేమీ లేదు. కానీ ఇన్వెస్టర్లు సదా అప్రమత్తంగా ఉండాలన్నది సూచన. భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం వంటి సంక్షోభాలు ప్రస్తుతం పలు దేశాల ఎకానమీలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఆయా సమస్యల పరిణామాలు ఎటు దారి తీస్తాయో ఎవ్వరూ చెప్పలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొనడం ఇక్కడ ప్రధానంగా ప్రస్తావనాంశం.



వికసిత భారత్ లక్ష్యానికి కీలకంగా సీఎంఏలు



అశ్విన్ దల్వాడి
ఐసీఎంఏఐ ప్రెసిడెంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వికసిత భారత్ లక్ష్యాల సాధనలో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఎంఏ) కీలక పాత్ర పోషించగలరని ఐసీఎంఏఐ ప్రెసిడెంట్ అశ్విన్ జి. దల్వాడి తెలిపారు. వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వ్యయాల నియంత్రణ, రిస్కు మేనేజ్‌మెంట్ మొదలైన అంశాల్లో వారు సేవలు అందించగలరన్నారు. మరోవైపు, శరవేగంగా మారిపోతున్న వ్యాపార పరిస్థితులకు తగ్గట్లుగా కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ సిలబస్‌ను సవరిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే సమీక్ష ప్రక్రియ ప్రారంభించామని, 2026 జనవరి నుంచి సవరించిన సిలబస్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ కెరియర్‌లో రాణించాలంటే ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకుంటూ, ఆర్థిక వ్యవస్థ, సమాజంలో పరిణామాలపై అప్‌డేటెడ్‌గా ఉండాలని విద్యార్థులకు అశ్విన్ సూచించారు. ప్రస్తుతం పరిశ్రమ కేవలం సర్టిఫికెట్‌ను మాత్రమే చూడటం లేదని సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాలు కూడా ఉండాలని కోరుకుంటోందని వివరించారు. లక్ష మంది పైచిలుకు సీఎంఏలు, అయిదు లక్షల మంది పైగా విద్యార్థులతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) .. సీఎంఏలకు సంబంధించి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్ సంస్థగా ఉందని చెప్పారు.

ప్రస్తుతం శాప్ సర్టిఫికేషన్, మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్, ఈ–ఫైలింగ్ వంటి శిక్షణ సదుపాయాలను విద్యార్థులకు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే 15 నెలల ప్రాక్టికల్ శిక్షణను తప్పనిసరి చేయడంతో పాటు బిజినెస్ డేటా అనలిటిక్స్, బిజినెస్ కమ్యూనికేషన్ మొదలైన అంశాలను కూడా ప్రవేశపెట్టినట్లు వివరించారు. సీఎంఏలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల్లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. చైర్మన్, ఎండీ, సీఈవో తదితర స్థాయిలో సేవలు అందిస్తున్నారని వివరించారు.

ముందస్తు రిటైర్మెంట్‌కు ఎంత కావాలి?

మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు నష్టాలను చూపిస్తుంటే.. విక్రయించి, మంచి రాబడులు ఇచ్చే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచి ఆలోచనేనా?

– మునావర్

వైదొలిగే నిర్ణయానికి ముందు.. మీరు పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ పథకం పనిచేసే విభాగంలోని ఇతర పథకాల పనితీరు కూడా ఒకసారి విశ్లేషించాలి. వాటి పనితీరు కూడా ఇదే మాదిరి తగ్గిందా..? లేక మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు మాత్రమే తగ్గిందా? చూడాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్‌ఏవీ క్షీణించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. స్టాక్ మార్కెట్ పడిపోయినా రాబడులు తగ్గుతాయి. ఒక్కో పథకం ఒక్కో కాలంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఉంటుంది. అది చూసి ఒక పథకం నుంచి మరో పథకంలోకి మారిపోవడం సరైన నిర్ణయం కాదు. కాకపోతే ఏదైనా ఒక పథకం వరుసగా రెండు నుంచి మూడేళ్ల పాటు ప్రతికూల పనితీరే చూపిస్తున్నట్టు అయితే, అప్పుడు పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గురించి ఆలోచన చేయవచ్చు. దీనికంటే ముందు తక్కువ పనితీరు చూపించడం వెనుక కారణాన్ని గుర్తించాలి. ఫండ్ మేనేజర్‌లో మార్పు కారణంగా రాబడులు తగ్గితే మాత్రం, మీ పెట్టుబడులను తీసుకుని బయటకు రావచ్చు. ఒకవేళ ఫండ్ మేనేజర్‌లో మార్పు లేకపోతే.. రాబడులు మందగించడానికి గల కారణాన్ని సాధారణంగా వారు మీడియాకు వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు. లేదంటే ఆయా ఫండ్ సంస్థ నెలవారీ న్యూస్‌లెటర్‌లోనూ సమాచారాన్ని వెల్లడిస్తుంటారు. పథకం పెట్టుబడుల విధానం వల్ల కూడా తాత్కాలికంగా రాబడులు మెరుగ్గా ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో పథకం పనితీరును తప్పుబట్టడం సరైనది కాకపోవచ్చు. ఉదాహణకు గ్రోత్ ఆధారిత విధానంతో పోలిస్తే వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానం కాస్త ఆలస్యంగా ఫలితాలను ఇస్తుంది. అటువంటప్పుడు మీరు పెట్టుబడులను కొనసాగించొచ్చు. ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకం అన్ని కాలాల్లోనూ అద్భుత పనితీరు చూపించాలంటే, ఆచరణలో సాధ్యం కాదు. అన్ని పథకాలు సానుకూల, ప్రతికూల సందర్భాలను ఎదుర్కొంటూ వెళుతుంటాయి. కనుక పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ చూడాలి.



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను 40 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకోవాలని అనుకుంటున్నాను. రిటైర్మెంట్ కోసం ఎంత ఫండ్ కావాలో ఎలా తెలుసుకోవాలి?

– శ్రీమన్నారాయణ భట్టు

రిటైర్మెంట్‌కు ఎంత కావాలో నిర్ణయించుకునే విషయంలో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ద్రవ్యోల్బణం మీ జీవన వ్యయాలను పెంచుతుంది. కనుక ప్రస్తుతం మీ వార్షిక వ్యయాలు ఎంతన్నది లెక్కించుకోవాలి. ఈ మొత్తానికి ఏటా 6 శాతం ద్రవ్యోల్బణాన్ని రిటైర్మెంట్ పీరియడ్ వరకు కలపాలి. రిటైర్మెంట్ తర్వాత ఎంత కాలం పాటు అంచనాగా జీవిస్తారో.. అన్నేళ్లతో దీన్ని హెచ్చించాలి. ఉదాహరణకు ప్రస్తుతం మీకు నెలవారీ ఖర్చులు రూ.50 వేలు ఉన్నాయనుకుంటే, ఏడాదికి రూ.6 లక్షలు అవుతుంది. ఇక్కడి నుంచి మరో పదేళ్లలో రిటైర్ అవుతారు. ఈ పదేళ్ల కాలానికి 6 శాతం ద్రవ్యోల్బణం కలిపి చూస్తే ప్రస్తుతం ఉన్న వార్షిక జీవన వ్యయం రూ.6 లక్షలు కాస్తా, పదేళ్ల తర్వాత 10.74 లక్షలకు పెరుగుతుంది. మీరు 48 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుని, 80 ఏళ్ల వరకు జీవించి ఉంటారని అనుకుంటే, అప్పుడు రిటైర్మెంట్ తర్వాత 32 ఏళ్ల జీవన కాలం ఉంటుంది. 32 ఏళ్లను వార్షిక జీవన వ్యయం 10.74 లక్షలతో లెక్కిస్తే అప్పుడు రూ.3.44 కోట్లు అవుతుంది. ఈ మొత్తం రిటైర్మెంట్ ఫండ్‌గా కావాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2024 ఫామ్ ధర...

విశాఖ	411-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	397-00
విజయవాడ	397-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

65 ఏళ్లు దాటినా కొత్త హెల్త్ పాలసీ

వయో పరిమితి తొలగించిన రెగ్యులేటర్

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా మార్కెట్‌ను విస్తరించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ వ్యయాల భారం నుంచి ప్రజలకు తగినంత రక్షణ కల్పించే దిశగా బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ చర్యలు తీసుకుంది. వ్యక్తులు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవడానికి 65 ఏళ్ల వయో పరిమితిని తొలగించింది. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం 65 ఏళ్ల వయస్సు వరకే కొత్త ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడానికి వీలుంది. అయితే, తాజాగా ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త సవరణ ప్రకారం వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని కొనుగోలు చేయొచ్చు. అన్ని వయస్సుల, వర్గాల వారికి (సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పిల్లలు, మెటర్నిటీ) అనువైన ఆరోగ్య బీమా పథకాలను రూపొందించడంపై బీమా సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది. అలాగే ముందు నుంచి ఏ రకమైన అనారోగ్యాలు ఉన్న వారికైనా (ప్రీ–ఎగ్జిస్టింగ్ మెడికల్ కండీషన్) కవరేజీనిచ్చేలా హెల్త్ పాలసీల రూపకల్పన చేయాలని పేర్కొంది. ట్రావెల్ పాలసీలను కేవలం జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలే ఆఫర్ చేయాలి. ఆయుష్ ట్రీట్‌మెంట్ కవరేజీపై ఎటువంటి పరిమితి ఉండదు. ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునానీ, సిద్ధ, హోమియోపతి కింద చికిత్సలకు సైతం ఎటువంటి పరిమితి లేకుండా సమ్ ఇన్సూర్డ్ వరకు కవరేజీ వర్తిస్తుంది.



సాక్షి స్టాక్స్

లేటెంట్ వ్యూ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 508 **టార్గెట్:** రూ. 630

ఎందుకంటే: ఏఐ ఆధారిత బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్, రెవెన్యూ గ్రోత్ మేనేజ్‌మెంట్ సర్వీసులందించే డెసిషన్ పాయింట్‌లో తొలుత మెజారిటీ(70 శాతం) వాటాను కొనుగోలు చేయనుంది. తద్వారా డిజిటల్ అనలిటిక్స్ కన్సల్టింగ్, సొల్యూషన్లు అందించే లేటెంట్ వ్యూ అనలిటిక్స్ లిమిటెడ్ రిటైల్ సీపీజీ విభాగంలో మరింత బలపడనుంది. 2024 ఏడాదిలో డెసిషన్ పాయింట్ ఆదాయం 12.8 మిలియన్ డాలర్లుకాగా.. వార్షికంగా 50-60 శాతం వృద్ధిని సాధిస్తోంది. 30 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లతో కంపెనీపరంగా 19 శాతం పురోగతిని అందుకుంది. డెసిషన్ పాయింట్‌లో 70 శాతం వాటా విలువ 39.1 మిలియన్ డాలర్లుకాగా, ఈవీ/అమ్మకాలతో పోలిస్తే 4.4 రెట్లు, 21 పీఈకి సమానం. నో క్యాష్, నో డెట్ ప్రాతిపదికన చేసిన మదింపు ఇది. 2024 మార్చికల్లా లేటెంట్ వ్యూ చేతిలో 147 మిలియన్ డాలర్ల నగదు నిల్వలను కలిగి ఉంది. వెరసి డెసిషన్ పాయింట్ కొనుగోలు తదుపరి 110 మిలియన్ డాలర్ల నగదు బ్యాలెన్స్‌ను కలిగి ఉంటుంది. డెసిషన్ పాయింట్‌లో మిగిలిన 30 శాతం వాటాను 2027 ఆర్థిక సంవత్సరం క్యూ1లో సొంతం చేసుకోనుంది. ఈ కొనుగోలు ద్వారా కంపెనీ ఆదాయానికి 17 శాతం జత కలవనున్నట్లు అంచనా. ఫలితంగా 2025కల్లా కన్సాలిడేటెడ్ ఆదాయం 108 మిలియన్ డాలర్లకు చేరే అవకాశముంది. డెసిషన్ పాయింట్ పూర్తిగా విదేశాలలో కార్యకలాపాలు సాగిస్తోంది. అత్యంత లాభదాయకంగా నిలుస్తోంది. రెండు కంపెనీల కలయిక రెండేళ్లలో (2025-26) అర్థవంతమైన మార్పులకు దారి చూపవచ్చని అంచనా.



యుఫో మూవీజ్ | వెంచురా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 144 **టార్గెట్:** రూ. 214

ఎందుకంటే: ఎంటర్‌టైన్‌మెంట్ రంగ కంపెనీ యుఫో మూవీజ్ ఇండియా లిమిటెడ్ రానున్న కాలంలో పటిష్ట పనితీరు చూపేందుకు వీలుంది. కంపెనీ ఇటీవలే టీఎస్‌ఆర్ ఫిల్మ్స్‌ను కొనుగోలు చేసింది. దీంతో కంపెనీ నిర్వహణలోని మొత్తం స్క్రీన్ల సంఖ్య 3,808ను తాకాయి. 2023 సెప్టెంబర్‌లో వీటి సంఖ్య 3,303గా నమోదైంది. ఈ బాటలో కంపెనీ మొత్తం ఆదాయం సైతం 2022–23లో సాధించిన రూ. 396 కోట్ల నుంచి 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 639 కోట్లకు పుంజుకోగలదని అంచనా. వార్షికంగా సగటున దాదాపు 13 శాతం పురోగతిని అందుకోగదని భావిస్తున్నాం. అప్పటికల్లా నిర్వహణ సామర్థ్యం ఫలితంగా కన్సాలిడేటెడ్ నిర్వహణ లాభం(ఇబిటా) దాదాపు 40 శాతం స్థాయిలో జంప్‌చేసే అవకాశముంది. దీంతో ఇబిటా రూ. 122 కోట్లకు చేరగలదని ఊహిస్తున్నాం. ఈ ప్రభావంతో 2023లో నమోదైన రూ. 21 కోట్ల నికర నష్టం స్థానే 2024లో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించే వీలుంది. రూ. 16 కోట్ల నికర లాభం ఆర్జించవచ్చు. ఆపై రానున్న మూడేళ్లపాటు వార్షిక ప్రాతిపదికన నికర లాభం 32.2 శాతం చొప్పున మెరుగుపడగలదని అంచనా. వెరసి 2027కల్లా రూ. 37 కోట్లను అధిగమించే అవకాశముంది. 2024తో పోలిస్తే 2027కల్లా నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 11 శాతం బలపడి 19.1 శాతానికి, నికర లాభమార్జిన్లు 1.9 శాతం పుంజుకుని 5.9 శాతానికి చేరవచ్చని భావిస్తున్నాం. అయితే ప్రకటనల విభాగం మందగించడం, సినిమా ప్రేక్షకులు తగ్గడం, క్యూబ్‌తో ఏర్పాటు చేసుకున్న జేవీ ముగిసిపోవడం వంటి అంశాలు ప్రధాన రిస్కులుగా పేర్కొనవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఐపీఎల్‌లో 'బ్లాక్' మ్యాజిక్!

- ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు కొన్ని క్షణాలే.. ఆపై అన్నీ బ్లాక్‌లోనే..
- రూ. 2 వేల టికెట్ రూ.7,500కు.. రూ. 25 వేలు పలుకుతున్న గ్రౌండ్‌ఫ్లోర్ టికెట్
- ఏజెంట్లు, క్లబ్ సెక్రటరీల టికెట్ల వ్యాపారం
- 25న ఉప్పల్‌లో హైదరాబాద్–బెంగళూరు మధ్య మ్యాచ్ టికెట్లలో మాయాజాలం



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఓవైపు పరుగుల వర్షం కురుస్తుంటే మరోవైపు మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో 'బ్లాక్'మ్యాజిక్ జరుగుతోంది. ఈనెల 25న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్–రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగే మ్యాచ్ టికెట్ల రేట్లు బ్లాక్‌లో ఆకాశాన్నంటుతున్నాయి. టికెట్ల అమ్మకాల విషయంలో పారదర్శక విధానం లేకపోవడంతో 28 వేల టికెట్లను దాదాపు ఐదింతల ధరకు ఇష్టారీతిన నిర్వాహకులు విక్రయిస్తున్నారు. టికెట్ల విక్రయాలు చేపట్టిన సంస్థ సబ్ ఏజెంట్లను నియమించుకొని రూ. 2 వేల టికెట్‌ను ఏకంగా రూ. 7,500 విక్రయిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్ టికెట్లను రూ. 25 వేలకు బ్లాక్‌లో అమ్ముతోంది. ఇదే అదనుగా హెచ్‌సీఏ క్లబ్‌లకు కాంప్లిమెంటరీగా ఇచ్చిన టికెట్లను సైతం సెక్రటరీలు ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకానికి పెట్టారు.

నిర్వాహకులు ఆడిందే ఆట..: ఉప్పల్ స్టేడియం మొత్తం సీటింగ్ సామర్థ్యం 39,400. అందులో 10 శాతం టికెట్లను హెచ్‌సీఏకు ఇవ్వగా మిగిలిన టికెట్లను హైదరాబాద్ సన్‌రైజర్స్ ఎంపిక చేసిన పేటీఎం, దాని సబ్ ఏజెంట్లు విక్రయిస్తున్నాయి. ఎక్కడా ఆఫ్‌లైన్ టికెట్ కౌంటర్ సేల్స్ పెట్టకుండా టికెట్లను కేవలం కొన్ని క్షణాలపాటు ఆన్‌లైన్‌లో విక్రయించాయి. ఆ తర్వాత అంతా 'బ్లాక్'మ్యాజికే. రూ. 1,750గా నిర్ధారించిన కనీస టికెట్‌ను రూ. 3 వేలకుపైగా, రూ. 2,500 టికెట్‌ను రూ. 7,500కు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఇక క్లబ్ హౌస్, సౌత్ గ్రౌండ్ ఫ్లోర్ టికెట్లయితే రూ. లక్షల్లో పలుకుతున్నాయి.

చోద్యం చూస్తున్న యంత్రాంగం..

హైదరాబాద్‌లో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ బ్లాక్ మార్కెట్‌పై అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించిందన్న ఆరోపణలు వినిపించాయి. ప్రభుత్వంలోని కీలక విభాగాలు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలకు తగినన్ని కాంప్లిమెంటరీ పాస్‌లు ఇస్తున్నందుకే యంత్రాంగం బ్లాక్ మార్కెట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్న ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ క్రికెట్ అభిమానులను అవమానపరిచేలా టికెట్ల విక్రయం ఉందని విమర్శించారు. ఈ విషయంలో యంత్రాంగం తక్షణం స్పందించకపోతే 25న మ్యాచ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

శివ.. అతిపెద్ద డైనోసార్!

భూమ్మీద తిరుగాడిన అతిపెద్ద డైనోసార్ ఏదో తెలుసా..? దాని పేరు 'శివ'. అదేంటి డైనోసార్ అంటూ.. హిందూ దేవుడు శివుడి పేరు చెప్పున్నారేంటి? అని కోపం తెచ్చుకోవద్దు. ఇది నిజమే. భూమ్మీద జీవించిన అతిపెద్ద సర్పం శిలాజాలను మనదేశంలో కనుగొన్న శాస్త్రవేత్తలు శివుడి మెడలో ఉండే సర్పం వాసుకి పేరును దానికి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అసలు ఆ శివుడి పేరిటే ఉన్న భారీ డైనోసార్ సంగతేమిటో తెలుసుకుందామా..

శిలాజాలపై పరిశోధన చేస్తూ..

కొన్ని నెలల కింద అర్జెంటీనా పశ్చిమ ప్రాంతంలో పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు.. ఇప్పటివరకు గుర్తించిన అన్ని డైనోసార్ల కన్నా పెద్దవైన కొత్త రకం డైనోసార్ శిలాజాలను గుర్తించారు. దాన్ని అత్యంత పొడవైన మెడతో ఉండే శాఖాహార సారోపాడ్ డైనోసార్ల జాతికి చెందిన ఉప జాతిగా తేల్చారు. సుమారు 9 కోట్ల ఏళ్ల కింద ఇవి భూమ్మీద తిరుగాడాయని తేల్చారు. దీనికి 'బస్టింగోరీటైటాన్ శివ'అని పేరుపెట్టారు. ఇవి ఏకంగా 98 అడుగుల (30 మీటర్ల) పొడవుతో.. 74 టన్నుల బరువుతో ఉండేవని అంచనా వేశారు. అయితే ఇదే సారోపాడ్ల జాతికి చెందిన టైటనోసార్ డైనోసార్లు కూడా అత్యంత భారీవే. అవి కూడా 'శివ'డైనోసార్‌తో కాస్త అటూఇటూగా బరువు ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



ఇంతకీ ఈ పేరెందుకు పెట్టారు?

హిందూ పురాణాల్లో.. 'సృష్టినిలయం (నాశనం) చేసి.. పునర్నిర్మాణానికి వీలు కల్పించేది శివుడే'అన్నదాని నుంచి స్ఫూర్తి పొంది ఈ అతి భారీ డైనోసార్‌కు 'శివుడి'పేరు పెట్టామని పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త మరియా సిమోన్ తెలిపారు. ఇక తన పొలంలో అతిభారీ ఎముక శిలాజాలను గుర్తించి సమాచారం ఇచ్చిన రైతు మాన్యుయేల్ బస్టింగోరీ పేరును దానికి జోడించామని వివరించారు. – సాక్షి, సెంట్రల్ డెస్క్

వైభవంగా శ్రీవారి వసంతోత్సవాలు

- నేడు స్వర్ణ రథోత్సవం



తిరుమల: తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ముందుగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం జరిపారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోదకం(గంధం) తో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారు బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

శిలాతోరణం పార్కులో ఏనుగుల బీభత్సం

తిరుమల: తిరుమల నుంచి శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గంలో ఉన్న శిలాతోరణం పార్కులో ఏనుగులు బీభత్సం సృష్టించిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. ఏనుగుల గుంపు శిలాతోరణం పార్కులోకి ప్రవేశించి పూల మొక్కలను తొక్కివేయడంతోపాటు, ఫెన్సింగ్‌ను నాశనం చేశాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని డప్పులు వాయిస్తూ, టపాకాయలు కాల్చుతూ ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. వేసవి కావడంతో నీటి కోసం తరచూ ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంతం నుంచి భక్తులు తిరిగే ప్రాంతాల్లోకి వస్తున్నట్లు సమాచారం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.